# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 7 విజయవాడ 5-8-2008 పేజీలు : 12 వెల: రు 5.00



లోపలి పేజీలలో.....

- వ్యవసాయ సమస్యపై - లెనిన్
- జన్యుమార్పిడి ఆహారపంటల ముప్పు
- రాన్‌బాక్సీ అమ్మివేత
- సెజ్‌ల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులు
- సాగర్ డెల్టా ఆధునీకరణా? ప్రైవేటీకరణా?
- దారిమళ్ళుతున్న పేదల బియ్యం


# పార్లమెంటరీ ప్రహసనం

వామపక్ష కూటమి యుపిఏ ప్రభుత్వానికి మద్దతునుపసంహరించుకున్న జులై 7 తేదీ నుండి పార్లమెంటు విశ్వాస తీర్మానంపై ఓటింగు జరిగిన జులై 22వ తేదీ వరకూ సాగిన ఘటనల క్రమమంతా భారత పార్లమెంటరీ వ్యవస్థ ఎంతగా కుళ్ళిపోయిందో తేటతెల్లం చేసింది. సూత్రాలకూ, విధానాలకూ తిలోదకాలిచ్చి అధికారం పొందటమే లక్ష్యంగా వివిధ రాజకీయ పార్టీల మధ్య సాగిన బేరసారాలు జుగుప్స కలిగించాయి. అధికారంలో వున్న యుపిఏ, ప్రతిపక్షంలో వున్న ఎన్‌డిఏల బలాబలాల లెక్కలు అంకెల గారడీలయ్యాయి. బడా పరిశ్రమాధినేతలు నడుం బిగించి బరిలోకి దిగి ఎంపిల కొనుగోలుకు డబ్బు వెదజల్లారు. హత్యలు, కిడ్నాపులు వంటి తీవ్ర నేరారోపణలతో జైలులో వున్న నేరస్త చరిత్ర కలిగిన ఎంపిలు విడుదలైవచ్చి సగౌరవంగా దేశ భవిష్యత్తు నిర్ణయంలో పాలు పంచుకున్నారు. సామ్రాజ్యవాద దేశాల రాయబారులు రాజకీయ పార్టీల నేతలను కలిసి మంతనాలాడారు. చివరకు అరుపులు, నోట్ల కట్టల ప్రదర్శనల మధ్య అసలు సమస్య మీద ఏ చర్చా జరగకుండానే విశ్వాసతీర్మానం నెగ్గింది. ఆ తర్వాత పార్టీ నిర్ణయాన్ని మీరారంటూ దాదాపు అన్ని పార్టీలు తమ సభ్యులపై తీసుకున్న "క్రమశిక్షణా" చర్యలను గమనిస్తే, ఈ బేరసారాలు లేకపోతే ప్రభుత్వం ఓడిపోయి వుండేదన్నది అందరికీ అర్థమైన విషయమే. దేశ ప్రజల భవిష్యత్తును నిర్ణయించే విధానాలన్నీ వాటి మంచి చెడ్డలనుబట్టి కాక పార్లమెంటు సభ్యుల సంకుచిత స్వార్థ ప్రయోజనాలనుబట్టి నిర్ణయమౌతున్నాయని మరోసారి స్పష్టమైంది.

ఈ మొత్తం ప్రహసనంలో నష్టపోయింది భారత ప్రజలు. నూతన ఆర్థిక విధానాలను పి.వి.నరసింహారావు ప్రభుత్వం ప్రారంభించిన నాటి నుండీ, ఆ విధానాల మంచి చెడులను పార్లమెంటు క్షుణ్ణంగా చర్చించిన పాపాన ఏనాడు పోలేదు. అయినా అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీ, కూటమి అదే విధానాలను కొనసాగిస్తూ వస్తున్నాయి. ఇన్నేళ్ల తర్వాత ఒక ముఖ్యమైన సమస్య మీద ప్రభుత్వం విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే, అధికారపక్షంతోసహా ఏ పక్షమూ అణుఒప్పందపు మంచి, చెడులను పార్లమెంటులో చర్చించలేదంటే, వాటన్నింటిమధ్యా సామ్రాజ్యవాదులకు సేవ చేయటంలో ఎంతటి ఐక్యత వుందో అర్థమౌతుంది.. అయినాసరే సిగ్గులేకుండా మన్మోహన్ సింగ్ , కాంగ్రెసు పార్టీలు తమ విధానాలకు పార్లమెంటు ఆమోదం తెలిపిందనీ, ఆ విధంగా దేశప్రజలందరూ ఆమోదం తెలిపారనీ ప్రకటించుకుంటున్నాయి. అణుఒప్పందమేకాక తాము కోరుకున్న విధానాలన్నీ అమలుజరపమన్న ప్రజాతీర్పుగా దీనిని చిత్రిస్తున్నారు.

**అసలు కారణమైన అణుఒప్పందానికే వస్తే, అమెరికా, ఫ్రాన్సు, జర్మనీ వంటి సామ్రాజ్యవాద దేశాలే అణువిద్యుదుత్పత్తి కేంద్రాలను మూసివేస్తుండగా, భారత పాలకులు అణువిద్యుత్తు రియాక్టర్లను నిర్మించపూనుకున్నారెందుకు?** 40 ఏళ్ల నుండి 10 వేల మెగావాట్లు కూడా చేయలేకపోయారన్న వాస్తవం, దీనికైన ఖర్చులో ఐదవ వంతుతో 8 ఏళ్లలో అణువిద్యుత్తుకు రెట్టింపు విద్యుత్తును గాలిమరలు ఉత్పత్తి చేశాయన్న వాస్తవం కళ్ల ముందుండగా, గ్రామాలలో ఇళ్లల్లో బల్బు వెలగాలంటే అణువిద్యుత్తే శరణ్యమని ప్రచారమెలా చేస్తున్నారు? దేశం నలుమూలలా యిప్పటికే 17 రియాక్టర్లుండగా మరో 20 రియాక్టర్లు పెట్టడమంటే ఎప్పుడైనా పేలిపోగల అణుబాంబులను ప్రజలనెత్తిన పెట్టడమేనన్న నిపుణుల అభిప్రాయం ఎందుకు పట్టించుకోరు? ఇన్ని ప్రమాదాలను నెత్తిన తెచ్చిపెట్టుకున్నా దేశ అవసరాలలో 10 శాతం మాత్రమే అణువిద్యుత్తు తీరుస్తుందంటున్న పాలకులే మిగిలిన 90 శాతం అవసరాలను తీర్చే విద్యుత్తు వనరులను కాదని అణువిద్యుత్తు జపమే ఎందుకు చేస్తున్నట్లు? ఇంతకీ ఒప్పందంలో ఏముంది? ఇది భారత ప్రజలకు మాత్రమే రహస్యం. భారత్‌తో తాను చేసుకోబోతున్న ఒప్పందాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తన వెబ్‌సైట్లో పెట్టగా, భారత ప్రభుత్వం మాత్రం అది రహస్య డాక్యుమెంటునీ ఒప్పందం జరిగిన తర్వాత పార్లమెంటుకు చూపుతానంటున్నది. ఈ రహస్యం దేనికోసం? వీటిలో ఏ ఒక్క ప్రశ్నకూ పార్లమెంటులో చర్చ సమాధానం లేదు.

ప్రజలకెదురౌతున్న ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చే ఉద్దేశ్యం వారికెవరికీ లేదు. ఎందుకంటే పార్లమెంటరీ పార్టీలు వేటికి అణుఒప్పందంపట్ల వ్యతిరేకత లేదు. ఎన్‌డిఏ కూటమికి నాయకత్వం వహిస్తున్న బిజెపి నాయకుడు అద్వానిని మీరెందుకు అణుఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నారని ఫ్రాన్సు రాయబారి అడగ్గా, ఆయన కుండబ్రద్దలు కొట్టినంత స్పష్టంగా, ప్రధాన ప్రతిపక్షమైన మాతో కాంగ్రెసు పార్టీ సంప్రదించకపోవటాన్ని వ్యతిరేకిస్తున్నాము తప్ప అణుఒప్పందాన్ని తాము వ్యతిరేకించటం లేదని చెప్పాడు. సిపిఎం తదితర వామపక్షాలకు కూడా అణుఒప్పందంలోని అంగీకృత అంశాలపై వివాదం తప్ప, అణువిద్యుత్తు, దానికోసం ఒప్పందంపట్ల వ్యతిరేకత లేదు. రష్యా "సహాయం"తో కూడంకుళం వద్ద అణు రియాక్టర్ల నిర్మాణాన్ని వారు వ్యతిరేకించటం లేదు. అలాగే ఈ ఒప్పందం ప్రకారం ఒక అణురియాక్టరు పశ్చిమబెంగాల్లో నిర్మిస్తారు. దీనిని వద్దనీ అనటం లేదు. మన్మోహన్‌సింగ్ వెళ్లి బుష్‌తో అసలు ఒప్పందం చేసుకునేటప్పుడు, మద్దతు వెనక్కు తీసుకుంటామనీ అనకుండా, దానికి అనుబంధంగా జరిగే ఒప్పందాలు జరగరాదంటూ మద్దతు ఉపసంహరించుకుని పోరాటయోధులుగా ఫోజుపెట్టడం చూస్తే, పాలకవర్గాల రైలుబండి ఆగినప్పుడు రివిజనిస్టులు దానిని నెడతారు; పరుగెడుతున్నప్పుడు తిడతారు అన్న కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి మాటలు గుర్తుకు రాకమానవు. మిగిలిన ఛప్పన్న పార్టీలకు ఏవైపున వుంటే రాబోయే ఎన్నికల్లో గద్దెనెక్కవచ్చునన్న లెక్కలు తప్ప వీరెవరికీ అణుఒప్పందం జరగటంపై వ్యతిరేకత లేదు. అంతేకాదు. దేశ సర్వ ఆర్థిక, సహజ, మానవ వనరులనూ సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేయటమే తప్ప మరో స్వతంత్ర విధానం లేదు.

ఈ ఒప్పందం వల్ల లబ్ధి పొందేదెవరన్నది పరిణామాలను గమనిస్తున్న వారెవరికైనా అర్థమౌతుంది. అమెరికా సెనెట్ కమిటీ ముందు ఇచ్చిన వాఙ్మూలంలో అమెరికా మంత్రిణి కండొలెస్సా రైస్ మూసివేతకు సిద్ధంగా వున్న అమెరికా అణురియాక్టర్ల పరిశ్రమ తిరిగి పనిచేస్తుంది. ఆరు లక్షల మంది అమెరికనులకు ఉద్యోగాలు దొరుకుతాయి. 25 వేల కోట్ల డాలర్ల అణువాణిజ్యం జరుగుతుంది. ఇన్ని లాభాలున్నందునే భారత్‌తో అణుఒప్పందాన్ని బుష్ ప్రభుత్వం చేసుకుంటున్నది అని చెప్పింది.

భారతదేశానికి ఒరిగేదేమిటి? అంతా అనుకున్నట్లే జరిగితే ఇప్పటి నుండి 20 ఏళ్లకు గానీ అణువిద్యుత్తు ఉత్పత్తి కాదు. చెప్పినా, చెప్పకుండా వుంచినా ఖర్చులన్నీ కలిపితే అణువిద్యుత్తు యూనిటు 17 రూపాయలవుతుంది. ఈ రేటున అమ్మలేరు. కాబట్టి ప్రభుత్వమే దానిని భరిస్తుంది. అంటే ప్రజల మీద పన్నులువేసి 25 వేల కోట్ల రూపాయలు అమెరికా పరిశ్రమలకు చెల్లిస్తుంది.

కనుకనే ఈ ఒప్పందాన్ని అమలుజరపడానికి మాకు ఆమోదముద్ర లభించిందంటూ ఉత్సాహపడుతున్న యుపిఏ ప్రభుత్వం తీసుకునే చర్యలతో ప్రజా జీవనం మరింత కష్టాలమయమౌతుంది. అన్ని ప్రజాజీవన రంగాలలో సామ్రాజ్యవాదుల, భూస్వామ్యశక్తుల ఆధిపత్యం దోపిడీ పెరిగి ప్రజల ఊపిరికి కూడా ఖరీదు కట్టి వసూలు చేస్తాయి. ఈ దోపిడీ పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలపై సంఘటిత పోరాటాలను సాగిస్తేనే తప్ప ప్రజల జీవితాలలో ఇసుమంత శాంతి కూడా లభ్యం కాదు.

◈

## సంపాదకీయం

# ఆగస్టు 20 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి!

దేశ ప్రయోజనాలు, దేశ ప్రజల అవసరాలు పట్టని పాలకులు, పాలకవర్గాలు, ప్రభుత్వాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణను తలకెత్తుకొని అత్యుత్సాహంతో అమలు జరుపుతున్నాయి. సామ్రాజ్యవాద దోపిడీని సుగమం చేసే నయా ఉదారవాద ఆర్థిక విధానాలు నిర్దేశిస్తున్న సంస్కరణలను అమలుజరుపుతున్నాయి. ఈ విధానాల అమలులో భాగంగా దేశంలోని వివిధ చట్టాలు సరళీకృతం చేయబడి దేశంలోకి విదేశీ పెట్టుబడులు ప్రవహించి నిరాఘాటంగా దోపిడీ చేసుకోవటానికి అవకాశాలు కల్పించాయి. సామ్రాజ్యవాద సంపన్న దేశాల ఉత్పత్తులు మన దేశపు మార్కెట్లలోకి కుమ్మరించటానికి అవకాశాలు కల్పించాయి. దేశంలోని సహజ వనరులనూ, సహజ సంపదలను సామ్రాజ్యవాద బడా కార్పోరేట్లు యదేచ్ఛగా కొల్లగొట్టుకుపోవటానికి పూర్తి అవకాశాలు కల్పించాయి. దేశంలోని శ్రామికుల రక్త, మాంసాలను పీల్చుకొని వారి శ్రమను కొల్లగొట్టుకోవటానికి బడా పెట్టుబడిదారీ వర్గానికి పూర్తి అవకాశం కల్పించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే దేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాదానికి దాసోహం చేయటం జరిగింది.

పాలకులు అమలుపరుస్తున్న ఈ దేశ వ్యతిరేక, ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద దోపిడీ అనుకూల విధానాల పర్యవసానంగా దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలూ ప్రైవేటీకరింపబడ్డాయి. ఇంకా ప్రైవేటీకరింపబడకుండా మిగలిన సంస్థలూ, పరిశ్రమలూ పాక్షికంగానూ, పరోక్షంగానూ ప్రైవేటీకరింపబడుతూ అంతిమంగా ప్రైవేటుపరం కాబోతున్నాయి.

దేశ ఆర్థికవ్యవస్థకు వెన్నుముకగా వున్న వ్యవసాయరంగం తీవ్రమయిన సంక్షోభానికి గురి చేయబడి పరాధీనస్థితికి నెట్టబడుతున్నది.

వ్యవస్థీకృత పునర్నిర్మాణం, మవులిక సదుపాయాల ఏర్పాటు పేరిట దేశ సంపదనంతా సామ్రాజ్యవాద కార్పోరేట్లు సునాయాసంగా తరలించుకుపోవటానికి వీలుగా జల, రోడ్, రైలు, వాయు రవాణా రంగాలు మలచబడుతున్నాయి.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, ప్రత్యేక ఎగుమతి మండళ్ళు, ప్రత్యేక వ్యవసాయిక మండళ్ళు పేరిట దేశంలో స్వతంత్ర ప్రతిపత్తి గల స్వయంపాలిత ప్రాంతాలు ఏర్పాటు చేయబడి, యివి బడా పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గానికి ధారాదత్తం చేయబడుతున్నాయి. వీటి ఏర్పాటుకోసం వందల, వేల ఎకరాల భూమిని రైతుల నుండి ప్రభుత్వం బలవంతంగా గుంజుకొంటోంది. ఈ ఆర్థిక మండళ్ళకు వేలకోట్ల రూపాయల పన్ను రాయితీలు కల్పించుతున్నాయి.

దేశంలోని ఉత్పత్తి రంగానికి బదులు సామ్రాజ్యవాద కార్పోరేటు సంస్థల అవసరాల కోసం సేవారంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేస్తున్నాయి.

సామ్రాజ్యవాద దోపిడీ ముమ్మరం కావటానికి వీలుగా ఎగుమతి-దిగుమతి విధానాలు సరళీకరించుతున్నాయి. ఇదంతా దేశాభివృద్ధికోసమేనని పాలకులు బుకాయిస్తున్నారు. కోస్టల్ జోన్ మేనేజిమెంటు (సముద్రతీర ప్రాంత నిర్వహణ) పేరిట దేశంలోగల 8వేల కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతాన్ని సామ్రాజ్యవాద కార్పోరేట్ల అవసరంకోసం వారికి అమ్మివేయటం జరుగుతోంది.

ఈ పరిణామాల ఫలితంగా దేశంలోని సామాన్య ప్రజానీకపు జీవనస్థితిగతులు నానాటికీ దిగజారిపోతున్నాయి. వేగవంతంగా దేశ ఆర్థికస్థితి అభివృద్ధి చెందుతోందని చెప్పబడుతున్నప్పటికీ, దేశంలో కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలు మరింతవేగంగా నిరుపేదలవుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజానీకం తమ సంప్రదాయక జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారు. మవులిక సదుపాయాల ఏర్పాటుకోసం నిర్మించుతున్న మెగా ప్రాజెక్టుల వలన లక్షల మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు.

పారిశ్రామిక రంగంలోని కార్మికులు తీవ్రమయిన శ్రమదోపిడీకి గురిచేయబడుతున్నారు. గత కాలంలో కార్మికవర్గం సాధించుకున్న హక్కులు, సదుపాయాలు హరింపబడుతున్నాయి. సమ్మె హక్కు నిరాకరింపబడింది. 8 గంటల పని దినాన్ని రద్దుచేసి, ఎక్కువ గంటల పనిదినాన్ని కార్మికులపై బలవంతంగా రుద్దటానికి చట్టపరమయిన ప్రయత్నాలు చెయ్యబడుతున్నాయి. పని ప్రదేశాలలో పెద్ద యెత్తున ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టీకరణ, క్యాజువలీకరణలు దేశవ్యాపితంగా చోటుచేసుకుంటున్నాయి. తమ సమస్యల పరిష్కారంకోసం న్యాయసమ్మతంగానే ఆందోళనలకు పూనుకొంటున్న కార్మికులను, కార్మిక సంఘాలను సహితం యజమానులు, ప్రభుత్వ యంత్రాంగమూ బలప్రయోగంతో, దమననీతితో అణచివేస్తున్నాయి. అసంఘటితరంగంలో పనిచేసే కోట్లాది కార్మికులకు కనీస సామాజిక భద్రతను కల్పించటం కూడా జరుగలేదు. కార్మికుల-ఉద్యోగుల పెన్షన్ నిధులను, పి.ఎఫ్. నిధులనూ స్టాక్ మార్కెట్టు లావాదేవీల జూదానికి తోడ్పాటు యిచ్చేందుకు, సంపన్నులకు కట్టబెట్టేందుకూ తరలింపబడుతున్నాయి.

హెచ్చు జి.డి.పి. వృద్ధిఫలాలు పెట్టుబడిదారీ, సంపన్నవర్గాల వారికి కైంకర్యం చేయబడి, సంపదను సృష్టిస్తున్న కార్మికవర్గం, రైతాంగం సంక్షోభంలోకి, మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నది. దేశంలోని కోట్లాది ప్రజలు కటిక దారిద్ర్యానికి నెట్టబడుతున్నారు.

(తరువాయి 7వ పేజీలో)

# అమెరికా-భారత్ అణుఒప్పందం దేశ వ్యతిరేకం!
# దాని అమలును ఆపేందుకు పోరాడండి!

**బుష్‌తో** ముందుగానే ఒప్పందం చేసుకుని, తప్పుడు ప్రచారంతో ప్రజలను నమ్మింపజూసి, వామపక్షాలు మద్దతునుపసంహరించుకున్నందున ఏర్పడిన యిబ్బందిని సమాజవాది వంటి పార్టీలతోదాటి, పార్లమెంటులో విశ్వాస తీర్మానంలో గెలిచినా ప్రధాన మన్మోహన్ సింగ్, కాంగ్రెసు పార్టీ నాయకత్వం ఇప్పుడు అణుసరఫరా బృందంతోనూ, అంతర్జాతీయ అణుశక్తి సంస్థతోనూ ఒప్పందాలపై సంతకాలు చేసి, అమెరికా-భారత్ అణుఒప్పందాన్ని అమలులోకి తెచ్చేందుకు సిద్ధమౌతున్నది.

ఈ ఒప్పందం వల్ల దేశ కరెంటు కష్టాలేవీ తీరవన్నది తేటతెల్లమే. కాగా ఈ ఒప్పందం అమెరికాకు మన దేశాన్ని మరింత వ్యూహాత్మక బానిసను చేస్తుంది. ఈ అంశంపై యుపిఏకు మద్దతును వామపక్ష ఫ్రంటు ఉపసంహరించుకున్నప్పటికీ, నష్టమంతా జరిగిన తర్వాతే జరిగింది. ఈ ఒప్పందాన్ని ఆపాలని అది నిజంగా కోరుకుని వుంటే మన్మోహన్ సింగ్, బుష్‌లు ఒప్పందంపై సంతకాలు పెట్టకముందే ఉపసంహరించుకుని వుండేది. యుపిఏ-వామపక్ష సమన్వయ కమిటీలో నిరర్ధకమైన చర్చలలో వామపక్షాలను వుంచి, ప్రధాని ఒప్పందం చేసుకునే చర్యలన్నింటినీ అమలు జరిపించేశాడు. అమెరికా, భారత్‌లలోని పాలకులిరువురూ దీనినిప్పుడు అమలుచేసేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఎన్నికలు దాదాపుగా ఒక ఏడాదిలోగా వున్నందున బుష్ నిర్దేశించిన కాలవ్యవధిలోనే ఒప్పందాన్ని అమలుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం కదులుతున్నది.

ఇలాంటి ప్రజావ్యతిరేక, దేశవ్యతిరేక ప్రభుత్వానికి నాలుగేళ్లపాటు మద్దతునిచ్చిన సిపిఎం. వామపక్ష ఫ్రంటులు భారత కార్మిక వర్గాన్నీ, శ్రామిక ప్రజలనూ వంచించాయి. కాంగ్రెసు, దానితో చేతులు కలిపిన పార్టీలు తమ నిజవర్గ స్వభావాన్ని బయటపెట్టుకున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యూహాత్మక లొంగుబాటుకు యుపిఏ ప్రభుత్వం దేశాన్ని సిగ్గులేకుండా నడుపుతున్న సమయంలో, దేశ వ్యతిరేక ఒప్పందం అమలును ఆపివేయాలని పోరాడవలసిన కర్తవ్యం ప్రజాస్వామిక, దేశభక్త, విప్లవశక్తులందరిపైనా వుంది.

**11-7-2008**

**కేంద్ర కమిటి,**
**సి.పి.ఐ.(ఎం.ఎల్)**

పత్రికా ప్రకటన:

# బెంగుళూరు, అహ్మదాబాదు ప్రేలుళ్ళను ఖండించండి!

**జులై** 25న బెంగుళూరులోనూ, **జులై 26న అహ్మదాబాదులోనూ అమాయక** ప్రజలు ప్రాణాలు కోల్పోవటానికీ, గాయపడటానికీ కారణమైన బాంబు పేలుళ్ళను అందరూ తీవ్రంగా ఖండించాలి. అమాయక ప్రజలను భయభ్రాంతులను చేయటానికి పథకం ప్రకారం టెర్రరిస్టులు చేసిన దాడో, లేక కొద్దిమంది మతఛాందసవాదులు చేసిన దాడో ఇంకా తెలియరాలేదు. తమకు చెందిన ఒక వర్గం ప్రజలపై గతంలో చేసిన దాడులకు ప్రతీకారమన్న పేరిట ఎవరైనా ఈ పని చేసి వుంటే, వారు తెలివిహీనులై వుండాలి; చరిత్ర నుండి పాఠం నేర్చుకోలేనంతగా కొట్టుకుపోయేవారై ఉండాలి. 2001 సెప్టెంబరు 11న అమెరికాలో జరిగిన ఘటనకు చాలా మంది ఆనందించారు. కానీ అంతిమ ఫలితమేమిటి? అమెరికా సామ్రాజ్యవాదం, డాలరు ఆధిపత్యాలను ప్రశ్నించి, చమురును యూరోపు మార్కెట్టుకు అమ్మేందుకు సద్దాం హుస్సేన్ ప్రయత్నించిన సమయంలో ఇది జరిగింది లేదా జరిగేట్లు చేశారు. అది అమెరికా సృష్టించిన తాలిబాన్లు అమెరికాకే ఎదురు తిరిగిన కాలం. ఈ ఘటనను ఉపయోగించుకొని అమెరికా సామ్రాజ్యవాదం ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దురాక్రమణ చేసింది; సద్దాం హుస్సేన్‌నూ, లక్షలాది ప్రజలనూ హత్యచేసింది. ఆ రెండు దేశాలనూ వినాశనానికి గురిచేసింది. ఈ టెర్రరిజంపై పోరు అన్న సాకును చూపి ప్రపంచ దేశాలపై తన పెత్తనాన్ని సాగిస్తున్నది. ఈ చరిత్రను చూసినవారెవరూ అమాయకులకు ప్రాణహాని కల్గించే పాలకులకు లాభపడే సాకును యిచ్చే ఈ పిచ్చి చర్యలకు పాల్పడరు. వీటిలో గనుక మైనారిటీ మతానికి చెందిన యువకులు పాల్గొని వుంటే, చరిత్ర నుండి పాఠాలు నేర్చుకొమ్మనీ, మెజారిటీ ఛాందసవాదుల, పాలకుల కుట్రలను ఓడించేందుకు ప్రజాస్వామిక, లౌకికశక్తులతో చేతులు కలపమని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇలాంటి దాడులు జరిగినప్పుడు మైనారిటీ మతస్థులైన ముస్లింలను వేలెత్తి చూపటం నేరపూరిత చర్య. బాబ్రీ మసీదు విధ్వంసంతో సహా అనేక సందర్భాల్లో హిందూ ఛాందసవాదులే తీవ్ర టెర్రరిస్టు చర్యలకు పాల్పడ్డారు. బూటకపు గోధ్రా ఘటన, దానిననుసరించి గుజరాత్‌లో సాగించిన మారణకాండ ఇలాంటివే. కానీ వీటికి నాయకత్వం వహించిన ఎవరినీ అరెస్టు చెయ్యలేదు. ఇంతేకాక, పాలకవ్యవస్థలో వీరే నాయకత్వ స్థానాల్లో వున్నారు. అమరనాథ్ క్షేత్రం బోర్డుకు భూమి కేటాయింపులో కూడా, హిందూత్వ శక్తులను సంతృప్తి పరిచేందుకే కాంగ్రెసు చర్యలు తీసుకుంది. కాశ్మీర్ ప్రజలు దీనిని వ్యతిరేకించినప్పుడు, నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని సంఘపరివార్‌శక్తులు మతోన్మాదాన్ని పెంచేందుకు మరో ఆయుధాన్ని అందించింది. రామసేతు తదితర ఏ సమస్యనైనా మతోన్మాదాన్ని పెంచేందుకు సంఘపరివార్ ఉపయోగించుకుంటుంటే, కాంగ్రెసు దానికే తోడ్పడింది. ఈ పాలకవర్గ పార్టీలే ప్రపంచీకరణ దుష్పరిణామాల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు మతోన్మాదాన్ని వినియోగించుకుంటున్నాయి. బెంగుళూరు, అహమ్మదాబాదు వంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరగటానికి వీరే కారకులు. చివరకు అమెరికా-భారత్ అణు ఒప్పందంపై కూడా మతభావనలు రెచ్చగొట్టి ఉపయోగపెట్టుకోజూశారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి రావటం పెరిగే కొద్ది ఈ పాలకవర్గ పార్టీల (వి) నాయకులు అన్ని నీచ పద్ధతుల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే చూస్తారు.

నానాటికీ పెరుగుతున్న మతోన్మాదానికి వీరే కారకులైనప్పటికీ, బెంగుళూరు, అహ్మదాబాద్ వంటి ఘటనలకు పాల్పడినవారు తెలిసో, తెలియకో ఆ శక్తులకే తోడ్పడుతున్నారు; సామ్రాజ్యవాదానికి దేశాన్ని దాసోహపరిచే వారి విధానాల అమలుకు సహాయపడ్డవారవుతున్నారు. కనుక వారిని బహిర్గతపరిచి పాలకవర్గాలూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగే ప్రజాపోరాటాలు ప్రక్కదారి పట్టకుండా చూడాలి. దీనికోసం ప్రజాస్వామిక, విప్లవశక్తులందరూ చేతులు కలపాలి.

**27-8-2008**

**కేంద్ర కమిటి,**
**సి.పి.ఐ.(ఎం.ఎల్)**

# ఎనర్జీ (శక్తి) భద్రత ఎవరికోసం?

**ఇటీవల** పార్లమెంటులో విశ్వాస తీర్మానంపై సాగిన చర్చను ముగిస్తూ ప్రధాని మన్మోహన్ చేసిన ఉపన్యాసంలో దేశానికి ఎనర్జీ భద్రత అవసరమనీ, అమెరికాతో అణుఒప్పందం అలాంటి భద్రతనిస్తుందనీ అన్నారు. అసలు ఎనర్జీ భద్రత ఏమిటి? ప్రధాని మాటలు వాస్తవమేనా? భద్రత ఎవరి కోసం? అన్న ప్రశ్నలు ఎదురౌతున్నాయి.

వివిధ కార్యకలాపాలకు శక్తి అవసరం. రాత్రి వెలుగునిచ్చేందుకు, విద్యుత్తు, కార్లు, రైళ్లు నడిచేందుకు పెట్రోలు, డీజిలు; పరిశ్రమలు నడిచేందుకు విద్యుత్తు, బొగ్గు అవసరం. కనుక పెట్రోలు, విద్యుత్తు, బొగ్గు-వీటిని శక్తినందించేవిగానూ, వీటి ఉత్పత్తికి వాడే ముడిపదార్థాలను శక్తివనరులుగానూ పేర్కొంటారు. ఈ ఎనర్జీ లేకుండా అభివృద్ధి లేదు. కనుక ఎనర్జీ కొరత లేకుండా వనరులను సమీకరించుకుని వినియోగించుకోగల అవకాశం కలిగి వుండటాన్నే ప్రధాని ఎనర్జీ భద్రత అంటున్నారని భావించాల్సి వుంటుంది.

ఈ ఎనర్జీలో ప్రధానమైనది విద్యుత్తు. దీనిని జలవనరుల నుండి తయారు చేసుకోవచ్చును. అలాగే బొగ్గు, పెట్రోలియంల ద్వారా ఉష్ణశక్తి నుండి తయారు చేసుకోవచ్చును. అలాగే అణువిచ్ఛేదం నుండి పుట్టే వేడితో విద్యుత్తును తయారు చేసుకోవచ్చును. ఇవికాక, గాలి ప్రవాహం, సూర్యరశ్మి, వ్యర్థపదార్థాలు తదితర సంప్రదాయేతర పద్ధతుల నుండి తయారు చేసుకో వచ్చును. ఒక దేశానికున్న వనరుల లభ్యతనుబట్టి తగిన పద్ధతులతో విద్యుదుత్పత్తిని చేసుకొనే ప్రణాళికను రచించి అమలు జరుపుకుంటారు. శక్తివనరులలో మరొక ముఖ్యమైనది పెట్రోలు, బొగ్గు. వీటిని విద్యుదుత్పత్తికే కాక, వాటినే నేరుగా కూడా శక్తిగా వాడుకోవచ్చును.

భారతదేశానికి వస్తే **జలవనరులు అపారంగా వుండటమేకాక అవి తరిగిపోవు. జలవనరులను ఉపయోగించుకుని విద్యుదుత్పాదన జరుగుతున్నది. అన్నింటికన్నా ఇదే చౌక. వీటిని పూర్తిగా** వినియోగించుకునే **చర్యల వైపుగా** ప్రభుత్వం ఆలోచించటం లేదు. అదేమంటే పెద్ద ప్రాజెక్టులతో సమస్యలున్నాయంటున్నది కానీ చిన్న స్థాయిలోనూ, మధ్యస్థాయిలోనూ, ముంపు, నిర్వాసిత సమస్యలు లేకుండా జలవిద్యుదుత్పాదనకు అవకాశాలు పుష్కలంగా వున్నాయి. వీటిని ఉపయోగించుకోవాలంటే అధికార వికేంద్రీకరణ జరిగి గ్రామస్థాయిలో ప్రజాస్వామిక వ్యవస్థ దాని పరిపాలన నెలకొనాలి. ఇది భారత దోపిడీ **పాలకవర్గాలకు వ్యతిరేకమైనది.** కాగా ప్రజలకు అన్ని విధాలా ప్రయోజనకరమైనదిగా వుంటుంది. కనుక ఈ వనరుల వినియోగాన్ని ప్రక్కన పెడుతున్నాయి.

అలాగే తరిగిపోని వనరులుగా వున్న సంప్రదాయేతర పద్ధతులను కూడా వినియోగిస్తామంటూ మాటలే తప్ప ఫలప్రదమైన కార్యాచరణ శూన్యం.

ఇక మిగిలింది థర్మల్ విద్యుత్తు మన దేశంలో బొగ్గు వనరులు పుష్కలంగా వున్నందున, ఈ థర్మల్ కేంద్రాలను నిర్మించి, నిర్వహించగల సాంకేతిక పరిజ్ఞానమూ, సామర్థ్యమూ వున్నందున బొగ్గు నుండి విద్యుదుత్పాదన చేసుకోవచ్చును. దీనిలో సమస్య కాలుష్యం. వాయు కాలుష్యాన్ని నిరోధించగల సాంకేతిక పరిజ్ఞానం మన కందుబాటులో వుంది. బొగ్గు కాల్చినందువల్ల మిగిలే ఫ్లైయాష్‌ను ఏం చెయ్యాలన్న సమస్య గతంలో వుండేది. దీనితో ఇటుకలు, రోడ్ల నిర్మాణానికి వాడవచ్చునని నిరూపితమైంది, ఇప్పటికే వాడుతున్నారు. పెట్రోలియం నుండి వచ్చే నాఫ్తా, సహజవాయువులను కూడా వాడుకోవచ్చును. ఈ వనరులు మనకున్నాయి.

ఈ వనరులన్నింటినీ ఒక సమీకృత ప్రణాళికతో వినియోగించుకోవాలి. భారత పాలకులకు అలాంటి సమగ్ర ప్రణాళిక లేదు. అంతేకాక ఈ వనరులను సామ్రాజ్యవాదుల కనుసన్నలలో, వారు సూచించిన పద్ధతుల్లో వాడుతున్నారు. ఉదాహరణకు పెట్రోలియం, సహజవాయువులనే తీసుకుందాం.

పెట్రోలియం చమురును అన్వేషణ, వెలికితీత, శుద్ధి చేయగల సాంకేతిక పరిజ్ఞానమూ, సామర్థ్యమూ భారత ప్రభుత్వ సంస్థలైన ఓఎన్‌జిసి, ఐఓసి, హెచ్‌పి, ఐబిపిల కుంది. నిల్వల ప్రాథమిక సర్వేను నిర్వహించగల భూగర్భ (జియాలజీ) శాస్త్ర విజ్ఞానమూ, ఉపగ్రహ సర్వేను చేయగల రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు భారత్‌కున్నాయి. అయినప్పటికీ చమురు రంగాన్ని ప్రైవేటీకరణ పేరుతో బహుళజాతి కంపెనీలపరం చేశాయి నూతన చమురు వెలికితీత, లైసెన్సింగ్ విధానంతో (ఎన్ఇఎల్‌పి)తో చమురు లభ్యం కాగల ప్రాంతాలను బ్లాకులుగా విడగొట్టి వేలంపెట్టి అమ్మి వేసింది. ఈ విధాన పలితంగా మన దేశపు పెట్రోలునే మనం అధిక ధరలు పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

కృష్ణా బేసిన్‌లోని ఒక బ్లాకును బ్రిటన్‌కు చెందిన కెయిర్న్ ఎనర్జీ అన్న కంపెనీ కొనుగోలు చేసుకుంది. అందులో బావులు తవ్వింది. చివరకు మూడు, నాలుగు బావుల్లో చమురు పడింది. వాణిజ్యపరంగా దానిని వెలికి తీయవచ్చునని తేలింది. 2008 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారభమైంది. మరో మూడు నెలల్లో రెండో బావి నుండి కూడా చమురు తోడటం ప్రారంభమౌతుంది. కేయిర్న్ ఎనర్జీ తన కంపెనీ డైరెక్టర్లకు సమర్పించిన వార్షిక నివేదికలో ఇక్కడ చమురు వెలికితీతకు బ్యారెలుకు నాలుగున్నర డాలర్లు వ్యయమయిందనీ, కార్మికుల, ఉద్యోగుల ఖర్చులు, భారత ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలు, సెస్సులను కలిపితే ఒక బ్యారెలు చమురుకు పదిన్నర డాలర్లు వ్యయమయిందనీ పేర్కొంది. (ఈనాడు 27.6.2008, విజయవాడ ఎడిషన్). అంటే ప్రస్తుతం పదిన్నర డాలర్లకు బయటకొచ్చిన చమురును కేయిర్న్ ఎనర్జీ కంపెనీ అంతర్జాతీయ రేట్ల ప్రకారం బ్యారెలు 150 డాలర్లకు అమ్ముకుంటుంది భారత్ తానే కొనుక్కుంటానన్నా ఈ రేటు చెల్లించాల్సిందే.

ఆయిలు వెలికితీత ఒప్పందాల్లో తోడిన చమురులో కొంత భాగాన్ని ఆ ప్రభుత్వానికి యివ్వాలి అది 40 శాతమా లేక 50 శాతమా అన్నది ఒప్పందం చేసుకున్న దాన్నిబట్టి వుంటుంది. చమురును యిస్తారా, ఆ చమురుకు ధర కట్టి డబ్బులు యిస్తారా అన్నది కూడా ఒప్పందంలో వుంటుంది. చమురు ధర బ్యారెలు 25 డాలర్లు ఉన్న సమయంలో, అది కూడా బ్యారెలు 30 డాలర్లకు మించి పెరుగుతుందని ఎవరూ ఊహించని రోజుల్లో కేయిర్న్ ఎనర్జీతో ఒప్పందం జరిగింది ఒప్పందం వివరాలు భారత ప్రభుత్వం వెల్లడించలేదు అయితే బ్యారెలు 25 డాలర్ల చొప్పున డబ్బు రూపంలో పుచ్చుకునేందుకు ఒప్పందం జరిగిందని ఈ రంగంలోని అభిజ్ఞ వర్గాలంటున్నాయి. కేజి బేసిన్‌లో గ్యాసు విషయంలో రిలయన్సు కంపెనీతోనూ ఇలాంటి ఒప్పందమే జరిగినట్లు తెలుస్తుంది గనుక అభిజ్ఞ వర్గాల కథనం నమ్మదగినదిగానే వుంది.

భారతదేశ వనరులను కారుచౌకగా విదేశీ కంపెనీలకు కట్టబెట్టారు. భారత్‌కు రావాల్సిన ఉత్పత్తిలో వాటాను కూడా కారుచౌకగా అమ్మివేశారు. ఇప్పుడు ఆ విదేశీ కంపెనీల నుండి అత్యధిక ధరలకు చమురును కొనుగోలు చేసుకొనే స్థితిలో పడ్డారు దీనికిబదులుగా **ఓఎన్‌జిసితోనే ఆ చమురును వెలికితీసి** వుంటే బ్యారలు పదిన్నర డాలర్లకే మనకు లభ్యమై వుండేది. మిగిలిన 50 శాతం దేశంలోనే ఉత్పత్తి అయివుండేది. ఈ కాలంలోనే వ్యక్తిగత రవాణా సాధనాలను ప్రోత్సహించారు. ప్రజా రవాణా వ్యవస్థలను బలహీనపరిచారు. అలా కాకుండా ప్రజారవాణా వ్యవస్థలను విస్తరించి, పటిష్టపరిచి వుంటే, వ్యక్తిగత రవాణా వాహనాల వాడకాన్ని ద్రవ్య, ద్రవ్యేతర పద్ధతుల్లో నిరుత్సాహ పరచి వుంటే, మన చమురు వినియోగం 30 శాతం తగ్గి వుండేది. అప్పుడు అంతర్జాతీయ మార్కెట్టులో గుత్తాధిపత్యంతో బహుళజాతి కంపెనీలు పెంచివేస్తున్న ధరల ప్రభావం భారతదేశంపై పడకుండా, ఆర్థిక వ్యవస్థ నిలకడగా వుండేది. అప్పుడు నిజమైన అర్థంలో ఎనర్జీ భద్రత ఏర్పడి వుండేది.

ఇప్పుడు అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదులు చమురు ధరలను పెంచివేసి, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వనరులను దోపిడీ చేసుకుంటుంటే, ఆ దోపిడీ కనువుగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచివేసి, భారత ప్రజలపై దోపిడీ భారాన్నంతా పాలకులు మోపుతున్నారు అంతేగాక అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగిపోయినందున అనివార్యంగా పెంచాల్సి వస్తున్నదని, భరించక తప్పదని దగాకోరు నిర్ణయాలు చేసి, ప్రజల జీవితాలను మరింత కడగండ్ల పాల్జేస్తున్నారు ఈ విధంగా వ్యవహరించడం సామ్రాజ్యవాదులకు సేవ చేయటమేగాక వారికి దేశ, ప్రజల ప్రయోజనాలను పణంగా పెడ్తున్నారు.

ఈ విధంగా భారత ఎనర్జీ వనరులలో ముఖ్య భాగాన్ని సామ్రాజ్యవాదుల పరంచేసి, వారి ముందు చేతులు కట్టుకుని నిలబడి అణువిద్యుత్తు కొరకు అణుఇంధనాన్ని యిమ్మని దేబిరిస్తూ, దేశ ప్రజల ప్రయోజనాలను మరింతగా సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయబూనుకున్న పాలకులు "ఎనర్జీ భద్రత" గురించి మాట్లాడటమే వారి వంచనా శిల్ప చాతుర్యానికి పరాకాష్ట కనుకనే వీరు చెబుతున్న ఎనర్జీ "భద్రత" విధానాలన్నీ ఎనర్జీ వనరులపై సామ్రాజ్యవాదులకున్న గుత్తాధిపత్యానికి "భద్రత"ను కల్పించేవే తప్ప .భారత ప్రజలకు భద్రతనిచ్చేవికావు. కానేరవు ◈

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

# వ్యవసాయ సమస్యపై: కామ్రేడ్ లెనిన్

(కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క -రెండవ సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానం)

**రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యంలో, భూపంపక నినాదం వ్యర్థమనీ, గిట్టుబాటు కాని మడిచెక్కల సాగుకు రైతాంగాన్ని కట్టివేయటమవుతుందనీ, కనుక విప్లవకారులు దున్నేవానికే భూమి నినాదాన్ని వదలివేసి, రైతాంగాన్ని సంక్షోభం నుండి బయటవేసే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని కొందరూ, భూముల జాతీయకరణ, సోషలిస్టు విప్లవ కార్యక్రమమే అమలు జరపాలని మరికొందరూ వాదిస్తున్నారు. ఈ వాదనను అనుసరిస్తే వ్యవసాయ విప్లవోద్యమ నిర్మాణాన్ని వదలివేయటమవుతుంది. దేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి వత్తాసు పలకటంగా ఆచరణ దిగజారుతుంది.**

**విప్లవ నాయకుడిగా కార్మికవర్గం వ్యవసాయ సమస్యపై తీసుకోవలసిన వైఖరిని వివరిస్తూ లెనిన్ వ్రాసిన వ్యాసమిది. పెట్టుబడిదారీ దేశాల్లో- వాటిలో అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా, భూస్వాముల నుండి స్వాధీనం చేసుకున్న భూములను రైతాంగానికి పంచవలసిన ఆవశ్యకతను వివరించిన వ్యాసమిది. పెట్టుబడిదారీ సంక్షోభంతోనూ, యుద్ధభారంతోనూ రైతాంగం చితికిపోయిన దశలో కూడా భూమి పంపక ఆవశ్యకతనూ, దాని పునాదిగా విప్లవాన్ని కార్మికవర్గం విజయవంతం చేయవలసిన తీరునూ వివరించిన వ్యాసమిది.**

**భారత్ వంటి అర్ధవలస, అర్ధఫ్యూడలు దేశాలకు దున్నేవానికే భూమి నినాదం కేంద్ర విప్లవ కర్తవ్యంగా వుంటుందని తెలిపే వ్యాసమిది.**

**- సంపాదకుడు.**

1. పెట్టుబడిదారీ విధానం ఉన్నంత వరకూ తప్పనిసరిగా జరిగే సామ్రాజ్యవాద యుద్ధాల నుంచి, పెట్టుబడిదారుల యొక్క భూస్వాముల యొక్క దోపిడీ నుంచి పల్లె ప్రాంతాల్లోని శ్రామికులను విముక్తి చేయగలిగినది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద నడుపబడే ఒక్క పట్టణ పారిశ్రామిక కార్మికవర్గమే. బూర్జువా వర్గం, భూస్వాములు కల్పించిన బానిస సంకెళ్ళను త్రెంచుకొని విముక్తి పొందాలంటే ఈ కమ్యూనిస్టు కార్మికులతోచేరి, వారి విప్లవ పోరాటానికి సంపూర్ణ సహకారం చేయడం తప్ప గ్రామ పేదలకు- ప్రస్తుతం మరొక మార్గం లేదు.

కాని పారిశ్రామిక కార్మికులు, ఇతర ప్రపంచంతో జోక్యం లేకుండా ఏదో తమకున్నదానితో తృప్తిపడి, బూర్జువా నిర్మిత సంఘంతో తమ ఆర్థిక పరిస్థితిని నెమ్మదిగా అభివృద్ధి చేసుకుంటూ కాలం గడుపు దామనుకుంటే, యుద్ధాల నుంచి, పెట్టుబడిదారుల దోపిడీ నుంచి, మానవ సమాజాన్ని విముక్తి గావించే తమ చారిత్రాత్మక కర్తవ్యాన్ని నెరవేర్చలేరు.

పారిశ్రామికంగా అభివృద్ధి అయిన అనేక దేశాల్లోని కార్మిక నాయకుల విషయంలో నిజంగా జరుగుతున్నది ఇదే. 2వ అంతర్జాతీయ సంస్థకు చెందిన 'సోషలిస్టు' **పార్టీలకు నాయకులైన వీరు ఈ విధంగా ప్రవర్తించుట వల్ల నిజంగా సోషలిజం యొక్క శత్రువులుగా తయారై కార్మికోద్యమంలో బూర్జువా ఏజెంట్లుగా ఉన్నారు.** కార్మికవర్గమే నిజమైన విప్లవ వర్గం. దోపిడీగాండ్రను కూలద్రోయుటకు కష్టజీవులైన పీడిత ప్రజలందరూ సాగించే పోరాటంలో కార్మికవర్గం ముందుండి నాయకత్వం వహించగల్గినప్పుడే నిజమైన సోషలిస్టు పంథాలో నడుచుకొనగలదు. కాని, ఈ కృషి పూర్తిగా విజయవంతం కావాలంటే, వర్గ పోరాట సిద్ధాంతాన్ని పల్లె ప్రాంతాల్లోకి గూడా తీసుకొనిపోయి, పల్లె ప్రాంతాల్లోని వ్యవసాయ శ్రామికులనందరినీ పట్టణ కార్మికుల కమ్యూనిస్టు పార్టీ చుట్టూ సమీకరించి, వారికి **సరియైన శిక్షణ యివ్వాలి.**

2. పట్టణ కార్మికుల నాయకత్వం క్రింద పోరాటంలోకి తీసుకొని రాబడవలసిన-ఎట్టి పరిస్థితిలో నైనా కార్మికవర్గ పక్షంవైపు త్రిప్పుకొనవలసిన- గ్రామ పీడిత ప్రజలందరూ పెట్టుబడిదారీ దేశాలన్నిటిలో ఈ క్రింది తరగతులలో ఉన్నారు

మొదటిరకం: కూలిచేస్తూ పొట్ట పోసుకునే వ్యవసాయకూలీలు, రోజు కూలిగాని, సాలువారీగా కాని, లేక నియమిత కాలాలలో గాని, పెట్టుబడిదారీ భూఖామందుల వద్ద పాలేళ్ళుగా ఉండి కాలం గడిపేవారు. వీరు గ్రామాల్లోని ఇతర జనాభాతో సంబంధం లేకుండా వేరుగా వీరిని రాజకీయంగానూ, మిలిటరీ యూనిట్లలోనూ, కార్మిక సంఘాలలోనూ, సహకార సంఘాల్లోనూ, వైజ్ఞానికంగానూ ఆర్గనైజ్ చేయుట, తీవ్రమైన ప్రచారం ద్వారా వీరిని సోవియట్ ప్రభుత్వం వైపుకు, కార్మిక నియంతృత్వంవైపుకు, త్రిప్పుకొనుటయే అన్ని దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల యొక్క ప్రధాన కర్తవ్యం.

రెండవ రకం: కూలిచేస్తూ బ్రతికే చిన్న రైతులు, తమకున్న కొద్దిపాటి భూముల మీద గాని, మక్తాకు భూములు తీసుకొనిగాని, పని చేస్తూ దానివల్ల తమ కుటుంబ పోషణకు సరిపోయేటంత ఆదాయం రాకపోవుటవల్ల ఇతర కమతాలలో కూలిచేసుకొని బ్రతికేవారు వీరు. ఇటువంటి గ్రామశ్రామికులు అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోను ఎక్కువగా ఉన్నారు. ఇటువంటి అసంఖ్యాకమైన గ్రామశ్రామికులు ఉన్నారనే విషయాన్ని 2వ అంతర్జాతీయ సంస్థకు చెందిన సోషలిస్టు పార్టీలు కప్పిపుచ్చి, మొత్తం రైతాంగంతో వీరినిగూడా కలిపేసి లెక్క వేస్తున్నాయి. ఇటువంటి బూర్జువా దగా పద్ధతి ఎక్కువగా జర్మనీ, అమెరికా, ఫ్రాన్సు మొదలైన దేశాలలో కనిపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ సరిగా నిర్మించబడియున్న యెడల ఈ గ్రూపుకు చెందిన రైతులందరూ కమ్యూనిస్టు పార్టీ పక్షంవైపు తప్పక వస్తారు. ఎందుకంటే దుర్భరమైన పరిస్థితులలో కుమిలిపోతున్న వీరందరికీ సోవియట్ ప్రభుత్వంవల్ల, కార్మిక నియంతృత్వంవల్ల ఎక్కువ లాభం సమకూరగలదు.

మూడవ రకం: చిన్నచిన్న రైతులు. వీరు కూలీలనెవరినీ పెట్టుకోకుండా, తమకున్న కొద్దిపాటి ఆదాయంతో సంసారం గడుపుకునే వారు. కార్మికవర్గ విజయంవల్ల ఈ చిన్న రైతులందరూ ఎక్కువ లాభాన్ని పొందగలరు.

1. పంటలో కొంత భాగాన్ని భూస్వాముల కిచ్చే పద్ధతులు (ఇవి ఫ్రాన్సు, ఇటలీ మొదలైన దేశాల్లో గూడా ఉన్నాయి) రద్దు అవుతాయి.. 2. తనఖాలు రద్దుచేయ బడుతాయి. 3. పెద్దపెద్ద భూస్వాములపై ఆధారపడుట వల్ల (అడవులను ఉపయోగించుకొనుట మొదలైన సౌకర్యాలకు). రైతుల మీద కలిగే అన్ని రకాల వత్తిడి నిర్మూలించబడుతుంది. 4. వారి పొలాలకు వ్యవసాయా నికి వెంటనే అవసరమైన సహాయ సౌకర్యాలన్నీ కార్మిక వర్గ ప్రభుత్వం కలుగజేస్తుంది. (భూస్వాముల నుంచి, పెద్ద పెద్ద ఎస్టేటుదార్ల నుంచి, స్వాధీనం చేసుకొనబడిన వ్యవసాయపు పనిముట్లను, ఇండ్లను చిన్న రైతులపరం చేస్తుంది. పూర్వం పెట్టుబడిదారీ విధానం క్రింద ధనిక రైతుల, మధ్యతరగతి రైతుల ప్రయోజనమునకు ఉపయోగ పడుతున్న సహకార సంఘాలు అసంఖ్యాకులైన పేద రైతులకు, వ్యవసాయకూలీలకు ఉపయోగపడే సంఘాలుగా మార్చివేయబడతాయి.)

మరొక ముఖ్యవిషయాన్ని కమ్యూనిస్టు పార్టీ గుర్తించవలసియున్నది పెట్టుబడిదారీ విధానం నుంచి కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే మధ్య కాలంలో, అనగా కార్మికవర్గ నియంతృత్వ దశలో, ఈ చిన్న రైతులు సొంత ఆస్తిహక్కును, ప్రైవేటు వ్యాపారాన్ని సాగించుకునే హక్కును, అనుభవించుటకు ప్రయత్నిస్తారు పూర్వం నుంచి లాభం కొరకు కొద్దిపాటి వ్యాపారాన్ని సాగించే అలవాట్లు, భూస్వాముల సాంప్రదాయాలు బాగా వీరిలో జీర్ణించుటయే దీనికి కారణం. అయినప్పటికీ దృఢ నిశ్చయంతో కార్మికవర్గ పంథాను అనుసరించి, పెద్దపెద్ద భూస్వాములతోనూ, ధనిక రైతులతోనూ కార్మికవర్గం నిర్దాక్షిణ్యంగా, నిర్మొహమాటంగా శ్రామికవర్గం వ్యవహరించే పక్షంలో, ఈ చిన్న రైతుల యొక్క ఊగులాట చాలా వరకు తగ్గి కార్మిక వర్గ విప్లవంవైపుకు మొగ్గుతారు.

3. మొత్తంమీద, పైన చెప్పబడిన మూడు రకాల పల్లె ప్రజలు కలసి అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోని జనాభాలో అధిక సంఖ్యాకులుగా ఉన్నారని చెప్ప వచ్చును. అందువల్ల పట్టణాల్లోనేగాక, పల్లెలలోగూడా కార్మిక విప్లవం తప్పకుండా విజయవంతమై తీరుతుంది. కాని దీనికి వ్యతిరేకమైన దృక్పథం గూడా బాగా వ్యాపించి ఉన్నది. భూస్వాములు, పెట్టుబడిదార్లు మొదలైన దోపిడిగాండ్రకు, పల్లెప్రాంతాల్లోని పైన చెప్పబడిన కష్ట జీవులకు మధ్య గల అగాధాన్ని కప్పిపెట్టి బూర్జువావర్గం తయారుచేసే మోసపు లెక్కలవల్ల ఇటువంటి అభిప్రాయం ఏర్పడుతున్నది. ఈ దొంగ లెక్కల ప్రకారం పెద్దరైతులకు, చిన్న రైతులకు భేదం కల్పించబడుతున్నది. ఇంతేకాదు. బాగా అభివృద్ధి అయిన దేశాల్లోని 2వ అంతర్జాతీయ సంస్థ యొక్క **కార్మిక పెత్తందారులు, సామ్రాజ్యవాదుల వలలో పడిపోయిన అవినీతిపరులు, పల్లె ప్రాంతాల్లో నిజమైన విప్లవ ప్రచారాన్ని, ఆందోళనను, నిర్మాణాన్ని సాగించుటకు ఇష్టపడక, అశక్తతను వెలిబుచ్చుటవల్ల గూడా ఇటువంటి అభిప్రాయం ఏర్పడుతుంది. ఈ అవకాశవాదులైన ద్రోహుల ప్రయత్నాలన్నీ బూర్జువా వర్గంతోనూ పెద్ద రైతులతోనూ, మధ్యతరగతి రైతుల తోనూ రాజీపడుటకేగాని కార్మికవర్గాన్ని ఐక్యంచేసి బూర్జువా వర్గాన్ని, బూర్జువా ప్రభుత్వాన్ని కూలద్రోయుట యందు వీరి దృష్టి లేదు.** ఈ దృక్పథం అలాగే ఉండటానికి మరొక కారణం బూర్జువా డెమాక్రాటిక్ పార్లమెంటరీ దురభిమానులతో సంబంధం కల్గియుండడం. వీరి వైఖరి చివరకు ఎంత మూర్ఖంగా పరిణమించిందంటే, మార్క్సిస్టు సిద్ధాంతాల, రష్యన్ విప్లవ అనుభవంవల్ల పూర్తిగా రుజువు చేయబడిన సత్యాన్ని గూడా -అనగా అణగద్రొక్కబడి, ఐక్యత లేకుండా అడవి మనుష్యులవలె జీవిస్తున్న పై మూడు రకాల పల్లె ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, వైజ్ఞానికంగా సోషలిస్టు విజయంలో ఉత్సాహమున్నప్పటికీ కార్మికవర్గం రాజకీయ అధికారాన్ని పూర్తిగా సంపాదించి, పెద్ద భూస్వాములతోనూ, పెట్టుబడిదార్లతోనూ వ్యవహారాన్ని ఖచ్చితంగా ఫైసలా చేసుకున్న తరువాతనే ప్రత్యక్షంగా తమకొక స్పష్టమైన మార్గాన్ని చూపించి, అన్ని విధాల **సహాయంచేస్తూ తమ హక్కులన్నిటినీ రక్షించగల కార్మికవర్గ నాయకత్వాన్ని రైతులు ఆమోదిస్తారనే వాస్తవిక విషయాన్ని గూడా ఈ ద్రోహులు గుర్తించక పోవుటవల్ల ఇటువంటి అభిప్రాయం కల్గుతున్నది.**

4. ఆర్థికరీత్యా మధ్యతరగతి రైతులంటే ఎవరు? సొంత భూములుగాని, కౌలు భూములు గాని కలిగి, వ్యవసాయంవల్ల వారి కుటుంబాలకు సరిపోయే ఆదాయమే గాకుండా బాగా పండిన సంవత్సరాల్లో అదనంగా కొంత మిగిలి పెట్టుబడిగా మార్చుకొనుటకు అవకాశం కల్గి, సర్వసాధారణంగా కూలీలను పెట్టుకొని వ్యవసాయం చేసేవారని చెప్పవచ్చును. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశమైన జర్మనీలో 6 నుంచి10 హెక్టార్ల వరకు పొలాన్ని కలిగిన రైతులను మధ్యతరగతి రైతులుగా పరిగణించవచ్చును వీరి సంఖ్యలో 3వ వంతుకు సమానమైన వ్యవసాయకూలీలు వీరి క్రింద పనిచేస్తున్నారని జర్మనీలో 1907లో తీసుకొనబడిన జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి. ద్రాక్ష తోటలు మొదలైన ప్రత్యేక పంటలు పండించే ఫ్రాన్సు మొదలైన దేశాల్లో ఈ వ్యవసాయ కూలీల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది

ప్రారంభ దశలో అనగా కార్మిక నియంతృత్వ కాలంలో ఈ మధ్యతరగతి రైతులను తమవైపుకు (కార్మికపక్షం వైపుకు) త్రిప్పుకొనుట అసాధ్యమైన పని. అందువల్ల వారిని వ్యతిరేకం గాకుండా చేసుకొనుటకు కార్మిక వర్గానికి బూర్జువావర్గానికి జరిగే పోరాటంలో మధ్యతరగతి రైతులు తటస్థంగా ఉండునట్లు చేయుటయే కార్మికవర్గ కర్తవ్యం. కార్మికవర్గ, బూర్జువా వర్గాల మధ్య ఊగులాడుతూ, ప్రథమ దశలో బూర్జువావర్గంవైపుకు మొగ్గుట గూడా ఈ మధ్యతరగతి రైతుల లక్షణమే. వీరి దృక్పథంలో, ప్రవర్తనలో ఆస్తిపరుల సాంప్రదాయాలే ఆధిక్యత వహిస్తాయి. లాభాలను సంపాదించుట, యధేచ్ఛగా వ్యాపారం సాగించుట, సొంత ఆస్తి కలిగి ఉండుట- ఇవన్నీ వీరి ప్రధాన లక్షణాలు. కూలిపని చేసేవారంటే వీరికి గిట్టదు. విజయవంతమైన కార్మికవర్గం- శిస్తులను, తనఖాలను రద్దుచేసి వీరి పరిస్థితిని అభివృద్ధి చేస్తుంది. పెట్టుబడి దేశాల్లో చాలా వరకు వెంటనే సొంత ఆస్తినంతనూ కార్మిక ప్రభుత్వం నిషేధించవలసిన అవసరంలేదు. ఇంతేగాదు; చిన్న రైతులకు, మధ్యతరగతి రైతులకు వారి పొలాలను గ్యారంటీ చేయుటయేగాక, వారు పూర్వం మక్తాకు తీసుకొన్న భూములకు ఇంకా కొంత భూమిని కలిపి కార్మిక ప్రభుత్వం వారి రక్షణకు తగిన హామీనిస్తుంది.

రైతులకు సహాయపడే ఇటువంటి కార్యాలుచేస్తూ బూర్జువావర్గంతో నిర్దాక్షిణ్యంగా పోరాడిన యెడల, మధ్యతరగతి రైతులందరూ తాటస్థ్యవైఖరిని తప్పనిసరిగా అవలంబిస్తారు. మధ్యతరగతి రైతులను ఏమాత్రం బలవంతపెట్టకుండా, ఆదర్శప్రాయమైన ఉదాహరణల ద్వారా కార్మికవర్గం నెమ్మదిగా క్రమేణా మెలకువతో సమష్టి వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

5. ఇక పెద్దరైతులంటే ఎవరు? ఎక్కువ మంది కూలీలను పెట్టి పెట్టుబడితో వ్యవసాయం సాగించేవారు. వీరికి గల సాంప్రదాయక రైతు అలవాట్లవల్ల, రైతులకుండే విజ్ఞానవిహీనత వీరిలో గూడా వుండుటవల్ల, శరీరకష్టం కూడా చేసే అలవాట్లు ఉండుట వల్ల వీరు గూడా రైతాంగంలో ఒక భాగంగా ఉన్నారేకాని వేరు కాదు. బూర్జువావర్గంలో ఎక్కువభాగం ఇటువంటి పెద్దరైతులే. విప్లవకరమైన కార్మికవర్గానికి వీరు బద్ధశత్రువులు. పల్లె ప్రాంతాల్లో పనిచేసే కమ్యూనిస్టుపార్టీలు తమ దృష్టినంతా వీరితో తీవ్రమైన పోరాటం సాగించి వారి ప్రభావం నుంచి పల్లె ప్రజలనందరిని విముక్తి గావించడంలో కేంద్రీకరింప చేయాలి.

పట్టణాల్లో కార్మికవర్గం విజయం సాధించిన తరువాత, పెద్దరైతులందరూ విప్లవ వ్యతిరేకులుగా తయారై సాయుధ తిరుగుబాట్లు, విధ్వంసక కార్యాలు తప్పక చేస్తారు. అందువల్ల వీరిని నిరాయుధులుగా చేయుటకై అవసరమైన సిద్ధాంత నిర్మాణ కార్యక్రమాన్ని కట్టుబాటుతో ఇప్పటి నుంచే కార్మికవర్గం సాగించాలి. పారిశ్రామిక పెట్టుబడిదారులను కూలద్రోయుటతోపాటు, మొదటిలోనే ఈ వర్గాన్ని గూడా నిర్దాక్షిణ్యంగా కూలద్రోసి తీరాలి. ఇందులకై గ్రామీణ శ్రామికులందరికీ ఆయుధములనిచ్చి, పీడిత ప్రజల చేతుల్లో అధికారం ఉండేటట్లు, దోపిడీ గాండ్రకు స్థానం లేకుండా గ్రామ సోవియట్లను నిర్మించాలి.

ఏమైనప్పటికీ పెద్దపెద్ద రైతుల యొక్క ఎస్టేట్లను కూడా మొదటిలోనే కార్మికవర్గం స్వాధీనం చేసుకొన గూడదు. ఎందుకంటే అంత పెద్ద ఎస్టేట్లలో సోషలిస్టు పంథాలో వ్యవసాయాన్ని సాగించుటకు అవసరమైన యంత్ర పరికరాలు, సామాజిక పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు. కాని ప్రత్యేకంగా కొన్ని భూములను-కొద్ది చిన్న చిన్న పొలాలుగా, కౌలుకు ఇవ్వబడినవిగాని లేక చుట్టూ వున్న చిన్న రైతులకు ఎక్కువ లాభదాయకంగా ఉండేవాటిని- మాత్రం వెంటనే స్వాధీనం చేసుకొన వచ్చును. పెద్ద రైతులకు చెందిన వ్యవసాయిక యంత్రాలను మాత్రం కొన్ని షరతుల మీద ఉచితంగా చిన్న రైతులు వాడుకొనుటకై హామీ యివ్వాలి. ఐ పెద్ద ఎస్టేట్లను పెద్ద రైతుల చేతుల్లోనే వుంచి, కష్టజీవుల ప్రభుత్వానికి వారు విరుద్ధంగా ప్రవర్తించి నిరోధించే పక్షంలో ఎస్టేట్లను స్వాధీనం చేసుకోవలసి ఉంటుంది రష్యాలోని ప్రత్యేక పరిస్థితులవల్ల పెద్దరైతులకు వ్యతిరేకంగా క్లిష్టమైన దీర్ఘపోరాటం సాగించవలసి వచ్చినప్పటికీ, ఏమాత్రం ప్రతిఘటన సూచనలు వారిలో కనిపించినా వారికి కఠిన శిక్షలు విధించుటవల్ల, పెద్దరైతులందరూ కార్మిక ప్రభుత్వం యెడల విశ్వాసంతో ప్రవర్తిస్తూ నెమ్మదిగా ప్రభుత్వ ఆజ్ఞలను అతిక్రమించకుండానే గౌరవంగా కట్టుబడి ఉన్నారని రష్యన్ విప్లవ అనుభవం వల్ల స్పష్టపడుతున్నది.

బూర్జువావర్గాన్ని కూలద్రోసిన కార్మికవర్గం, రష్యాలోని పెద్దరైతులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం నెమ్మదిగానూ, సూటిగా గాకుండా క్లిష్టంగా జరుగుటకు కారణమైన ప్రత్యేక పరిస్థితులు ఇవి: 1917 నవంబరు 7వ తేదీన రష్యా విప్లవం జరిగిన తరువాత, విప్లవం ప్రధానంగా భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగమంతా చేసే పోరాటంగా అనగా బూర్జువా ప్రజాస్వామ్య విప్లవదశలోనే నడిచింది; సంఖ్యలోనూ, వైజ్ఞానికంగానూ పట్టణ కార్మికుల యొక్క బలహీనత; రహదారి మార్గములు రష్యాలో సరిగా లేకపోవుట, అభివృద్ధి అయిన దేశాలలో ఈ లోటుబాట్లు లేనంత వరకూ, యూరపు అమెరికాల లోని విప్లవకర కార్మికవర్గం ఇంకా త్వరగానూ, శక్తివంతంగానూ, ముందుగానే సన్నాహమై పెద్ద రైతుల ప్రతిఘటనకు అవకాశం లేకుండా చేయాలి. ఒకవేళ వారు నిరోధించే పక్షంలో తీవ్రంగా ఎదుర్కోవాలి ఇలా చేయడం అత్యవసరం. ఎందుకంటే పెద్ద రైతుల మీద సంపూర్ణ విజయం సాధించనంత వరకూ కార్మికవర్గ ప్రభుత్వం స్థిరపడిందని వ్యవసాయకూలీలు, చిన్నరైతులు అనుకోవటానికి వీలులేదు.

6. భూస్వాములకు చెందిన భూములను, పెద్దపెద్ద జమీందార్లకు చెందిన ఎస్టేట్లను అనగా పెట్టుబడి దేశాలలో సొంతంగా కాయకష్టం చేయకుండా చుట్టుప్రక్కల పేదరైతులను, వ్యవసాయకూలీలను పనిలో పెట్టుకొని దోపిడీచేసే జమీందారుల యొక్క భూములను (రష్యా, జర్మనీ, హంగేరీ దేశాల్లోని జమీందార్లు, ఫ్రాన్సులో తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రభువులు, ఇంగ్లండులోని ప్రభువులు, అమెరికాలో పూర్వం బానిస యజమానులుగా ఉన్నవారు ఇటువంటివారు.) గొప్పధనికులైన పెట్టుబడిదారులయొక్క భూములను ఇతర సోమరి పోతుల యొక్క దోపిడీగాండ్రకు చెందిన భూములన్నిటిని కార్మికవర్గం వెంటనే ఏ మినహాయింపులు లేకుండా స్వాధీనం చేసుకోవాలి. **(తరువాయి 4వ పేజీలో)**

# కార్మిక విప్లవ సంస్థ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు) ఆర్.ఓ.ఎల్. (యుఎస్ఏ)

## ఐక్యతకు మౌలిక సూత్రాలు

**ఇంతకు ముందు రే.ఓ.లైట్‌గా ప్రకటనలు విడుదల చేస్తున్న సంస్థ ఇప్పుడు కార్మిక విప్లవ సంస్థ (ఆర్‌ఓఎల్)గా వ్యవహరిస్తున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి మెక్ కిన్నేకు ఓటు వేయమని ఆఫ్రో అమెరికన్‌లను కోరుతూ ఆర్‌ఓఎల్ విడుదల చేసిన కరపత్రాన్ని గత సంచికలో ఇచ్చాము. ఈ సంచికలో వారి ఐక్యతా వైఖరిని వివరించే ప్రకటనను పాఠకుల అధ్యయనం కోసం యిస్తున్నాము.**

**– సంపాదకుడు.**

1. మార్క్సిజం–లెనినిజం సూత్రాలకు కట్టుబడి వుండే విప్లవకర కార్మికవర్గ సంస్థ 'కార్మిక విప్లవ సంస్థ'. అమెరికా సంయుక్త రాష్ట్రాల (అ.సం.రా)లోనూ, ప్రపంచంలోనూ అగ్రగామి మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీని స్థాపించే క్రమంలో ఇది ఒక అడుగు. పీడిత ప్రజల, అంతర్జాతీయ కార్మికవర్గపు ఆత్మరక్షణ, విముక్తి కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహించటానికి లెనినిస్టు పార్టీ నిర్మాణమూ, నిజమైన కమ్యూనిస్టు పార్టీలూ, ఒక కమ్యూనిస్టు ఇంటర్నేషనలూ కీలకమైనవిగా ఉంటాయి. చరిత్ర పురోగమనానికి పథ నిర్దేశకులుగా, అగ్రగాములుగా, ఆర్గనైజర్లుగా అవి వుండి తీరాలి.
2. కార్మికవర్గ అధికారం కొరకూ, మానవులపై అన్ని దోపిడీల నిర్మూలన కొరకూ మేము పోరాడుతాము. పెట్టుబడిదారీ విధానపు, సామ్రాజ్యవాదపు కాడి నుండి తత్పర్యవసానంగా ఏర్పడే యుద్ధాన్ని తొలగించి, శాంతిని నెలకొల్పే మానవాళి విముక్తి కొరకు పోరాడుతాము. సంపదను సృష్టించేవారే దానిపై యాజమాన్యం కలిగి వుండి, దాని నుండి లబ్ధి పొందే కమ్యూనిస్టు భవిష్యత్తుకు మార్గాన్ని సుగమంచేసే సోషలిస్టు విప్లవం కొరకు మేము పోరాడుతాము.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను సంపూర్ణంగా నాశనం చేయాలంటే సోషలిజంలో పరిపాలనా రూపం దీర్ఘకాల కార్మికవర్గ నియంతృత్వంగా (మైనారిటీపై మెజారిటీ పాలన, పెట్టుబడిదారులపై కార్మికవర్గ పాలన) ఉండటం అత్యవసరం
4. అ సం రా.ల్లోనూ, కార్మికవర్గ అంతర్జాతీయత పునాదిగా ప్రపంచంలోనూ కార్మికవర్గ విప్లవం కొరకు మేము పోరాడుతాము.
5. శాస్త్రీయ సోషలిజమూ, మార్క్సిజం–లెనినిజాలు మా కార్యాచరణకు మార్గదర్శిగా వుంటాయి.
6. ఉజ్వల భవిష్యత్తూ, ప్రపంచ చరిత్రల నిర్మాతలుగా కార్మిక వర్గాన్నీ, పీడిత ప్రజలనూ చారిత్రక భౌతికవాద దృక్పథం చూపుతున్నది. కార్మికవర్గం తన స్వంత అనుభవాల ద్వారానే సోషలిస్టు, కమ్యూనిస్టు భవిష్యత్తు కొరకు పోరాట అవసరాన్ని గుర్తిస్తుంది.
7. సామ్రాజ్యవాద యుగం, కార్మికవర్గ విప్లవం ఎగసే యుగం, అంటే లెనినిజం యుగంలో మనం జీవిస్తున్నాము.
8. నేడు మానవాళి సుఖజీవనానికీ, ప్రగతికీ ప్రధాన శత్రువు అమెరికా సంయుక్త రాష్ట్రాల నాయకత్వంలో వున్న సామ్రాజ్యవాదం.
9. శ్రమకూ, పెట్టుబడికీ మధ్య వైరుధ్యం, సామ్రాజ్యవాదుల మధ్యనున్న వైరుధ్యం, పీడిత జాతులూ, ప్రజలకూ సామ్రాజ్యవాదానికీ మధ్య వైరుధ్యం– ఈ మూడు మౌలిక వైరుధ్యాలూ నేడు పని చేస్తున్నాయి, ఇవి ఒక దానితో మరొకటి సంబంధం కలిగి వున్నాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆఫ్రో–అమెరికాల కోట్లాది **పీడిత జాతులూ,** ప్రజలూ ఒక వైపునా, అ.సం.రా. సామ్రాజ్యవాద నాయకత్వంలో సామ్రాజ్యవాదం మరొకవైపునా వున్న వైరుధ్యమే రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ప్రధాన వైరుధ్యం. **సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సోషలిజం కొరకు** సాగే విప్లవ పోరాటాల ప్రధాన రూపంగా ఈ కాలంలో పీడిత ప్రజల జాతీయ విముక్తి ఉద్యమాలు వుంటాయి; సాగుతున్నాయి; కొనసాగుతాయి.
10. జాతీయాభివృద్ధిని సామ్రాజ్యవాదం అణచివేసిన దేశాలలో, త్వరితంగా సోషలిస్టు విప్లవదశలోకి పురోగమించేందుకు ప్రజాస్వామిక దశలో చురుకైన నాయకత్వ పాత్రను కార్మికవర్గం నిర్వహించాలి. (రెండు దశల విప్లవం).
11. ఆఫ్రో–అమెరికన్, నైరుతీ అ.సం.రా ల్లో **అజ్‌టలాన్, పుయర్టోరికో తదితర పీడిత జాతుల, ప్రజల బంధిఖానాతోసహా బహుజాతుల రాజ్యం** అ.సం.రా. ఆఫ్రో–అమెరికన్ల జాతీయ సమస్య. దక్షిణాన నల్లజాతుల ప్రాంతంలో ఆఫ్రో–అమెరికన్ల స్వయం నిర్ణయ హక్కు, భూమి కొరకూ, అధికారం కొరకూ, పూయర్టోరికో, అజ్‌టలాన్‌ల జాతీయ విముక్తి పోరాటాలూ, అ.సం.రా ల్లో విప్లవోద్యమ విజయానికి కేంద్ర పోరాటాలుగా వుంటాయి.
12. మన వర్గాన్ని చీల్చే అన్ని రకాల దురహంకారాలకూ వ్యతిరేకంగా **పోరాడుతాము.** గొప్పజాతి **దురహంకారానికీ, అది ఈ దేశంలో వ్యక్తమయ్యే ప్రధాన రూపం శ్వేత ఆధిపత్యానికి వ్యతిరేకంగా**

**(తరువాయి 5వ పేజీలో)**

## వ్యవసాయ... (3వ పేజీ తరువాయి)

కాని **ఎట్టి పరిస్థితులలో గూడా స్వాధీనం వేసుకొనబడిన భూములకు బదులుగా భూస్వాములకు నష్టపరిహారాన్ని చెల్లించే ప్రచారానికి కమ్యూనిస్టుపార్టీలో అవకాశం లేకుండా చేయాలి. ఎందుకంటే ఈ విధంగా చేయుట యూరపు అమెరికాలలో గత యుద్ధంవల్ల దుర్భర పరిస్థితులలోకి వచ్చిన ప్రజల మీద కొత్త పన్నులనువేసి సోషలిజానికి ద్రోహము చేసినట్లే అవుతుంది.**

అయితే పెద్ద పెద్ద భూస్వాముల నుంచి స్వాధీనం వేసుకొనబడిన భూములలో ఎటువంటి వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టాలి? అనే ప్రశ్న వుంది ఆర్థికంగా చెడిపోయియున్న రష్యా పరిస్థితులనుబట్టి, ప్రధానంగా ఈ భూములను సాగుచేసుకోవడానికి రైతులకు పంపకం చేయవలసి యుంటుంది ప్రభుత్వం సోవియట్ వ్యవసాయ క్షేత్రాలను అరుదుగా ఆర్గనైజ్ చేసి వాటిలో పనిచేయుటకు వచ్చే పూర్వపు వ్యవసాయ కూలీలనందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చి రాజ్యాంగ వ్యవహారాలను నిర్వహించే సోవియట్లలో సభ్యులుగా చేర్చాలి. కాని అభివృద్ధియైన పెట్టుబడి దేశాల్లో ఈ విధంగా చేయనక్కరలేదని కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్ అభిప్రాయ పడుతున్నది. రష్యా పద్ధతులను ఆ దేశాల్లో అనుసరించుట పొరపాటని గూడా భావిస్తున్నది.

కాని ఈ నియమాన్ని అదే విధంగా ఉంచి ఎట్టి పరిస్థితులలోనైనాసరే, స్వాధీనం చేసుకొన్న భూములను పేద రైతులకు, కొన్ని సమయాల్లో మధ్యతరగతి రైతులకు ఉచితంగా పంపకం చేయగూడదని చెప్పుట పొరపాటు.

(ఎ) సాధారణంగా పై అభిప్రాయమునకు వ్యతిరేకంగా చేయబడే వాదన ఏమిటంటే–కొద్దిపాటి వ్యవసాయ విధానం కంటే, బాహుళ్యంగా వ్యవసాయం సాగిస్తే ఉత్పత్తి పెరిగి లాభదాయకంగా ఉంటుందని వాదిస్తారు. ఈ విషయం నిజమైనప్పటికీ ఇలా వాదించుట విప్లవానికి ద్రోహంచేయుటేగాని వేరు కాదు. ఎందుకంటే విప్లవ విజయం కొరకై తాత్కాలికంగా ఉత్పత్తి పడిపోయి తగ్గుస్థాయిలో ఉండుటకైనా కార్మికవర్గం అంగీకరించుటకు వెనుతీయగూడదు. బానిస విధానానికి వ్యతిరేకులైన ఉత్తరఅమెరికా బూర్జువావర్గం 1863–65లో తాత్కాలికంగా ప్రత్తిపంట వుత్పత్తి తగ్గిపోవుటకు అంగీకరించినట్లే ఇది గూడా. బూర్జువా వర్గం యొక్క దృష్టిలో ఉత్పత్తి, ఉత్పత్తి కొరకే. దోపిడీగాండ్రను కూలద్రోసి, పెట్టుబడిదారులకు గాకుండా తమ స్వప్రయోజనములకై ఉత్పత్తి సాగించుటకు తగిన అనుకూల పరిస్థితులను కలుగజేయుటయే పీడిత ప్రజల దృష్టిలో ప్రధానమైన విషయం మధ్యతరగతి రైతులను తటస్థంగా ఉండేటట్లు చేయకుండా చిన్న రైతుల మద్దతు లేకుండా కార్మికవర్గ అధికారానికి స్థిరత్వం కల్గించుట అసంభవం అదే కార్మికవర్గం యొక్క ప్రధాన కర్తవ్యం.

(బి) ఉత్పత్తిని అధికంచేసే విషయం అలా ఉంచి, ప్రస్తుతం అమలులో ఉన్న పెద్దస్కేల్లో సాగించే వ్యవసాయాన్ని నిలబెట్టుటకే వ్యవసాయకూలీలలో గొప్ప ట్రేడ్ యూనియన్ చైతన్యం, రాజకీయ నిర్మాణ చైతన్యం, శిక్షణ అభివృద్ధి కావలసియున్నది అటువంటి పరిస్థితులు లేనప్పుడు, తొందరపడి పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసే వ్యవసాయాన్ని ఎక్కువచేసి సామర్థ్యం నైపుణ్యాలు లేనివారి చేతుల్లో పెట్టిన యెడల కార్మికవర్గ ప్రభుత్వానికి అపకీర్తి గూడా వస్తుంది. అట్టి పరిస్థితులలో చాలా **జాగ్రత్తలు తీసుకొని. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలను స్థాపించబోయే ముందు అవసరమైన సన్నాహమంతా ముందే చేయవలసి ఉంటుంది.**

**(సి) బాగా అభివృద్ధి అయిన అన్ని పెట్టుబడి దేశాల్లో యింకా మధ్యయుగం నాటి జమీందారీ, బానిస పద్ధతులు అమలులో ఉన్నాయి జర్మనీలో, ఫ్రాన్సులో.** అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో చిన్న చిన్న రైతులను పెద్ద భూస్వాములు అనేక విధములైన అన్యాయాలకు గురిచేస్తున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాల్లో నీగ్రోలనేగాక తెల్లవారినిగూడా భూస్వాములు ఇదే విధంగా దోపిడీ చేస్తున్నారు. అటువంటి పరిస్థితులలో పూర్వం చిన్న రైతులు మక్తాకు తీసుకొన్న భూములను వారికి ఉచితంగా కార్మిక ప్రభుత్వం ఇచ్చివేయవలసియుంటుంది. ఇంతకన్న మరొక ఆర్థిక సదుపాయాన్ని అకస్మాత్తుగా కలుగ చేయుటకు సాధ్యపడదు.

పోతే పెద్ద భూస్వాములకు చెందిన వ్యవసాయపు యంత్రాలను, పనిముట్లను ఏ మినహాయింపు లేకుండా పూర్తిగా స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆస్తిగా మార్చాలి. వీటిలో ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలకు సరిపోగా మిగిలినవి ఉచితంగా కార్మిక ప్రభుత్వం నిర్ణయించే నియమాల ననుసరించి చిన్నరైతులకు ఇవ్వవలసియుంటుంది.

విప్లవం అయిన మొదటి రోజుల్లో పెద్ద భూస్వాముల ఎస్టేట్లను స్వాధీనపరుచుకొనుటయేగాక వారికందరికీ విప్లవ వ్యతిరేక నాయకులుగా ప్రవాసశిక్ష విధించుటయో, లేక నిర్ణీత ప్రదేశాల్లో నిర్బంధించుటయో. చేయుట గూడా అవసరం. ఎందుకంటే వారందరు పల్లె ప్రజలనందరిని నిర్దాక్షిణ్యంగా దోపిడీచేసేవారు గనుక. కార్మికవర్గ అధికారం స్థిరపడునంత వరకూ, క్రమేణా గట్టినమ్మకస్థులైన కమ్యూనిస్టుపార్టీ వర్కర్ల ప్రత్యేక కంట్రోల్ క్రింద వీరిలో నుంచి గొప్ప అనుభవం, నిర్మాణ సామర్థ్యం, జ్ఞానం కలవారినందరిని, పెద్దపెద్ద సమష్టి వ్యవసాయ క్షేత్రాలను నిర్మించుటకై ఏరి ఉపయోగించు కొనుటగూడా అవసరం.

7. దోపిడీగాండ్ర యొక్క ప్రతిఘటన ప్రయత్నాలన్నిటినీ పూర్తిగా నిర్మూలించి వారినందరిని కార్మిక వర్గ ప్రభుత్వం క్రింద అణిగిపడి వుండేట్లు చేసిన తరువాత, పరిశ్రమలన్నిటినీ పెద్దస్కేలు ఉత్పత్తి విధానం క్రిందికి తీసుకొని వచ్చి ఆధునిక టెక్నిక్‌తో నడిపినప్పుడే (జాతీయ ఆర్థిక ఉత్పత్తి అంతా విద్యుచ్ఛక్తి సహాయంతో నడుపబడినప్పుడే) కార్మికవర్గ అధికారం స్థిరపడి, సోషలిస్టు విజయం చేకూరినదని చెప్పవచ్చును. ఇలా చేసినప్పుడే పట్టణ కార్మికులు చిందరవందరగా దేశమంతటా వెదజల్లబడి వెనుకబడియున్న పల్లె ప్రజలకు అవసరమైన సాంఘిక పారిశ్రామిక సహకారం చేసి వ్యవసాయ కూలీల యొక్క ఉత్పత్తిని వృద్ధిచేసి, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా చిన్న రైతులను ఉత్సాహపరచి పెద్ద మొత్తం మీద సాగించే సమష్టి వ్యవసాయ పద్ధతి తమ మేలు కొరకే అవసరమనే సంగతిని గ్రహింపచేయగల్గుతారు. ఈ యదార్థ సత్యాన్ని అన్ని దేశాల్లోని సోషలిస్టులు 2వ అంతర్జాతీయ సంస్థకు చెందిన జర్మన్, బ్రిటీష్, ఫ్రెంచి నాయకులందరూ పేరుకు మాత్రం అంగీకరించి ఆచరణలో పెడత్రోవ పట్టిన అవకాశవాదులుగా తయారైనారు. ఎప్పుడో భవిష్యత్తులో **నిర్మింపబడబోయే స్వర్గరాజ్యంమీదనే దృష్టి పెట్టుకొని, అటువంటి భవిష్యత్తును సాధించుటకై మధ్యవున్న క్లిష్ట కాలంలో వెంటనే నెరవేర్చవలసిన కర్తవ్యాల మీద దృష్టిని కేంద్రీకరించకపోవడంవల్ల ఇటువంటి సంకుచిత అభిప్రాయం కలుగుతున్నది ఆచరణలో ఈ అభిప్రాయం** బూర్జువావర్గంతో 'సమాజ శాంతి' కొరకు రాజీపడే మార్గాలకు దారితీస్తుంది. యుద్ధ ఫలితంగా కొద్దిమంది కోటీశ్వరులు ఇంకా ఎక్కువగా బలిసి, మదించి ఉన్నప్పుడు ఎప్పుడూ కనీవినీ ఎరుగని దరిద్రమునకు లోనయి ప్రజలందరూ మ్రగ్గిపోతున్న పరిస్థితులలో బూర్జువావర్గంతో రాజీకి దారితీసే పంథా కార్మికవర్గానికి **ద్రోహంచేసే మార్గమే అవుతుంది.**

సోషలిస్టు విజయంకోసం జయప్రదమైన పోరాటం సాగించుటకు ముఖ్యంగా ఈ పల్లె ప్రాంతాల్లోనే కమ్యూనిస్టు పార్టీలు కృషిచేసి, బూర్జువావర్గాన్ని కూలద్రోయుటకై కార్మిక వర్గం బ్రహ్మాండమైన త్యాగమునకు తయారగునట్లు కార్మికవర్గానికి గొప్ప చైతన్యాన్ని కలుగజేయవలసియున్నది. ఈ త్యాగముల వల్లనే కార్మికవర్గం అధికారానికి స్థిరత్వం రాగలదు. ఎందుకంటే, పీడిత ప్రజలనందరినీ సంఘటితపరచి నడుపగల సామర్థ్యం కార్మికవర్గానికి కలిగినప్పుడే, నాయకత్వం వహించవలసిన కార్మికవర్గం అద్భుతమైన ధైర్య సాహసముల్లను; త్యాగదీక్షను ప్రదర్శించగలిగినప్పుడే కార్మిక వర్గ నియంతృత్వం సాధ్యపడుతుంది. రెండవ విషయం–విజయం రావాలంటే, దోపిడీగాండ్రకు దెబ్బతగిలి, పీడిత ప్రజలైన పల్లెలలోని కష్టజీవుల పరిస్థితులు కొంత వరకైనా అభివృద్ధి చేయవలసి ఉంటుంది. అప్పుడే పల్లె ప్రజలందరూ పారిశ్రామిక కార్మికులను బలపరచి, పట్టణాలకు అవసరమైన ఆహార పదార్థాలను సప్లయి చేస్తారు.

8. ఎంతో కాలం నుంచి పెట్టుబడి విధానం క్రింద దుర్భర పరిస్థితులలో ఉంచబడి అనైక్యత, బానిసత్వములలో క్రుంగిపోయిన వ్యవసాయ కూలీలను సంఘటితపరచి విప్లవ పోరాటమునకు తయారు చేయాలంటే, పల్లె ప్రాంతాల్లో అన్ని వైపుల నుంచి బయలుదేరే సమ్మె పోరాటములను బలపరచుటకు ప్రత్యేక శ్రద్ధ వహించవలసియుంటుంది. రష్యాలో జరిగిన 1905, 1917 విప్లవాలు ఈ విషయాన్ని స్పష్టపరుస్తున్నవి. జర్మనీలో ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోని అనుభవంగూడా ఈ విషయాన్నే ధ్రువపరుస్తోంది. పల్లెప్రాంతాల్లో వచ్చే సమ్మె పోరాటాల ద్వారానే (కొన్ని పరిస్థితులలో చిన్న రైతులు తప్పనిసరిగా ఈ పోరాటాలను సాగించవలసి యుంటుందిగూడా) పల్లెజనంలోని సోమరితనాన్నుంచి నిద్రమేల్కొల్పి వారికి వర్గచైతన్యం కలిగించి వర్గ సంఘటన ఎందుకు అవసరమో గ్రహించునట్లుచేసి, పట్టణ కార్మికులతో వారు ఎందుకు ఐక్యం కావాలో కూడా స్పష్టపరచగలదు.

**ఈ విషయాన్ని అంగీకరించని 2వ అంతర్జాతీయ సంస్థలోని సోషలిస్టులను కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్ తీవ్రంగా ఖండిస్తుంది. వీరినే కాదు. ఈ అంతర్జాతీయ సంస్థ నుంచి ఉపసంహరించుకున్న 3 యూరోపియన్ పార్టీలలోని సోషలిస్టులను గూడా ఖండిస్తుంది. ఎందుకంటే వీరు పల్లె ప్రాంతాల్లో వచ్చే వ్యవసాయ కూలీల పోరాటముల యందు తటస్థ వైఖరీ, ఉపేక్ష వహించటమేగాక, కాట్స్కీవలె ఈ పోరాటములను, ఉత్పత్తి ధ్వంసమవుతుందనే పేరుతో, వ్యతిరేకిస్తారు కూడా.** కాని ఎన్ని కార్యక్రమాలైనాసరే, పవిత్ర వాగ్దానాలైనాసరే, ప్రత్యక్ష కార్యాచరణలేనప్పుడు, ఎందుకూ పనికిరాకుండా పోతాయి అందువల్ల కమ్యూనిస్టు నాయకులు, కార్మిక నాయకులు ప్రపంచంలో కార్మిక విప్లవమును వృద్ధిచేయుటయే అన్నిటి కంటె ప్రధాన విధిగా భావించి మహత్తర త్యాగాలకు పూనుకొని కృషిచేయడంవల్లనే ఈ విషయం రుజువు కాగలదు. వినాశనం నుంచి, సామ్రాజ్యవాద యుద్ధం నుంచి, దరిద్రం నుంచి, ఆకలి నుంచి తప్పించుకొనుటకు ఇంతకంటె మరొక విముక్తి మార్గం లేదు

మరొక ముఖ్యవిషయం. పాత సోషలిస్టు నాయకులు, కార్మిక 'ప్రభువులైనవారు' ప్రజలలో వడివడిగా అభివృద్ధి పొందుతున్న విప్లవ చైతన్యాన్ని చూసి వారు గూడా కమ్యూనిజంను అంగీకరించుట, కమ్యూనిస్టు పక్షం వైపుకు వచ్చుట గూడా జరుగుతుంది. కార్మికవర్గ ప్రభుత్వం యందు వీరికి గల భక్తినీ, విప్లవ చైతన్యమూ, విప్లవ పోరాటం త్వరగా అభివృద్ధి పొందుతున్న రంగాలలో బాధ్యత గల స్థానాలను ఆక్రమించుటకు వీరికి గల శక్తి సామర్థ్యములనూ, భూస్వాములు, బూర్జువావర్గం పెద్దరైతులు చేసే నిరోధక చర్యలు భయంకర రూపం దాల్చి,రాజీమార్గాన్ని అనుసరించే సోషలిస్టుకు విప్లవ మార్గంలో నడిచే కమ్యూనిస్టుకు గల వ్యత్యాసం వడివడిగా బట్టబయలు అవుతున్న రంగాల్లో స్థానాలు ఆక్రమించుటకు గల అర్హతనూ గట్టిగా పరీక్షించవలసియున్నది.

9. పల్లె ప్రాంతాల్లో వీలైనంత త్వరగా వ్యవసాయకూలీల యొక్క, బీదరైతుల యొక్క ప్రతినిధులతో గూడిన సోవియట్లను నిర్మించుటకు కమ్యూనిస్టు పార్టీ పూనుకోవాలి; పీడిత ప్రజలతో సంబంధం పెట్టుకొని వ్యవసాయకూలీల సమ్మెలను బలపరచుటవల్లనే సోవియట్లు స్థిరపడి చిన్నరైతుల పోరాటాలు వృద్ధికాని పరిస్థితులలో, భూస్వాముల యొక్క పెద్దరైతుల యొక్క దోపిడీభారం ఎక్కువగుటవల్ల వ్యవసాయ కూలీలకు తగినంత చైతన్యంలేక నిర్మాణరహితంగా ఉన్నప్పుడు, పట్టణ కార్మికుల యొక్క వారి సంఘాల యొక్క దోహదం లేనప్పుడు గ్రామాల్లో సోవియట్లను నిర్మించుట కష్టతరమవుతుంది. అటువంటి ప్రాంతాల్లో చిన్న చిన్న కమ్యూనిస్టు సెల్లులను ఏర్పాటు చేసి, తీవ్రమైన ఆందోళన ద్వారానూ కండ్లకు కట్టినట్లుండే చక్కటి ఉదాహరణలతో కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రచారంచేసి పట్టణ కార్మికులు విరివిగా పల్లె ప్రాంతాలకు వచ్చునట్లు ఏర్పాట్లు గావించి దీర్ఘకాల సన్నాహంపై సోవియట్లనునిర్మించవలసియుంటుంది.

# రాన్‌బాక్సీ అమ్మివేత: విడాకులతో ముగిసిన హనీమూన్

**భారతదేశంలోని** ప్రముఖ ఔషధ తయారీ కంపెనీ రాన్‌బాక్సీని దైచీ సాంక్యో కంపెనీ కొనివేసింది. **భాయి** మోహన్ సింగ్ కుటుంబం అధీనంలో వున్న మెజారిటీ షేర్లను జపాను కంపెనీ కొని వేసిన వార్త సంచలనాన్ని కలిగించింది. ఈ కొనుగోలులో ఎవరెంత లాభపడ్డారు, షేరు మార్కెట్టుపై దాని ప్రభావమేమిటి వంటి అప్రధాన అంశాలనటుంచితే, భారత ఔషధ రంగ పరిశ్రమ తీవ్రదుష్ప్రభావాలకు గురయ్యే, ఔషధ రంగం మొత్తంగా సామ్రాజ్యవాదుల పరమయ్యే పరిణామమిది.

ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుకు ముందు గాట్ ఒప్పందానికి జరిగిన చర్చల్లో వాణిజ్య సంబంధిత మేధోపర పేటెంటు హక్కులు (ట్రిప్స్) గురించి సామ్రాజ్యవాద దేశాలు పట్టుపట్టాయి. ఒక సరుకును తయారుచేసే ఉత్పత్తి క్రమంపై పేటెంటు హక్కు స్థానంలో, ఉత్పత్తి అయిన సరుకుపైననే పేటెంటు హక్కును గుర్తించాలని పట్టుపట్టాయి. మొదట బ్రెజిల్, భారత్‌లు దీనిని వ్యతిరేకించినా, అమెరికా సామ్రాజ్యవాదులు తీవ్రంగా వత్తిడిపెట్టడంతో అంగీకరించారు. ఉత్పత్తి సరుకు పేటెంటు హక్కును ఆనాడు రాన్‌బాక్సీ కంపెనీ కూడా వ్యతిరేకించింది. చివరికి ఈ ట్రిప్స్ ఒప్పందం 1995 జనవరి 1 నుండీ అమలులోకి వచ్చింది.

ఈ కొత్తపద్ధతి వల్ల పేటెంటు హక్కు కలిగి వుండే కాలపరిమితి తగ్గిందనీ, పేటెంటు హక్కు ముగిసిన మందులను ఎవరైనా తయారు చేసి అమ్ముకోవచ్చుననీ, పరిశోధనను సాగించి కొత్త మందులను కనుగొంటే మనకూ పేటెంటు హక్కు వచ్చి లాభపడతామనీ, కనుక ఈ ఒప్పందం వల్ల ఏర్పడిన నూతన అవకాశాలను వినియోగించుకునేందుకు భారత మందుల కంపెనీలు ముందుకు రావాలనీ, ఆ విధంగా "పరిశోధన పునాదిగా గల బహుళజాతి కంపెనీలుగా" అవి ఎదగాలని ప్రపంచ వాణిజ్య సంస్థ సమర్ధకులు వాదించారు. వాటినే భారత పాలకులూ వల్లె వేశారు.

2004లో ట్రిప్స్‌కు అనుగుణంగా భారత ప్రభుత్వం పేటెంటు ఆర్డినెన్సును జారీ చేసింది. దానిని సమర్ధించుకుంటూ ఆనాటి కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖా మంత్రి కమల్‌నాథ్ అతిత్వరలో 6 వేల కోట్ల డాలర్ల విలువైన మందుల పేటెంటు హక్కులు ముగుస్తున్నాయనీ, దీనిలో సింహభాగం భారత్ కైవశమౌతుందనీ కనుక భయపడనవసరంలేదనీ అన్నాడు.

ఈ ఆశలతోనే రాన్‌బాక్సీ, రెడ్డిల్యాబ్స్ వంటి భారత కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్టులో అమ్మకాలకూ, పరిశోధనా రంగాలకూ పెద్దపీట వేశాయి ప్రారంభ సంవత్సరాల్లో ఈ కంపెనీల ఎగుమతులు పెరిగాయి; ఆదాయాలూ, లాభాలూ పెరిగాయి. వీటి విజయాలను భారత పత్రికలు వేనోళ్ల పొగిడాయి. బహుళజాతి కంపెనీలుగా అవతరించగలశక్తి భారత కంపెనీలకుందని రుజువైందన్నాయి. అయితే ఈ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. ఆశించిన పరిణామాలేవీ సంభవించలేదు.

## ఎండమావులైన అమ్మకాలు

పేటెంటు హక్కు ముగిసిన మందుల మార్కెట్టును చాలా ఎక్కువగా అంచనావేసి ప్రచారం చేశారు. పేటెంటు హక్కు వున్న కంపెనీలు, గుత్తాధిపత్యం వుంది గనుక అధిక ధరలకు అమ్ముకుంటాయి. కనుక పేటెంటు మందుల అమ్మకాలను మొత్తం మార్కెట్టు విలువగా చెప్పలేము. పేటెంటు ముగియగానే ధరల్లో 90 శాతం వరకు తగ్గుదల వుంటుందని మందుల పరిశ్రమ పరిశీలకులు అంటున్నారు (సుదీప్ చౌధురి, ఇ.పి.డబ్ల్యు. 19.7.08). కనుక ఈ మార్కెట్టు 600 కోట్ల డాలర్లకు మించదు. ఇది కూడా అమ్మకానికి సిద్ధంగా తయారైన మందుల అమ్మకాల విలువ. కాగా భారత కంపెనీల్లో అధికభాగం మందును పెద్దస్థాయిలో అమ్ముతాయి (బల్క్ డ్రగ్) వీటిని కొన్ని విదేశీ కంపెనీలు ఇతర మందులతో కలిపి, లేదా విడిగానో అమ్ముకుంటాయి. కనుక ఈ 600 కోట్ల డాలర్ల మార్కెట్టులోని భారత కంపెనీల వాటా సగం కంటే తక్కువగానే ఉంటుంది. దీనికి తోడు భారత కంపెనీలు ఒకదాని తర్వాత ఒకటిగా ఈ రంగంలోకి ప్రవేశించటంతో వాటి మధ్య పోటీ పెరిగింది. లాభాలు తగ్గాయి.

2003లో రాన్‌బాక్సీ కంపెనీ అమ్మకాలు 3800 కోట్ల రూపాయలుండగా, లాభాలు రూ.957 కోట్లుగా ఉంది. అంటే అమ్మకాల్లో దాదాపు నాల్గోవంతు లాభం కాగా అమ్మకాలు 2004లో 3614 కోట్లకు తగ్గగా, 2005లో 3536 కోట్లకు తగ్గాయి. అంటే అమ్మకాలు 8 శాతం కంటే తక్కువగానే తగ్గాయి. కాగా లాభాలు మాత్రం 2004లో రూ.628 కోట్లకూ, 2005లో రూ.202 కోట్లకూ తగ్గాయి. అంటే లాభాలు 35 నుండి 75 శాతం మేరకు తగ్గాయి. రెడ్డి ల్యాబ్స్ పరిస్థితి కూడా యించుమించు ఇదే విధంగా వుంది. ఈ విధంగా విదేశాలలో అమ్మకాలు పెరుగుతాయన్న ఆశలు అడియాసలయ్యాయి.

## ముందుకు సాగని పరిశోధనలు

ఇక రెండవది పరిశోధనా రంగం భారత కంపెనీలు పరిశోధనా రంగంలో, ప్రత్యేకించి మందుల తయారీలో వ్యయం చేయటంలో దాదాపు లేదనే చెప్పాలి. ట్రిప్స్ ఒప్పందం తర్వాత భారత మందుల కంపెనీల పరిశోధనా వ్యయం బాగా పెరుగుతూ వచ్చింది. దీనిని రెడ్డిలాబ్స్ ప్రారంభించగా, రాన్‌బాక్సీ కూడా సాగించింది.

కొత్తమందును కనుగొని, పరిశీలించి, ప్రయోగించి, వినియోగానికి అనుమతి పొందాలంటే దీర్ఘకాలం పట్టడంతోపాటు, అధిక పెట్టుబడి, సాంకేతికత, మానవ వనరులు అవసరమౌతాయి. ఇవి తగినంతగా భారత కంపెనీలకు లేవు. కనుక ఈ మందుల మూలక మాలిక్యుల్సును కనుగొని, ఒక దశ వరకూ అభివృద్ధి చేసి, మిగిలిన ఉన్నత దశల అభివృద్ధిని చేసేందుకు ఈ వనరులున్న పెద్ద కంపెనీలకు అంటే బహుళజాతి కంపెనీలకు లైసెన్సు ఇచ్చే పద్ధతిని భారత కంపెనీలు అనుసరించాయి.

**ఉదాహరణకు రెడ్డి లాబ్స్ మధుమేహ వ్యాధి చికిత్సకు మూడు మందులను కనుగొని నోవో నార్డిస్క్, నోవార్టిన్ కంపెనీలకు లైసెన్సునిచ్చింది. ఈ** ఒప్పందం ప్రకారం పరిశోధన **పూరయ్యే నాటికి మొత్తం** ఐదున్నర కోట్ల డాలర్లు రెడ్డి లాబ్స్‌కు **నోవార్టిన్ చెల్లిస్తుంది.** ఒక 50 లక్షలు మొదటి విడతగా 2003లో చెల్లించింది. ఇది సంచలన వార్త అయింది. పారిశ్రామిక వర్గాల్లో ఆశలను రేకెత్తించింది. భారత కంపెనీలు కూడా కొత్తగా పరిశోధనా రంగంలోకి దిగాయి. అంతటితోసరి. సజావైన కారణాలు చెప్పకుండానే నోవార్టిన్ ఈ మందులపై పరిశోధనలను ఆపివేసింది అలాగే రాన్‌బాక్సీ నుండి లైసెన్సు పొందిన ష్వార్ట్జ్ ఫార్మా కూడా ప్రయోగాలను ఆపివేసింది

అలాగే గ్లాస్కోకూ, రాన్‌బాక్సీకి మధ్య పరిశోధనా రంగంలో జరిగిన భాగస్వామ్య ఒప్పందాన్ని గురించి కూడా బాగా ప్రచారం జరిగింది. కానీ అక్కడి నుండి ఒకడుగు కూడా ముందుకు కదలలేదు. రాన్‌బాక్సీ వద్ద యిప్పుడు మూడు మాలిక్యుల్సు సిద్ధంగా వున్నాయిగానీ, ప్రయోగాలు సాగించే స్థితి లేకుండా పోయింది. గత మూడేళ్లలోనూ రాన్‌బాక్సీ పరిశోధనలకు రూ.158 కోట్లు వెచ్చించింది. కాగా దాని నుండి ఇప్పటి వరకూ పైసా ఆదాయం రాలేదు.

ఇంతేకాక, ఆశించిన లాభాలు రాకపోగా, తగ్గిపోతూ వస్తుండటంతో భారత కంపెనీలు పరిశోధనా రంగంపై వ్యయాన్ని పెంచటం మాటటుంచి, తగ్గించుకోవలసిన స్థితిలో పడ్డాయి. 2003లో రూ.400 కోట్లు పరిశోధనకు వెచ్చించిన రాన్‌బాక్సీ, 2005లో రూ.640 కోట్లకు పెంచింది. కాగా 2006లో రూ.483 కోట్లకూ, తిరిగి 2007లో రూ.460 కోట్లకూ తగ్గించుకోవలసి వచ్చింది.

పేటెంటు ముగిసిన మందులను ఇతర కంపెనీలు తయారుచేసి అమ్మకుండా బహుళజాతి కంపెనీలు అనేక పద్ధతులననుసరిస్తాయి. సెకండరీ పేటెంట్లు, ప్రాసెస్ పేటెంట్లు తమకే వున్నాయంటూ రాయల్టీ చెల్లించమంటాయి. పెద్దఎత్తున మార్కెట్టును నింపివేస్తున్నారంటూ (డంపింగ్) పేచీలు పెడతారు. ఈ పేచీలతో కోర్టులకెక్కుతారు. దీనితో పేటెంటు తీరిపోయినా మార్కెట్లో పోటీ లేనందున కేసు తేలే వరకూ సూపర్ లాభాలను గడిస్తారు. ఈ పేచీల నుండి బయట పడటానికి కోర్టుకు వెళ్లి వాదనలు చెప్పుకొనేందుకు అమెరికాకోర్టులో కనీసం 2 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాలి. పేటెంటు తీరిన మందును అమ్మకుండా ఆపటంతో బహుళజాతి కంపెనీలకు లాభాలొస్తుండగా, దాని ఉత్పత్తికి పెట్టుబడితోపాటు కోర్టు ఖర్చులు భారత కంపెనీలు భరించాల్సి వస్తుంది. సింవాస్టాటిన్, ప్రవాస్టాటిన్ మందుల వివాదంలో రాన్‌బాక్సీ, పోజ్రాక్ మందుల వివాదంలో రెడ్డి ల్యాబ్స్ పొందిన విజయాన్ని గొప్పగా పత్రికలు ప్రచారం చేశాయి. కానీ ఆ వివాదాలతో ఆ రెండు కంపెనీలు బాగా అలసిపోయాయి. ఇంతటితో ఆగలేదు. ఆ రెండు మందుల అమ్మకానికి అనుమతి పొందేందుకు రాన్‌బాక్సీ కంపెనీ వాటి గురించి తప్పుడు సమాచారం యిచ్చింది లేదా మరియు కొంత సమాచారాన్ని దాచిపెట్టింది అని ఆరోపిస్తూ అమెరికా పార్లమెంటరీ కమిటీ విచారణ మొదలుపెట్టింది. అంటే లీగలుగా సాధ్యంకాకపోతే రాజకీయ యంత్రాంగం బహుళజాతి కంపెనీలకు వత్తాసుగా పనిచేయటం మొదలుపెడతాయి. భారత పాలకులు మాత్రం అన్ని రకాలుగా భారత కంపెనీలను బహుళజాతి కంపెనీ పులుల ముందుకు మేకపిల్లల్లా నెడుతున్నారు.

పరిశోధనా రంగంలో వస్తుందని చెప్పిన ఆదాయం కూడా రాలేదు. ఈ విధంగా ట్రిప్స్, దానితో వచ్చిన పేటెంటు చట్టం నుండి ఒనగూడుతాయన్న లాభాలేవీ భారత మందుల కంపెనీలకు చేరలేదు. ట్రిప్స్, పేటెంటు చట్టం కల్పించాయన్న అవకాశాలపై ఆశలు పెట్టుకుని, ఆ వైపుగా ప్రయాణించిన భారత కంపెనీలు తీవ్ర యిబ్బందులకు గురయ్యాయి.

## కొండ నాలుకకు మందేస్తే...

వీటి కష్టాలు ఇక్కడితో ఆగిపోలేదు. ఒక మందుకు పేటెంటు హక్కును పొందిన తర్వాత మార్కెట్లో అమ్మకాలకు తగిన అనుమతులు పొందేందుకు సగటున పదేళ్లు పడుతుంది. 1995 తర్వాత బహుళజాతి కంపెనీలు పేటెంటు హక్కు పొందిన మందులు 2005 నుండీ మార్కెట్టులోకి రావటం మొదలైంది. పేటెంటు చట్టం ప్రకారం మరో 20 ఏళ్లు వీటిని భారత కంపెనీలు తయారు చెయ్యరాదు. ఈ కొత్త మందులు భారత మార్కెట్టులోకి ప్రవేశించటంతో భారత కంపెనీల దేశీయ మార్కెట్టు కూడా తరిగిపోనారంభించింది. దీనితో భారత కంపెనీల ఇబ్బందులు తీవ్రమయ్యాయి.

**ఈ పరిస్థితుల్లో, కంపెనీ పరిస్థితి ఇంకా దిగజారి పోకముందే, రాబోయే కాలంలో మెరుగుపడుతుందేమోనన్న ఆశపై నమ్మకం లేక భాయి మోహన్ సింగ్ కుటుంబం రాన్‌బాక్సీ కంపెనీని అమ్మివేసుకుంది.**

**అయితే రాన్‌బాక్సీ అమ్మకం, అరుదైన, మినహాయింపు ఘటన కాదనీ,** పరిస్థితులిలాగే కొనసాగితే మరిన్ని భారత కంపెనీలు కూడా చేతులు మారిపోయే దిశగానే ప్రయాణిస్తాయన్నది స్పష్టం. ఇది రాన్‌బాక్సీ, రెడ్డిల్యాబ్స్ వంటి ట్రిప్స్ కల్పించినవన్న అవకాశాలను ఉపయోగించుకుందామనుకున్న పెద్ద కంపెనీలకే పరిమితం కాబోదు బహుళజాతి కంపెనీల మందులతో భారత మార్కెట్టు నింపివేయటంతో, దేశీయ మార్కెట్టు కూడా తరిగిపోతుంది. ఇది పెద్దా, చిన్నా భారత కంపెనీలన్నింటినీ సంక్షోభానికి గురి చేస్తుంది వాటికి విదేశీ కంపెనీలకు అమ్మివేసుకోవటమో లేదా మూసివేసుకోవటమో తప్ప మరో దారి మిగలకుండా పోతుంది

భారత్‌లో బహుళజాతి కంపెనీలు స్వయంగా అమ్మకాలు, తయారీ సాగిస్తున్నాయి. ఉదాహరణకు ఎలివిల్లీ తమ బ్రాంచీలు లేదా పూర్తి అనుబంధ కంపెనీలు ద్వారా మందులు అమ్ముతున్నాయి. ఉదా॥ గ్లాస్కో, వోక్‌హర్డ్, భారతీయులు, ఎన్ఆర్ఐలు యాజమాన్యంలో వున్న కంపెనీలున్నాయి. పేటెంటు చట్టాలు, ట్రిప్స్ ఒప్పందాల వల్ల బహుళజాతి కంపెనీలపై ఎలాంటి ప్రభావమూ పడలేదు. తమ పేటెంటు కంపెనీల ఉత్పత్తులను భారత మార్కెట్లో అమ్ముకుంటూ తీ కంపెనీలన్నీ లాభాలు గడిస్తున్నాయి.

ట్రిప్స్ ఒప్పందానికి అంగీకరించటమంటే భారత పరిశ్రమలను నాశనం చేయటానికి పునాది వేయటమన్న విమర్శలు ప్రజాతంత్రవాదుల నుండీ, విప్లవకారుల నుండీ పెద్ద ఎత్తున వచ్చాయి. బూజుపట్టిపోయిన సిద్ధాంతాలను పట్టుకు వేళ్లాడుతూ, ప్రపంచీకరణతో వస్తున్న అవకాశాలను చూడ నిరాకరిస్తున్నవారే ఇలాంటి విమర్శలు చేస్తున్నారంటూ, ప్రపంచంలో అగ్రరాజ్యంగా తన స్థాయిని భారత్ పొందాలంటే ఈ ఒప్పందాలు తప్పవంటూ భారత పాలకులు ఊదరగొట్టారు. ప్రపంచీకరణ ఇస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని, భారత కంపెనీలు అంతర్జాతీయస్థాయికి ఎదగాలంటూ హితబోధలు చేశారు. అగ్రరాజ్యంగా మారటమటుంచి, కాళ్ల క్రింద వున్న నేల తొలుచుకుపోయి, చతికిల పడే స్థితి ఎదురైందని రాన్‌బాక్సీ ఉదంతం తెలుపుతున్నది.

నూతన అవకాశాలను చూపి భారత మందుల పరిశ్రమకు బహుళజాతి కంపెనీలతో చేసిన వివాహం కొన్నేళ్ల లాభాల హనీమూన్ తర్వాత విడాకులతో ముగిసింది. ఏకపక్ష విడాకులతో నిరాధారంగా రోడ్డు మీదకు నెట్టివేయబడ్డ మహిళలా దిక్కుతోచని దుస్థితిలోకి భారత మందుల కంపెనీలు నెట్టివేయబడ్డాయి.

ఈ వివాహ సంధానకర్తలైన భారత పాలకవర్గాలు తమ దళారీ స్వభావాన్ని, సామ్రాజ్యవాదులకు సేవచేసే తత్వాన్ని మరోసారి బయటపెట్టుకున్నాయి దేశ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే బాధ్యత నుండి తప్పుకుని వైద్య ఆరోగ్య సేవల రంగాన్ని ప్రైవేటీకరించిన తీరుగానే మందుల రంగాన్ని కూడా విదేశీ కంపెనీలపరం చేశారు.

---

**ఆర్.ఓ.ఎల్. ...** (4వ పేజీ తరువాయి)

పోరాడుతాము. సంకుచిత జాతీయ వాదానికి వ్యతిరేకంగా కూడా పోరాడుతాము.

13. కార్మికవర్గం విజయం పొందటానికి అనేక ఐక్య సంఘటనా ఎత్తుగడల అవసరముంటుంది. సెప్టెంబరు 11 ఘటన తర్వాత అ.సం.రా ల్లోనూ, ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనూ ఫాసిజం వైపుగా వేగంగా ప్రయాణిస్తున్న సందర్భంలో ఈ కర్తవ్యం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అలాంటి ఐక్య సంఘటనల్లో తన ఉనికిని అగ్రగామి దళం నిలబెట్టుకోవాలి; కార్మికవర్గ నాయకత్వం నెలకొల్పేందుకు పోరాడాలి.

14. పెట్టుబడిదారీ సమాజంలో మహిళలపై ప్రత్యేక అణచివేత వుంటుంది. జాతీయ విముక్తి, సోషలిజం, కమ్యూనిజాల కొరకు పోరాటాల ద్వారానే మహిళా విముక్తికి నిజమైన మార్గం ఉంది.

15. కార్మికుల విప్లవకర అధికారం కొరకు పోరాటాన్ని పటిష్టపరిచేందుకు సంస్కరణల కొరకు ట్రేడు యూనియను పోరాటాలను వినియోగించు కోవాల్సిన అవసరాన్ని ఆర్.ఓ.ఎల్. గుర్తిస్తున్నది. ఆ వెలుగులో, కార్మికవర్గపు ఆత్మ రక్షణకు కీలకమైన సంస్థగా అ.సం.రా. ట్రేడు యూనియను ఉద్యమాన్ని రక్షించుకోవాలి. యూనియన్లను దెబ్బతీసే అ.సం.రా. గుత్తపెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వర్గ పోరాట పునాదిపై, ప్రజాస్వామికంగా దానిని పునర్నిర్మించాలి.

16. సామ్రాజ్యవాదపు ప్రపంచరంగాన్ని, అన్ని దేశాల విప్లవోద్యమాలూ, కార్మికవర్గ విప్లవాల సంఘటనతో ఎదుర్కోవాలి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రముఖమైన అనుకూల పాత్రను నిర్వహించింది. నేడు అలాంటి సంస్థ అవసరముంది

17. జె.వి.స్టాలిన్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ యూనియన్ (బోల్షివిక్)లు మహనీయ లెనిన్ నాయకత్వం పరంపరగా, యుఎస్ఎస్ఆర్‌కూ, ప్రపంచ ఉద్యమానికీ 1924 నుండి రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు వరకూ కాలంలో అసామాన్యమైన నాయకత్వాన్ని అందించాయి. ప్రపంచ ఫాసిజంపై విజయాన్ని సాధించాయి. 1949లో చైనా ప్రజాతంత్ర విప్లవ విజయానికి దారి తీసిన సుదీర్ఘకాల విప్లవ క్రమంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, మావో సేటుంగ్‌లు భూమిపై అత్యధిక ప్రజలు నివసిస్తున్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, అరేబియా, ఆఫ్రో-అమెరికా పీడిత జాతులకు విముక్తి మార్గాన్ని చూపారు.

18. వాస్తవస్థితికి భిన్నంగా పోరాటం సులభమన్న భ్రమ (జోస్ మారియా సిసాన్) అవకాశవాదమౌతుంది. అన్ని రంగాలలోనూ 'మితవాద' అవకాశవాదానికీ (సంస్కరణవాదం, తోకపుచ్చుకుపోవటం), 'అతివాద' అవకాశవాదానికీ (దుస్సాహసికవాదం) వ్యతిరేకంగా నిలకడగా పోరాటాన్ని సాగించాలి. ఈ పోరాటం లేకుండా సామ్రాజ్యవాదంపై పోరాటం అన్నది "బూటకం, భ్రమ" (లెనిన్). "కార్మికవర్గానికి సత్యం కావాలి. గౌరవనీయ పెటీ బూర్జువా అబద్ధాల కంటే హానికరమైనవి వుండవు" (లెనిన్).

**- ఏప్రిల్, 2008**


చదవండి! చదివించండి!!

జనశక్తి ప్రచురణ

**రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద**

వెల: 10.00

ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2.

# పాలకుల, ప్రభుత్వ అండదండలతో భారత వ్యవసాయరంగానికీ, ప్రజానీకానికీ ముంచుకొచ్చిన
# జన్యుమార్పిడి ఆహార పంటల, ఆహార పదార్థాల ముప్పు!

**ఇటీవలి** కాలంలో ఆహార సంక్షోభం గురించి **దేశంలో** విపరీతమయిన ప్రచారం కావింపబడుతోంది. **ఆహార** ధాన్యాల, పప్పుల అధిక ధరల గురించి కూడా **ప్రచారం** కావింపబడుతోంది. ఈ రెండు సమస్యలను **కలగా**వులగంచేసి ప్రచారం చేయటం ద్వారా, **ఆహార**ధాన్యాల అధికోత్పత్తి ద్వారా మాత్రమే ఈ రెండు **సమస్యలను** పరిష్కరించటం సాధ్యమవుతుందంటున్నారు. **ఈ** పరిష్కారం సమంజసంగా వున్నట్టు కనబడుతుంది. **నిజానికి** దేశంలో ఈ రోజున ఆహారధాన్యాల, పప్పు **దినుసుల** కొరత ఏమాత్రం లేదు. ప్రభుత్వ లెక్కల **ప్రకారమే** ఈ సంత్సరం పంటలు యిబ్బడి ముబ్బడిగా **పండాయి**. అయినా ఈ ఆహారధాన్యాలు ప్రజలకు **అందుబాటులోకి** రావటం లేదు. ధరలు పెరిగిపోతూనే **ఉన్నాయి**. అంటే ఈ సమస్యలకు కారణం ఆహార **ధాన్యాల**, పప్పుదినుసుల పంటలు తరగటం వలన కాదు, **మరేవో** యితర కారణాల వలన ఉత్పన్నమయినవని **తేలిగ్గానే** అర్ధమవుతుంది. ఇటువంటప్పుడు **ఆహారధాన్యాల** ఉత్పత్తి పెంపుదల గురించి మాట్లాడ్డంలో గల అంతరార్ధమేమిటి?

భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యత్వం స్వీకరించినప్పటి నుండీ, తన వ్యవసాయక మార్కెట్లపైనా, వ్యవసాయ ఉత్పత్తి పైనా గల స్వతంత్రాన్ని సామ్రాజ్య వాద ప్రయోజనాలకు అనుబంధంగా మలచటం జరిగింది. ఆ సంస్థ ఒప్పందం ప్రకారం యితర దేశాల ఆహార ధాన్యాల అమ్మకానికి భారత మార్కెట్టును తెరవాలి. సామ్రాజ్యవాద బడా కార్పోరేట్లకు అనుగుణంగా భారత వ్యవసాయరంగాన్ని మలచాలి. అంటే సామ్రాజ్యవాద కార్పోరేటు కంపెనీల వాణిజ్య ప్రయోజనాలకు తోడ్పడేటట్లు చేయాలి. దీని కోసమే నేడు భారత పాలకులూ, ప్రభుత్వం వ్యవసాయ అధికోత్పత్తి నినాదం చేబట్టారు. అధునాతనమయిన జీవసాంకేతిక (బయో టెక్నాలజీ) విజ్ఞానం ద్వారా ప్రజల ఆహారపు అవసరాలను సమృద్ధిగా తీర్చటం సాధ్యమవుతుందని పాలకులు, ప్రభుత్వమూ పదే, పదే ప్రచారం చేస్తున్నారు. ఆహార సంక్షోభాన్ని నివారించటానికీ, ధరల పెరుగుదలను అదుపు చేయటానికీ జన్యుమార్పిడి ఆహారపంటలే శరణ్యమని వాదిస్తున్నారు.

ఇప్పటికే బి.టి. ప్రత్తి విత్తనాలను దేశంలో ప్రవేశపెట్టిన బడా విత్తన కార్పొరేట్ సంస్థలయిన మోన్శాంటో, డౌ అగ్రో సైన్సెస్, డ్యూపాంట్‌లాంటి సామ్రాజ్యవాద దోపిడీ కార్పోరేషన్లు జన్యుమార్పిడి ఆహార పంటలను మన దేశంలో ప్రవేశపెట్టకుండా, తమ అమ్మకాలను పెంచుకొని, సూపర్ లాభాలను గడించే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఈ బడా సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలకు స్థానిక దళారులుగా దేశీయ విత్తన సంస్థలు కొన్ని పుట్టుకు వచ్చాయి. ఈ రకంగా ఒక పథకం ప్రకారం దేశీయ వ్యవసాయరంగాన్ని ఆక్రమించుకొని, మన దేశపు వ్యవసాయరంగ సార్వభౌమత్వాన్ని కబళించేందుకు ఆ సామ్రాజ్యవాద బడా విత్తన కార్పోరేట్లు రంగాన్ని సిద్ధం చేసుకొన్నాయి.

జన్యుమార్పిడి బియ్యం (వరి), గోధుమలు, జొన్న, మొక్కజొన్న, బంగాళాదుంపలు, టమోటాలు, మిర్చి, బెండకాయలు, వంకాయలు, క్యాబేజి, బీట్‌రూట్, క్యాలీఫ్లవర్, ముల్లంగి, సొరకాయలను మన దేశంలోనే పండించి మన దేశంలోనే అమ్మటానికి పథకాలను ఆ బడా కార్పోరేట్ కంపెనీలు సంసిద్ధంగా పెట్టుకొన్నాయి.

బయో ఇంధన అవసరాలకోసం, బయో ఆహార ధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదులు, బయో ఆహారపు పంటలను విస్తీర్ణమైన భారతదేశంలో పండించటంకోసం విపరీతంగా ప్రయత్నాలు జరుపుతున్నారు.

ఇప్పటికే బ్రెజిల్, భారతదేశం, చైనా దేశాల్లోకి అక్రమంగా ప్రవేశించి ఈ పంటలను అదుపుచేయటం, నియంత్రించటం అన్నది సాధ్యంకాకుండా చేశాయని ఐక్యరాజ్య సమితి యిటీవల విడుదల చేసిన ఒక రిపోర్టులో పేర్కొంది. భారతదేశంలో ఈ జన్యుమార్పిడి పంటలను నియంత్రించే సామర్థ్యంగల సాంకేతిక ఏర్పాట్లు లేవనీ, అందువల్లనే జన్యుమార్పిడి పంటలు భారతదేశం లోకి అక్రమంగా ప్రవేశిస్తున్నాయనీ ఆ రిపోర్టు తెలియచేస్తోంది.

యోకిహామాలో గల ఐక్యరాజ్య సమితికి చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సుడు స్టడీస్ ఆఫ్ బయో టెక్నాలజీ, 'బయో సేఫ్టీలు' అన్న అంశంపై యిచ్చిన రిపోర్టులో భారతదేశంలోకి అక్రమంగా విస్తృతంగా ప్రవేశించబడి కొనసాగుతున్న జన్యుమార్పిడి పంటల పట్ల ఆందోళన వెలిబుచ్చుతూ యీ పరిణామం వలన భవిష్యత్తులో ఆ దేశం నుండి జరిగే ఆహార ధాన్యాల ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధాలు విధింపబడ వచ్చునని పేర్కొనటం జరిగింది. ఆ రిపోర్టును రచించిన వారిలో ఒకరైన శామ్ జాన్సన్ "జన్యుమార్పిడి పంటలపై తగిన జన్యుభద్రతావరమైన ఆంక్షలు విధించి, అమలుజరుపకపోవటం వలన భారతదేశం ఒక పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కోబోతోంది" అంటూ ప్రకటించాడు. "మీకు జీవ సాంకేతికతను సక్రమంగా పర్యవేక్షించగల సామర్థ్యం లేకపోతే, మీకు సరయిన బయోభద్రత లేని కారణంగా, ఆ సాంకేతికతను మీపై బయో ఉగ్రవాదం నెరవటానికి వినియోగవడుతుంది'' అంటూ హెచ్చరించాడు. అంతేకాక "బయోసాంకేతికత మీ సమస్యలన్నిటికీ పరిష్కారం కాదు. అధిక సంఖ్యలో ప్రజలు జన్యుమార్పిడి ఆహారానికి తట్టుకోలేని స్థితిని కలిగి వుంటారు. అటువంటి పరిస్థితుల్లో, బయో భద్రతా యంత్రాంగం లేని స్థితిలో భారతదేశంలోని ప్రజలు ఆ జన్యుమార్పిడి పంటలపట్ల వ్యతిరేకతను కలిగి వుండటం సబబే" అంటూ కూడా వ్యాఖ్యానించాడు

అయినా భారత పాలకులకు, ప్రభుత్వానికీ యిటువంటి హెచ్చరికలు, సలహాలు చెవికి ఎక్కడం లేదు. **వీరు సామ్రాజ్యవాద ప్రయోజనాలను మన దేశంలో పెంపొందించటానికి సంసిద్ధంగా వుండటం వలన ప్రజల ఆరోగ్య, భద్రతలను పట్టించుకోని స్థితిలో వీరు వున్నారు. వ్యవసాయ-జీవసాంకేతిక పరిశ్రమను తమ గుప్పెట్లో పెట్టుకొన్న బడా విత్తన కార్పోరేట్లయిన మోన్శాంటో, డౌ అగ్రి బిజినెస్, డ్యూపాంట్** కంపెనీలే మన పాలకులను, ప్రభుత్వ విధానాలను నడిపిస్తున్నట్లుగా అనుభవంలో తేటతెల్లమవుతోంది. దేశ ప్రజల ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా ఈ జన్యుమార్పిడి ఆహార పంటల, ఆహార పదార్థాల అమ్మకానికి భారతదేశ మార్కెట్లు, వ్యవసాయరంగాలను అనువుగా కుదించటానికే వీరు కంకణం కట్టుకొన్నట్లు అర్ధమవుతోంది. బయో టెక్ ప్రమోటర్లకు అనుకూలంగానే దేశంలోని చట్టాలను రూపొందించి, సవరించటానికి కృతనిశ్చయులై వున్నారని అర్ధమవుతోంది.

సంపన్న యూరోపు దేశాలు, జపాన్ తదితర దేశాల్లో జన్యుమార్పిడి ఆహార పంటల, ఆహార పదార్థాలపై పూర్తి నిషేధం వుంది. జన్యుమార్పిడి ఆహారాన్ని అంగీకరించే దేశాలు సహితం, ఆ పంటను లేదా పదార్థాలను తమ దేశంలో ప్రవేశించటానికి పలు ఆంక్షలు పెట్టి, నియంత్రించటం ద్వారా అనుమతించటం జరుగుతోంది. జన్యుమార్పిడి ఆహార పదార్థాలపై స్ఫుటంగా కనబడేటట్టు 'జన్యుమార్పిడి ఆహార పదార్థం' అనే లేబుల్ అతికించకుండా ఆ ఆహారాన్ని తమ దేశాల మార్కెట్లలో ప్రవేశబెట్టడాన్ని నిరోధించటం జరుగుతోంది.

## అక్రమ ప్రవేశం:

కానీ మన దేశంలో మాత్రం ఎటువంటి నియంత్రణా లేకుండానే హానికరమైన, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమైన జన్యుమార్పిడి ఆహార వస్తువులు అక్రమంగా ప్రవేశించాయి.

కేథలిక్ సహాయక సేవలు నిర్వహించే కేర్ ఇండియా సంస్థ ద్వారా, ఆహారపు సహాయం పేరిట జన్యుమార్పిడి రిఫైన్డ్ సోయాబీన్ నూనె, క్రూడ్ సోయాబీన్ ఖాద్య తైలాలు మన దేశంలోకి 2002 సంవత్సరంలోనే ప్రవేశపెట్టబడ్డాయి.

ఇటీవలి కాలంలో ఢిల్లీ, మద్రాస్ సూపర్ మార్కెట్లలో 'డోరిటోస్' బ్రాండు జన్యుమార్పిడి బంగాళ దుంపల చిప్పు ప్యాకెట్లు అమ్మకానికి పెట్టారు. జర్మనీకి చెందిన ఒక స్వతంత్ర లేబరేటరీ ఈ చిప్పు సాంపిల్సును పరిశీలించి వీటిలో మాన్ 863, ఎన్‌కె603 అనబడే పురుగుమందుల, కలుపుమొక్కల విధ్వంస రసాయనాల జాడలు వున్నట్లూ, యివి జన్యుమార్పిడి ఆహారపదార్థాలు అయినట్లూ నిర్ధారించింది. ఈ చిప్పు ప్యాకెట్లపై అవి జన్యుమార్పిడి ఆహారపదార్థాలున్న లేబుల్స్ (హెచ్చరిక) ప్రకటన లేదు. ఈ చిప్పును ఉత్పత్తి చేసే పెప్సీ కంపెనీ, తాను ఈ చిప్పును నేరుగా, ప్రత్యక్షంగా భారత మార్కెట్టులోకి అమెరికా నుండి ఎగుమతి చేయలేదని ప్రకటించింది. అంటే తన జన్యుమార్పిడి ఆహార పదార్థాలను అక్రమ పద్ధతుల ద్వారా భారతదేశంలోకి అమ్మకానికి పెప్సికో దింపిందన్నమాట.

జన్యుమార్పిడి పంటలు ఆహార పదార్థాలపై నిషేధం, నియంత్రణాలేని అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా దేశాలలాంటి దేశాల నుండి మన దేశానికి దిగుమతి అయే ఆహారధాన్యాలు, ఆహారపదార్థాల ద్వారా ఈ జన్యుమార్పిడి ఆహారం మన దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తోంది. వీటిని పరీక్షించటానికి తగు ఏర్పాట్లులేని కారణంచేత 16 రేవుల ద్వారా ఇది మన దేశంలోకి చొరబడుతున్నాయి.

ఈ జన్యుమార్పిడి ఆహార పంటలను ఉత్పత్తిచేసే కంపెనీలు, తమ ఉత్పత్తులను జన్యుమార్పిడి ఆహార పదార్థాలా? కాదా? అనే పరీక్షలు తాము నిర్వహించమనీ, అలా చేస్తే తమ ఉత్పత్తుల ధరలు ఎక్కువగా వుంటాయనీ, అందువలన తమ ఉత్పత్తులపై జన్యుమార్పిడి ఆహార పదార్థం అన్న లేబుల్‌ను ప్రకటించటల్లేదనీ, తమ ఉత్పత్తులను కొనుగోలు చేసుకొన్నవారే వాటిని పరీక్షింప చేసుకోవాలనీ వాదిస్తున్నారు.

భారతదేశంలోకి జన్యుమార్పిడి ఆహార పదార్థాలకు అనుమతి యివ్వాల్సిన బాధ్యత భారత ఆరోగ్య కుటుంబ నియంత్రణశాఖకు చెందిన నియంత్రణ సంస్థకు యివ్వబడింది. ఆహారభద్రతా ప్రమాణాల అధారిటీగా పిలువబడే ఈ సంస్థ యింత వరకూ పనిచేయటం ప్రారంభించలేదు. ఈ రకంగా తగు నియంత్రణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకుండా అక్రమంగా జన్యుమార్పిడి ఆహారాన్ని భారతదేశంలోని మార్కెట్లలో ప్రవేశపెట్టడానికి పరోక్ష అవకాశాలను ప్రభుత్వం కల్పించి పెట్టింది. **బయో భద్రతను పూర్తిగా నిర్లక్ష్యంచేసి ప్రజల ఆరోగ్య ప్రమాదానికి దారులు తెరిచిపెట్టడం జరిగింది.**

## వంకాయల మాయోపాయం:

**అతి త్వరలో భారతదేశపు మార్కెట్లలోకి జన్యుమార్పిడి వంకాయలు అమ్మకానికి పెట్టడానికి భారత** ప్రభుత్వం మోన్శాంటో కంపెనీకి భారత దేశంలో దళారీ విత్తన సంస్థ అయిన మహికో కంపెనీకి అనుమతులు యివ్వబోతోంది

జన్యుమార్పిడి ఆహారపు పంటలకు అనుమతినిచ్చే అధికారం మన దేశంలోని 'జెనిటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ' (జీ.ఇ.ఎ.సి.)ది. ఏదైనా జన్యుమార్పిడి ఆహారపు పంటను మార్కెట్లో విడుదల చేయటానికి అనుమతినిచ్చే ముందు ఆ పంటను వివిధ స్థాయిల్లో పరిశీలించాలి. తత్సంబంధమయిన వివరాలను పరీక్షించాలి 'గ్లాస్ హౌస్' (గాజు పరిశోధనశాలలో) ఈ పంటలను పరీక్షించి, అవి హానికరంగా లేవు అని తేలిన తర్వాత, బహిరంగ క్షేత్రాల్లో వివిధ ప్రాంతాల్లో ఈ పంటల పరిశోధన నిర్వహించి, యివి ఏ రకంగానూ హానికరం కాని పంటలు అని తేలాక మాత్రమే వాటికి మార్కెట్లో ప్రవేశపెట్టడానికి అనుమతులు యివ్వాలి. కానీ యిటువంటి పరీక్షలను నికరంగా నిర్వహించకుండా మోన్శాంటో కంపెనీ ఒత్తిడితో అడ్డదారుల్లో ఈ జన్యుమార్పిడి వంగ పంటను వాణిజ్యపరంగా అనుమతించటానికి మార్గం సుగమం చేయబడింది. ఇదికాక జన్యుమార్పిడి వరి, జొన్నలాంటి యితర ఆహార పంటలకే క్షేత్ర స్థాయి పరిశోధనలు అనుమతించబడి, వాణిజ్యపర అమ్మకపు అనుమతులు మంజూరు చేసే దశకు చేరుకున్నాయి.

మహికో నిర్వహించిన వివిధ పరిశోధనల ఫలితాల వివరాలు లేకుండానే, బహిర్గతపరచుకుండానే, ప్రజలతో లేదా తత్సంబంధిత వ్యవసాయరంగంలోని వివిధ భాగస్వాములతో చర్చించకుండానే ఈ బి.టి వంగకు అనుమతి మంజూరు చేయబడుతోంది.

చీడపీడలను తట్టుకోవటంకోసం బి.టి. పరిజ్ఞానాన్ని వంకాయలలో ప్రవేశపెట్టి, వాటిని మార్కెట్టుకి తీసుకు రావటానికి జరుగుతున్న ప్రయత్నం దేశంలోని పలువురు వ్యవసాయవేత్తలను, పర్యావరణ నిపుణులను, కలవర పెడ్తోంది. వీరంతా సరైన పరిశోధనలు జరుపకుండానే వీటిని మార్కెట్లో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

అసలే అనేక ఎలర్జీలను కల్గించే వంకాయల్లో ఈ బి.టి. పరిజ్ఞానంతో సి.ఆర్.వై.9 అనే ప్రోటీన్‌ను ప్రవేశ పెట్టడం జరుగుతోంది. ఈ సి.ఆర్.వై.9 ప్రొటీన్ అరగదనీ, జీర్ణాశయంలోని జీర్ణరసాలకు ఈ ప్రోటీన్‌ను జీర్ణంచేసే శక్తిలేదనీ సి.ఆర్.వై.9 ప్రొటీన్ మరిన్ని అలెర్జీలకు దారి తీస్తుందని శాస్త్రజ్ఞులు తెలియచేస్తున్నారు.

ఈ సి.ఆర్.వై. 9 ప్రొటీన్‌తో రూపొందించిన మొక్కజొన్న వంగడాల వలన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం వుందని గుర్తించిన అమెరికా పర్యావరణ కమీషన్ వాటికి అనుమతి యివ్వలేదు

మన దేశంలో కూడా పర్యావరణం, జీవావరణం, జలావరణంపై జన్యుమార్పిడి పంటలు ఎలాంటి ప్రభావం చూపుతాయో నిర్ధారించకుండా క్షేత్రస్థాయి పరిశోధనలకు అనుమతులివ్వరాదని ఒక కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

అయినా యివేవీ ఖాతరు చేయకుండా ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలలో ఈ వంగ పంట క్షేత్ర పరిశోధనలకు అనుమతులివ్వటం జరిగింది.

తమిళనాడు అగ్రి కల్చరల్ యూనివర్శిటీ, పశ్చిమ బెంగాల్‌ని నాడియా జిల్లాలోనూ, మాయోపాయంతో మహికో కంపెనీ ఈ క్షేత్ర పరీక్షలు నిర్వహించింది. ఒక పంచాయితీ నుండి అనుమతి సంపాదించి, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే మహికో పశ్చిమ బెంగాల్‌లో ఈ క్షేత్ర పరీక్షలను నిర్వహించింది. పంటకోత సమయం వచ్చాక, అప్పుడు వాటిని గురించి పరిశీలించాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయ యూనివర్శిటీపై ఒత్తిడి తెచ్చి, అడ్డగోలుగా ప్రవర్తించి అనుమతులు సంపాదించింది అని బిదాన్‌చంద్ర కృషివిశ్వవిద్యాలయం తెలియచేస్తోంది. అసలు ప్రభుత్వానికి తెలియకుండానే పశ్చిమబెంగాల్‌లో జన్యుమార్పిడి వరి, బెండ పంటల క్షేత్రస్థాయి పరీక్షలను ఈ కంపెనీ పూర్తి చేసింది.

ఈ కంపెనీ సరఫరా చేసిన శాంపిల్స్‌ను పరీక్షించి వీటికి అనుమతినిచ్చామనీ, కంపెనీ యిచ్చిన పరిశోధన వివరాలనూ, శాంపిల్సునూ అనుమానించటం తగదనీ చెప్తూ జి.ఇ.ఎ.సి. తాను క్షేత్ర పరిశోధనలకు యిచ్చిన అనుమతులను సమర్థించుకొంటోంది.

అయితే సుప్రీంకోర్టు ప్రత్యేక నామినీగా జి.ఇ.ఎ.యిలో నియమించబడ్డ ప్రముఖ శాస్త్రవేత్త అయిన పి.ఎం.భార్గవ జి.ఇ.ఎ.సి తగు పరిశోధనలు జరుపకుండానే, జి ఎం. పంటల విష ప్రభావం, ఎలర్జీల ప్రభావాలను పరీక్షించకుండానే, ఈ వరి వంగడాలకు క్షేత్ర పరిశోధనలకు అనుమతినివ్వటాన్ని తప్పుపట్టారు బి టి ప్రత్తి, ఇతర ఆహార పంటల క్షేత్ర పరిశోధనలపై 5 సంవత్సరాలపాటు మారిటోరియం ప్రకటించాలనీ, ఈ కాలంలో తగు పూర్తి పరిశోధనలు అన్నీ జరిపి, ఆ పంటలు మానవుల, జంతువుల ఆరోగ్యానికి హానికరం కావనీ, యితర పంటలకు (సాంప్రదాయక) వినాశనకరం కావనీ నిర్ధారించుకొన్నాకే క్షేత్ర పరిశోధనలకు అనుమతి నివ్వాలని ఆయన డిమాండు చేస్తున్నారు.

ఈ పంటలకు అనుమతినివ్వాల్సిన జెనిటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీలో జన్యుమార్పిడి పంటలకు అనుకూలమయిన వ్యక్తులే సభ్యులుగా వుండటం వలన, ఎటువంటి పరిశోధనలూ, నిర్ధారణలూ జరుపకుండానే, మోన్శాంటో కంపెనీకి అనుమతులు మంజూరు చేయబడుతున్నాయని అర్ధమవుతోంది.

జి.ఇ.ఎ.సి.కి కో-ఛైర్మన్‌గా ఉన్న సి.డి.మాయి, బయో సాంకేతిక బడా సంస్థలయిన మోన్శాంటో, డ్యూపాంట్, బేయర్లు నిర్వహించే అంతర్జాతీయ సంస్థ అయిన ఐ.ఎస్.ఎ.ఎ.ఎ. అనే సంస్థలో బోర్డు సభ్యుడు. సహజంగానే ఆయన ఆ బడా సంస్థల ప్రయోజనాల కోసం భారత వ్యవసాయరంగాన్నీ, ప్రజల ప్రయోజనాన్నీ పణంగా పెట్టడానికి అంగీకరిస్తాడు. అలాగే సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ రిసెర్చికి డైరెక్టరుగా వున్న డా॥ బి.ఎం.ఖాది ఈ జి.ఇ.ఎ.సి.లో మరో సభ్యుడు. ఈయన డైరెక్టరుగా వున్న సంస్థ యిప్పటికే జన్యుమార్పిడి ప్రత్తి వంగడాలను రూపొందించింది. అదే రకంగా జన్యుమార్పిడి ఆవ వంగడాలను రూపొందించిన ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ దేపక్ పెంటాల్ ఈ జి.ఇ.ఎ.సి.లో కూడా సభ్యుడు. జన్యుమార్పిడి వరి, టమేటో, గోధుమలను రూపొందిస్తున్న ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్, డైరెక్టరూ అయిన డా॥ అఖిలేష్‌త్యాగి ఈ జి.ఇ.ఎ.సి.లో ఇంకో సభ్యుడు. ఈ రకంగా యిప్పటికే జన్యుమార్పిడి ఆహార పంటలను రూపొందించటంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నవారే ఈ పంటలను అనుమతించే ప్రభుత్వపు కమిటీ సభ్యులుగా వుండటం వలన ఎటువంటి పరీక్షలూ-నిర్ధారణలూ లేకుండా ఈ ప్రమాదకర క్షేత్ర పరిశోధనలకు అనుమతులనివ్వటం జరుగుతోంది.

కార్పోరేట్ లాబీ మన దేశంలో అఖిల భారత జన్యుమార్పిడి పంటల సాంకేతిక అసోసియేషన్'గా ఏర్పడి భారతదేశంలోకి జీవసాంకేతికత ప్రవేశాన్ని జాగ్రత్తల పేరిట అడ్డుకోరాదంటూ తమకనుకూలంగా వాదిస్తూ, తమకనుకూల భావాన్ని, అభిప్రాయాన్ని సృష్టిస్తోంది.

**(తరువాయి 7వ పేజీలో)**

**జన్యుమార్పిడి...** (6వ పేజీ తరుహాయి)

పరిశ్రమలకు (జన్యుమార్పిడి సాంకేతికతకు) అనుమతులివ్వటానికి 5 నుండి 7 సంవత్సరాల కాలయాపన చేసుకొనే బదులు, యిప్పుడు 2-3 సంవత్సరాల్లోనే అనుమతినివ్వటం అనేది, దేశ సాంకేతిక ప్రగతిని పెంపొందించటానికి సంకేతం అంటూ ఈ లాబీ ప్రచారం చేస్తోంది.

అయితే ఈ అడ్డదారి పద్ధతులను నిరసిస్తూ రిసెర్చి ఫౌండేషన్ ఫర్ సైన్సు, టెక్నాలజీ అండ్ ఎకోలజీ సంస్థకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త వందనా శివ, సుమన్ హాయ్‌కు చెందిన జీన్ కేంపైన్ సంస్థకు చెందిన అరుణ రోడ్రిగ్స్, సెంటర్ ఫర్ సస్టయినబుల్ అగ్రికల్చర్‌కు చెందిన కవిత, గ్రీన్ పీస్ సంస్థకు చెందిన దివ్య రఘునందన్ లాంటి శాస్త్రవేత్తలు దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా) వేశారు.

వీరు కార్పోరేట్ కంపెనీలు తమ పరిశోధన ఫలితాలు ఎలా వున్నాయో చెప్పకుండానే విత్తనాల క్షేత్రపరిశోధన స్థాయికి దిగటం, ఫలితాలు వెల్లడించక పోవడం అనైతికమని వాదిస్తున్నారు. అయితే మహికో కంపెనీ ప్రతినిధులు ఆ వివరాలు తమ 'వ్యాపార రహస్యం' అనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం ఆ వివరాలు వెల్లడించాల్సిన అవసరం తమకు లేదని వాదిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి మంజూరు సంస్థలు ఈ వాదనను పరోక్షంగా సమర్థిస్తున్నాయి.

ఈ జన్యుమార్పిడి పంటల వలన రైతులు అధిక ధరలతో విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందనీ, క్రమేపీ సాంప్రదాయ విత్తనాలు కనుమరుగై బి.టి. విత్తనాలే మిగులుతాయనీ, ఇకపై ఏ కూరగాయ మొక్కలు పండించాలన్నా రైతులు ఈ కంపెనీలకు రాయల్టీలు చెల్లించాల్సి వస్తుందనీ, పర్యవసానంగా విత్తన సరఫరాలలో ప్రభుత్వ అజమాయిషీ అంతరించి, విత్తన కంపెనీల యిష్టారాజ్యంగా మారుతుందనీ, విఫలమైన తమ బి.టి. పంటలను రైతులు వేయటానికి ఈ కంపెనీలు ఎక్కువ విత్తనాలూ, ఎక్కువ ఎరువులూ వాడాలని ప్రోత్సహిస్తున్నాయనీ, ఒకసారి బి.టి. పంట వేస్తే ఆ తర్వాత వేసే పంటపై దుష్ప్రభావం వుంటుందనీ శాస్త్రవేత్తలు తెలియచేస్తూ ఈ పంటలను వ్యతిరేకిస్తున్నారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతికతను పరిష్కారంగా చూపిస్తున్న కంపెనీలు ఈ సాంకేతికతవల్ల తలెత్తే సమస్యలు, అనర్థాలకు పరిష్కారం చూపించట ల్లేదనీ, సమస్యలను పట్టించుకోవటల్లేదనీ శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. నిజాలు బయటపడకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలపై కూడా తీవ్రమయిన వత్తిడి వస్తోందని వీరు ఆరోపిస్తున్నారు.

అయినా భారత పాలకులు, జన్యుమార్పిడి పంటలకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలూ వీటిని ఖాతరు చేయకుండా జన్యుమార్పిడి ఆహార పంటలను ప్రోత్సహించటానికే ముందుకు దూకుతున్నారు.

**బయోటెక్ ప్రణామం:**

'పర్యావరణ భద్రత, రైతుకుటుంబాల శ్రేయస్సు, వ్యవసాయ వ్యవస్థల పర్యావరణ, ఆర్థిక సుస్థిరత, వినియోగదార్లు-ఆరోగ్యభద్రత, పోషకాహార భద్రత, దేశ, విదేశీ వాణిజ్యాల అభివృద్ధికి తోడ్పాటు, జీవవైవిధ్య రక్షణకోసం' ఒక జాతీయ జీవసాంకేతికత క్రమబద్ధీకరణ కమిటీని ఏర్పాటు చేయాలని డాక్టర్ స్వామినాధన్ కమిటీ టాస్క్ ఫోర్స్ సూచించింది.

దేశంలో జీవసాంకేతికతను అభివృద్ధి చేసే బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జీవసాంకేతిక విభాగంపై పూర్తిగా వుంది.

దేశంలో జన్యుపరివర్తిత జీవుల క్రమబద్ధీకరణకు చట్టం లేకపోవటం వలన ఒక సమగ్రమైన చట్టాన్ని చేసి జీవసాంకేతిక క్రమబద్ధీకరణ విధానాన్ని మెరుగుపరచాలని ఎంతో కాలంగా పలు పౌరసంస్థలు డిమాండు చేస్తున్నాయి. పలువురు శాస్త్రజ్ఞులు సుప్రీంకోర్టును ఆశ్రయించింది అటువంటి చట్టం కోసమే.

ఈ నేపథ్యంలో జీవసాంకేతిక క్రమబద్ధీకరణ విధానాన్ని మరింత శాస్త్రీయమూ, పారదర్శకమూ, ప్రజాస్వామికమూ, న్యాయబద్ధమూ, జవాబుదారీతనం వహించేదిగా, మెరుగుపరచటంకోసం ఒక క్రొత్త చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని ఆశిస్తాము.

కానీ కేంద్ర ప్రభుత్వం త్వరత్వరగా ఒక ముసాయిదా చట్టాన్ని తయారుచేసింది. ఆ ముసాయిదా చట్టాన్ని బిల్లురూపంలో ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టం చేయబోతోంది.

ఈ చట్టంలో విచిత్రంగా డి.బి.టి. ఆధ్వర్యంలో పని చేసే ఒక 'స్వతంత్ర' జాతీయ జీవసాంకేతిక క్రమబద్ధీకరణ అధికార మండలి (ఎన్.బి.ఆర్.ఎ)ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించటం జరిగింది. డి.బి.టి ఆధ్వర్యంలో పనిచేయని ఎన్.బి.ఆర్.లు అయితే పారిశ్రామిక వర్గాలవారి (విత్తన కార్పోరేట్ల) ప్రయోజనాలు నెరవేరవన్న ఉద్దేశ్యంతో స్వామినాధన్ టాస్క్‌ఫోర్స్ సూచించకపోయినా, డి.బి.టి. ఆధ్వర్యంలో నడిచే 'స్వతంత్ర' అధికారమండలిని ఏర్పాటు చేయటం అన్న ప్రతిపాదనను ఈ చట్టం ముసాయిదాలో చేర్చారు. అంతేకాక జీవసాంకేతికతతో ఏర్పడే సమస్యల నుండి దేశపర్యావరణ, జీవావరణ వ్యవస్థలను పరిరక్షించటం, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించటం అన్నవి ఈ చట్టం యొక్క ప్రధాన లక్ష్యాలుగా వుండాల్సిందిగా, ఈ చట్టపు ముసాయిదా ముందుమాటలో 'జీవసాంకేతికతతో ఏర్పడే అవకాశాలు, సమాజం-ఆర్థికవ్యవస్థపై ఆ కొత్త సాంకేతికత చూపే ప్రభావాల'గురించి ఏకరువు పెట్టడం జరిగింది.

ఈ రకమయిన ప్రతిపాదనలను, వివరణలనుబట్టి చూస్తూ ఈ ముసాయిదా బిల్లు బయోటెక్ ప్రమోటర్లకు అనుకూలంగా రూపొందించబడిందే తప్ప, దేశ, దేశాల ప్రజల ప్రయోజనాలకోసం ఉద్దేశింపబడింది కాదని అర్థమవుతోంది. ఏ రూపంలోనైనా ఈ జన్యుమార్పిడి ఆహార పంటలను దేశంలోకి ప్రోత్సహించటమన్నదే ప్రభుత్వ ఉద్దేశంగా అర్థమవుతోంది.

ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించిన 'నేషనల్ బయో టెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ' (ఎన్.బి.ఆర్.ఎ)ను ఏర్పాటుచేసే ముందు దేశంలో విస్తృతంగా జరగాల్సిన చర్చలను ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహిస్తోంది. ఇటీవల ఈ ఎన్.బి.ఆర్.ఎ.లు ఏర్పాటుపై ప్రతిపాదిత చట్టాన్ని ప్రభుత్వం మే 28న రూపొదించి జన్యుమార్పిడి పంటలను మన దేశంలోకి అనుమతించాలా? వద్దా? అనే కీలకమయిన అంశంపై అనుమతులునిచ్చే ఈ నియంత్రణ సంస్థ ఏర్పాటుపై ప్రాంతీయ సలహాలను నిష్పాక్షికంగా స్వీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 12వ తేదీన జరిపింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు చెందిన ఏ ప్రధాన రైతుసంఘాల ప్రతినిధులనూ ఆహ్వానించలేదు. కేవలం జన్యుమార్పిడి విత్తన కంపెనీలతో పొత్తు కుదుర్చుకొన్న చెంగల్‌రెడ్డి రైతు ఫెడరేషన్‌లాంటి కొన్ని అనుకూల సంఘాలను ఈ కీలకాంశపు చర్చలకై ఆహ్వానించటం జరిగింది. కర్నాటక రాష్ట్రంలో అయితే రాష్ట్ర వ్యవసాయాధికారులకు తెలియకుండానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించటంతో వ్యవసాయాధికారులు తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

ఏర్పడబోయే ఈ జాతీయ కమిటీలో విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలకైనా స్థానం కల్పింపబడుతుందా? అన్నది సందేహాస్పదమైన విషయంగా వుంది. వైద్య ఆరోగ్య శాఖ లేదా పర్యావరణ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో నిర్వహింపబడాల్సిన ఎన్.బి.ఆర్.ఎ.ను, బయోటెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రకంగా ప్రభుత్వం ఈ కమిటీ ఏర్పాటుపై దేశవ్యాపితంగా అభిప్రాయాలను సేకరించటం అన్న తతంగాన్ని మొక్కుబడిగా, ఏకపక్షంగా నిర్వహిస్తోంది. దీన్నిబట్టి చూస్తే ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు అనుగుణంగానే ఈ నియంత్రణ కమిటీలను, అథారిటీలను ఏర్పాటు చేస్తోందని అర్థమవుతోంది.

**కార్తిజెనా ప్రోటోకాల్‌ను సహితం ఉల్లంఘిస్తున్న భారత ప్రభుత్వం:**

ఈ రకంగా ప్రపంచంలోని యితర దేశాల్లో, ఆఖరికి అమెరికా దేశంలో కూడా జన్యుమార్పిడి పంటలూ, ఆహారాలను నియంత్రించే యంత్రాంగాన్ని, చట్టాలను మరింతగా పటిష్టపరిచే చర్యలు తీసుకొంటూంటే, మన దేశ పాలకులు మాత్రం జన్యుమార్పిడి పంటల నియంత్రణను చూసీ చూడనట్టు జరిపే ప్రక్రియగా మార్చి విత్తన కార్పోరేట్ సంస్థలకు మేలు చేస్తున్నారు.

మెక్సికో దేశమయితే కేవలం జన్యుమార్పిడి జొన్న పంటలపైననే కాక, జన్యుమార్పిడి జొన్న పంటల పరిశోధనపై కూడా నిషేధాన్ని విధించింది.

మనదేశం కార్తెజెనా ప్రోటోకాల్‌లో భాగస్వామి. ఈ ప్రోటోకాల్ ప్రకారం, కొత్త ప్రతిపాదనపై ప్రజలలో విస్తృతస్థాయి సంప్రదింపులు జరపాలి. జీవసాంకేతికత ఉత్పత్తులకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో వుంచాలి. జన్యుపరివర్తిత జీవులను హానికరమైనవి, హానికరంకానివి తప్పక విభజించాలి. వాటి ప్రభావాలను సమగ్రంగా అంచనా వేసిన తర్వాతనే వాటికి అనుమతి యివ్వాలి. జీవ సాంకేతిక నియంత్రణ వ్యవస్థలో జవాబుదారీతనం, సమస్యల పరిష్కార యంత్రాంగం తప్పనిసరి భాగంగా వుండాలి.

కానీ యీ ప్రోటోకాల్ నిబంధనలను సహితం ఉల్లంఘిస్తూ మన ప్రభుత్వం ఈ 'అధికార మార్పిడి'ని ఏర్పాటు చేస్తోంది. మరోవైపు తాను అంగీకరించిన ప్రోటోకాల్‌ను అక్షరాలా అమలుజరుపుతున్నట్లు అబద్ధపు సమాచారాన్ని బయోసేఫ్టీపై కార్తెజెనా ప్రోటోకాల్ సమావేశాల్లో సమర్పించి మోసం చేస్తోంది.

పలువురు శాస్త్రజ్ఞులూ, ఆహార నిపుణులూ ఈ జన్యుమార్పిడి పంటల వలన, ఆహార ధాన్యాల ఉత్పత్తి అధికంగా పెరుగుతుందనటానికి కూడా ఎక్కడా ఆధారాలు లేవని వాదిస్తున్నారు. అయినా ఆహార ధాన్యాల అధికోత్పత్తి కోసం జన్యుమార్పిడి ఆహార పంటను ప్రోత్సహిస్తానంటోంది భారత ప్రభుత్వం.

ప్రామాణికత గుర్తింపులేని పరిశోధనశాలల్లో, నైపుణ్యంలేని పరిశోధనశాలల్లో తగు సౌకర్యాలు లేని పరిశోధనాశాలల్లో జన్యుమార్పిడి ఆహార పంటల పరిశోధనలు జరిపించి ఆ నాణ్యతలేని పరిశోధనా ఫలితాల ఆధారంగా ఆ పంటలను దేశంలో పండించ టానికి అనుమతులివ్వబడుతున్నాయి.

అసలు జన్యుమార్పిడి పంటలకు అనుమతినిచ్చే ప్రక్రియ ఎలా సాగుతోంది? ఎందుకు యిలా జరుగుతోంది? అన్నదానికి జి.ఇ.ఎ.సి.లోకి సుప్రీంకోర్టు చేత ఆహ్వానింప బడిన సభ్యులు డాక్టరు పి.ఎం.భార్గవ తెలియచేస్తున్న వివరం యిలా వుంది:

"జరిగాయని చెప్పబడ్తున్న అనేక పరీక్షలు (జన్యుమార్పిడి వంకాయ యితర కూరగాయల విషయంలో అసలు జరిగే వుండకపోవచ్చు. ఎందుకంటే మోన్శాంటో- మహికో కంపెనీ తాను అనుమతి పొందాల్సిన ఉత్పత్తులకు పరీక్షలను తానే నిర్వహిస్తుంది. అనుమతి కోరుతున్న పక్షం అయినందున ఆ కంపెనీ అసలు జన్యుమార్పిడి చెందని మామూలు కూరగాయల్నే, జన్యుమార్పిడి కూరగాయలకు బదులుగా పరీక్షలకోసం పంపించి వుండవచ్చు. అదే ఈ పరీక్షలను ప్రభుత్వ అధీనంలో వున్న సంస్థలు కాకుండా, స్వతంత్రమైన వృత్తినైపుణ్యం గల సంస్థలు నిర్వహించి వుంటే ఫలితాలు మరో రకంగా వుండేవి".

"మన దేశం అవినీతిలో కూరుకుపోవటంవల్లనే ఈ రకంగా జరుగుతోందన్నది ఒక విషాదకర వాస్తవం. అమెరికా, వియత్నాం యుద్ధంలో వేల మందిని ఆకులు కాల్చినట్లు కాల్చిపారవేసిన 'ఏజంట్ ఆరంజి' అనే యుద్ధ రసాయనాన్ని సృష్టించింది ఈ మోన్శాంటో కంపెనీనే అన్న విషయాన్ని మనం మరువకూడదు. ఈ జన్యుమార్పిడి పంటల వలన మోన్శాంటో కంపెనీతో బాటు కొందరు మన దేశంలోని ప్రభుత్వాధికారులూ లాభపడవచ్చు. కానీ ఇది భారతదేశంలోని వంద కోట్లకు మించిన ప్రజలకు సంభవించబోయే వినాశకమైన విపత్తు" అంటూ ఆయన హెచ్చరించటాన్నిబట్టి చూస్తే భారతదేశ వ్యవసాయరంగానికీ, ప్రజానీకానికీ ఎంతటి ముప్పు సంభవిస్తోందో అర్థమవుతుంది.

ఈ జన్యుమార్పిడి ఆహార పంటల ద్వారా దేశంలో సృష్టించబడే సంక్షోభం 'అణుశక్తి' ద్వారా సంభవించే ముప్పుతో సమానమైందని జీన్ క్యాంపైన్ సంస్థకు చెందిన శాస్త్రజ్ఞురాలు సుమన్ సహాయ్ హెచ్చరిస్తున్నారు.

అయినా దేశ పాలకులూ, ప్రభుత్వం మాత్రం ఈ హెచ్చరికలను ఏమీ ఖాతరు చేయకుండా, ఏకపక్షంగా ఈ జన్యుమార్పిడి ఆహార పంటల ఉత్పత్తులను దేశీయ మార్కెట్లో ప్రవేశపెట్టడానికే నిశ్చయించుకొని ముందుకు సాగుతున్నారు.

తమ దేశ పర్యావరణానికీ, జీవావరణానికి, జలావరణానికీ, వ్యవసాయరంగానికి, ప్రజల ఆరోగ్యానికి సంభవించబోయే ఈ ముప్పును గురించి ప్రజానీకమే చైతన్యం పొంది, దీనికి వ్యతిరేకంగా సంఘటితమై, ఈ జన్యుమార్పిడి ఆహార పంటలనూ, ఆహారాన్నీ దేశంలో కొనసాగకుండా ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

-పాణిగ్రాహి ◈

---

**ఆగస్టు 20...** (1వ పేజీ తరువాయి)

దేశంలో హెచ్చుస్థాయిలో వ్యవసాయోత్పత్తి జరిగినా, రికార్డు స్థాయి ఆహారధాన్యాల సేకరణ జరిగినా, ఆహారవస్తువుల-నిత్యావసర వస్తువుల ధరలు ఘోరంగా పెరిగి పోతున్నాయి. మరోవైపు ద్రవ్యోల్బణం కూడా విపరీతంగా పెరిగిపోయి ప్రజల సంపాదనకు విలువ లేకుండా చేస్తోంది. వీటిని యుద్ధ ప్రాతిపదికపై అరికట్టి దేశ ప్రజలను ఆదుకోవాల్సిన పాలకులు, ప్రభుత్వం నిర్లక్ష్య, నిర్లిప్తత ధోరణిని ప్రదర్శిస్తూ, ఇదొక 'ప్రపంచ ధోరణి'. ఇది మామూలు విషయమేనంటూ నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తున్నారు.

మొత్తంగా చూసినపుడు మన దేశంలోని పాలకులూ, పాలకవర్గాలూ సామ్రాజ్యవాదం యొక్క దళారీవర్గంగా వున్నందువల్లనే యిటువంటి దుష్పరిణామ-ప్రభావాలకు దేశప్రజానీకం గురిచేయ బడుతున్నదని స్పష్టంగా అర్థమవుతోంది.

మాయోపాయంతో విశ్వాస పరీక్ష అనబడేదాన్ని నెగ్గిన పాలకులూ, పాలకవర్గాలూ కేవలం దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమయిన అణుఒప్పందాన్నే కాక, సామ్రాజ్యవాద దోపిడీ సంస్కరణల అమలును కూడా మరింత త్వరితంగా పూర్తి చేయటానికి ముందుకురుకుతున్నారు.

ఈ వినాశకర పరిణామాలను భారత కార్మికవర్గం అమోదించదు-ఆమోదించవీల్లేదు. సంక్షోభంలోకి నెట్టబడిన తనతోబాటు యితర శ్రామికజనావళిని రక్షించటంకోసం పూనుకోవాలి. ఈ కర్తవ్యాన్ని కేవలం కార్మికవర్గం మాత్రమే ప్రతిభా వంతంగా నిర్వహించగలుగుతుంది. అందువల్లనే ఈ కర్తవ్య నిర్వహణా భారం కార్మికవర్గంపై పడింది. అందుకుగాను కార్మికవర్గం తనకు తానుగా ఐక్యమై, దేశంలోని యితర శ్రామిక జనబాహుళ్యంతోనూ, ప్రత్యేకించి వ్యవసాయిక రైతాంగ వర్గంతోనూ విస్తృత ప్రాతిపదికపై ఐక్యతను నిర్మించాల్సి వుంది. వర్గ రాజకీయ అవగాహనతో ఐక్య ఉద్యమాన్ని నిర్వహించటం ద్వారా కార్మికవర్గం తనపై గల ఈ చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేయగలుగుతుంది.

ప్రస్తుతం దేశ ప్రజానీకాన్ని వేధించే అధిక ధరల సమస్యకు వ్యతిరేకంగా, దేశంలోని కార్మికవర్గాన్ని నికృష్టంగా దోచుకొనే పలు విధానాలకు వ్యతిరేకంగా, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించాలి.

అధిక ధరలను, యితర కార్మిక సమస్యలనూ వ్యతిరేకిస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశంలోని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం అంతా ఆగస్టు 20న సార్వత్రిక సమ్మె జరపాలని, దేశంలోని వివిధ కార్మిక సంఘాలూ, ఫెడరేషన్లు, అసోసియేషన్లతో కూడిన స్పాన్సరింగ్ కమిటీ, మే 13వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ట్రేడ్ యూనియన్ల జాతీయ సదస్సులో నిర్ణయించటం జరిగింది.

తిరిగి జులై 8న 800 మంది ప్రతినిధులతో జరిగిన ఈ జాతీయ సదస్సు సమావేశం ఆగస్టు 20వ తేదీన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఒక రోజు సమ్మె జరపాలన్న నిర్ణయాన్ని ఆమోదిస్తూ, సమ్మెకు ఘన విజయం చేకూర్చాలన్న దృఢ సంకల్పాన్ని ప్రకటించింది.

సత్వరమే ధరల పెరుగుదలను అదుపు చేయాలనీ, కార్మికచట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలనీ, కాంట్రాక్టీకరణ- ఔట్ సోర్సింగులను నిలుపుదల చేయాలనీ, అసంఘటితరంగ కార్మికు లందరికీ సామాజిక భద్రతా బిల్లు పరిధిని విస్తరింప చేయాలనీ, రైతులకు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల నుండి తీసుకొన్న రుణాలను కూడా రద్దు చేయాలనీ, రైతులకు తక్కువ వడ్డీరేటుపై జాతీయ బ్యాంకులు తేలిక రుణాలు అందచేయాలనీ, ప్రభుత్వ రిక్రూట్ మెంటుపై వున్న నిషేధాన్ని రద్దు చేయాలనీ, కాంట్రాక్టు కార్మికులతోసహా, అన్ని రకాల కార్మికులకూ నూతన వేతన ఒప్పందాలు జరుపాలనీ ఈ స్పాన్సరింగ్ కమిటీ డిమాండు చేస్తోంది.

ఆగస్టు 20న సమ్మె జరపటమేకాక, కుదిరిన చోట్ల బంద్‌లు కూడా జరపాలనీ, ఈ సార్వత్రిక సమ్మె విజయవంతం చేయటంకోసం ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలనీ కూడా ఈ స్పాన్సరింగ్ కమిటీ కోరుతోంది.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగించటానికి, కార్మికవర్గానికి యిది ఒక తక్షణ అవకాశం. ఈ అవకాశాన్ని భారత కార్మికవర్గం చైతన్యయుతంగా, నైపుణ్యంగా వినియోగించుకొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పోరాటాన్ని కొన సాగించేందుకు వీలుగా ఈ ఆగస్టు 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి! భవిష్యత్తు పోరాటాలకు ఈ ఆగస్టు 20 సమ్మెను ఒక సోపానంగా మలచుకోవాలి!!

**కార్మికులారా పోరాడండి!**
**మీకు పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప!!** ◈

---

# హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మాణంతో జీవనోపాధిని కోల్పోతున్న అస్సాం ప్రజలు

**సుభాంసిరి** నది యొక్క మైదాన ప్రాంతంలో 2000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును అస్సాం-అరుణాచలప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో నిర్మించుతున్నారు. ఇందుకోసం ఆ ప్రాంతంలోని అడవిని నరికి, కలపను తోలుకు పోతున్నారు.

ఈ కొండ ప్రాంతంలోని ప్రజలు వ్యవసాయంపై ఆధారపడక యితర మార్గాలైన కలప, చేపల వేట, కొండరాళ్ళు కొట్టడంలాంటి పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడి భూమి అంతా యిసుకమయం కావటంతో వ్యవసాయం ద్వారా జీవించటం వీరికి

(తరువాయి 11వ పేజీలో)

# సెజ్‌ల పేరుతో భూములు లాక్కొంటున్న ప్రభుత్వం-ఆత్మహత్యలు చేసుకొంటున్న రైతాంగం

ప్రత్యేక ఆర్థికమండళ్ళ కోసం రైతుల భూములను బలవంతంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటంతో, భూమిపై నమ్ముకొన్న రైతుకి ఉపాధి కరువై, కుటుంబాల దుర్భర పరిస్థితులను చూసి తట్టుకోలేక అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఈ పరిస్థితులు ఇకపై రాకుండా తమ భూములు తమకు యివ్వాలని రాష్ట్ర వ్యాపితంగా రైతులు ఆందోళన ప్రారంభించారు.

దేశంలోని ఇతర రాష్ట్రాలకన్నా ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఆర్థికమండళ్ళ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున రైతాంగం భూములకు దూరం అవుతున్నారు. కాకినాడ సెజ్‌పేరుతో 10వేల ఎకరాలు రైతుల నుండి బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారు. ఇవి రెండు పంటలు పండే సస్యశ్యామల భూములు. ఇది కాకుండా కాకినాడ రేవుకి 2,500 ఎకరాల భూమి యిచ్చారు. నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు కోస్తా కారిడార్ పేరుతో రైతులనుండి లక్షలాది ఎకరాల భూములు ప్రభుత్వం గుంజుకోబోతున్నది. ఈ కారిడార్‌లో పెట్రోకెమికల్స్, రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీలు, ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలైన్లు, విలాసవంతమైన వబ్‌లు నిర్మిస్తామని ప్రకటించారు. మొదటి దశ నిర్మాణంలో భాగంగా తూర్పు గోదావరి- విశాఖ జిల్లాల్లో రైతులనుండి లక్షాయాభైవేల ఎకరాల భూమి స్వాధీనానికి ముమ్మర ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. గుంటూరుజిల్లా నిజాంపట్నం-ఓడరేవుల మధ్య నిర్మించే పోర్టుకి, పారిశ్రామిక కారిడార్‌కి 13వేల ఎకరాల భూముల సేకరణకు ప్రభుత్వం పూనుకొంది. ఈ కారిడార్‌లో రోడ్లు, ఇతర సౌకర్యాలు నిర్మించేందుకు 16వేల కోట్ల రూపాయలతో అరబ్బు సంస్థ రస్ అల్‌ఖైమా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొంది. దీని వలన పోర్టుకు అనుబంధంగా భారీ పరిశ్రమలు వస్తాయిని చెప్పన్నా రస్ అల్‌ఖైమా అందుకు విరుద్ధంగా సొంతం చేసుకొన్న భూమిని ప్లాట్లగా విడగొట్టి మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు అమ్ముకోవటానికి రంగం సిద్ధం చేసుకొంటోంది. మ్యాట్రిక్స్ అనే సంస్థ ద్వారా ఈ వ్యాపారం కొనసాగించే ఏర్పాట్లు చేసుకుంటున్నది-అసలు పోర్టు పనులు మొదలుపెట్టలేదు. రస్ అల్‌ఖైమా సంస్థ మాత్రం భూములు సేకరించి ఇవ్వాలని ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నది. ఇందుకోసం ఒక్క ప్రకాశంజిల్లాలోనే 9వేల ఎకరాల భూముల స్వాధీనానికి, 13 గ్రామాలు ఖాళీ చేయించటానికి ప్రభుత్వం ముమ్మర చర్యలు ప్రారంభించింది. నిజాంపట్నం మండలం దిండి ఏరియాలో సిరీస్ కంపెనీకి పెద్ద ఎత్తున భూములు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశాఖజిల్లా నక్కపల్లి వద్ద ఓ ఫార్మా ఎస్.ఇ.జడ్‌కు, మహబూబ్‌నగర్‌లో మరో ఎస్.ఇ.జడ్‌కు అనుమతి మంజూరు చేసి పార్ధసారథిరెడ్డి పెట్రో గ్రూపుకి వీటిని కట్టబెట్టారు. శరత్ చంద్రారెడ్డికి చెందిన ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌కి మరో ఎస్.ఇ.జడ్‌ని మంజూరు చేశారు. వీటికి వేలాది ఎకరాల రైతుల భూములను కట్టబెడుతున్నారు. ఇవిగాక విజయనగరం-శ్రీకాకుళం జిల్లాల్లోని 4 వేలకు పైగా రైతుల భూములను దుబాయ్‌కి చెందిన అల్యూమినా తయారు కంపెనీకి కట్టబెట్టేందుకు బలవంతంగా లాక్కునే విధానం చేపట్టింది. అపెరల్ పార్కులు, టెక్స్‌టైల్ పార్కుల పేరుతో కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వేలాది ఎకరాలను రైతులనుండి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమౌతున్నది. విశాఖపట్నం వద్ద రాంకీ గ్రూపుకి, దానికి అనుబంధంగా ఉన్న ఎరిస్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థలకు మరో ప్రత్యేక ఆర్థికమండలి ఏర్పాటుకి అనుమతి మంజూరు చేశారు. రంగారెడ్డి, నెల్లూరుజిల్లాల్లో ఎస్.ఇ.జడ్‌ల మూలంగా రైతులు వేలాది ఎకరాల భూములను కోల్పోయారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 71 ఎస్.ఇ.జడ్‌లకు అనుమతి మంజూరు కాగా, ఇంకా అనేకం అనుమతి దిశగా పయనిస్తున్నాయి.

ఆంధ్రరాష్ట్రంలో అనేక జిల్లాల్లో భూములు కోల్పోయి, దాన్ని జీర్ణించుకోలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకొన్నారు. మహబూబ్‌నగర్‌జిల్లా జడ్చర్ల మండలంలో అరవింద కంపెనీకి వెయ్యి ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించింది. ఇవన్నీ రైతుల పంటభూములే. భూములు ఇవ్వటానికి రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసినా బలవంతంగా స్వాధీనం చేసుకొంది. ఈ మండలంలోని పోలేపల్లి, ముదిరెడ్డిపల్లె, గుండ్లగడ్డ గ్రామాల రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఒక్క పోలేపల్లి గ్రామంలోనే 40మంది రైతులు మనోవ్యాధితో ప్రాణాలు కోల్పోయారు. ఈ గ్రామానికే చెందిన చుక్కమ్మ భర్త నర్సయ్య. వీరి మూడున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. దాన్ని తట్టుకోలేక నర్సయ్య గుండెపోటుతో మరణించాడు. చుక్కమ్మకు నలుగురు పిల్లలు, వారిలో ఒకరు పదవ తరగతి, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. తండ్రి చనిపోయి భూమి పోవటంతో అరవిందో కంపెనీలో కూలీలుగా, చిన్న పిల్లవాడు హోటల్‌లో సర్వరుగాను పని చేస్తున్నారు. తన భూమి కోసం గ్రామ సర్పంచ్, ఆర్.డి.ఓ, కలెక్టరుతో సహా అందర్నీ నిలదీసి ధర్నా చేసి అరెస్టు అయి జైలుకి వెళ్ళింది. తన భూమి గుంజుకోవటంలో వీరందరూ దోషులేనని కంపెనీతో మిలాఖత్ అయ్యారని విరుచుకుపడ్డది.

నర్సయ్య తమ్ముడు రామయ్య, అతని భార్య అంజమ్మ వీరికున్న రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం కంపెనీకి యిచ్చింది. భూమిపోయిన మనోవ్యధతో 9-12-2006న రామయ్య చనిపోయాడు. పోయిన పొలం చూసివస్తానని చెప్పి పొలంలో కూర్చొని కుమిలి, కుమిలి ఏడ్చి కుప్పకూలిపోయాడు. ఉన్న కొడుకు-కోడలితో అంజమ్మ జీవచ్ఛవంలా బ్రతుకుతున్నది. భర్త ఫోటోను గుండెలకత్తుకొని ఏడుస్తూ ఉంటుంది. తప్పెట రాములు, మొగులమ్మలకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. ఒక ఆడపిల్ల, నలుగురు మగపిల్లలు. అందరూ చిన్నవారే. వీరి భూమి మొత్తం ప్రభుత్వం లాక్కొంది. దీంతో గుండెపోటు వచ్చి రాములు 13.5.2006న చనిపోయాడు. భూమిపోగా ఉన్న పశువులు మేపుకొని బ్రతుకుదామని ఆశపడ్డ మొగులమ్మకు నిరాశే మిగిలింది. వాటిని సాకటానికి ఆర్థిక సహాయం కోసం అధికారులందర్నీ ప్రాధేయపడింది. అయినా ఎటువంటి ఫలితం లేదు. ఉన్న కొద్ది భూమిలో పశువులకు జాగా ఏర్పాటు చేసుకొంది. ఈ భూమిపై కూడా కంపెనీ కన్నుపడింది. పశువుల పొలంలో నిప్పు పెట్టించింది. ఇరవై పశువులు చనిపోయాయి. గత్యంతరంలేక లక్ష ఖరీదు చేసే మిగిలిన పశువులను, 20 వేలకు అమ్ముకుంది. అవి అప్పులకే పోయాయి. పిల్లల్ని ఎలా సాకాలి, వారికి పెండ్లిండ్లు ఎలా చేయాలనే దిగులుతో కుమిలిపోతున్నది. ఖద్యా, జంగిలీ భార్యభర్తలు. వారికి ఐదు ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని ప్రభుత్వం తన్నుకుపోయింది. అది తట్టుకోలేక జంగిలీ చనిపోయింది. ఆమె మరణాన్ని తట్టుకోలేని ఖద్యా కూడా విషం మింగి చనిపోయాడు. పిల్లలు అనాథలై అలమటిస్తున్నారు.

పోలేపల్లి పంచాయితీలోని గుండ్ల గడ్డ తండాలో చనిపోయిన వారిని పూడ్చిపెట్టటానికి ఆరు అడుగుల స్థలం దొరక్క శవజాగారం చేయవలసివస్తున్నది. ఈ తండాకి చెందిన మొత్తం రెండువందల ఎకరాలు సెజ్ పేరుతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ తండాలోని 70 ఇండ్లలో దాదాపు మూడువందలమంది నివశిస్తున్నారు. గతంలో ఈ తండాల్లో ఒక వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని పూడ్చి పెట్టటానికి గ్రామంలో ఎక్కడా స్థలం దొరకలేదు. అందుకు కారణం భూములతో పాటు తండా కూడా సెజ్ క్రిందకిపోయింది. శవం దుర్గంధపూరితం కావస్తుండటంతో వేరేచోట తమకు తెలిసినవాని కాళ్ళా వేళ్ళాపడి కొంత స్థలాన్ని తీసుకొని పూడ్చిపెట్టుకొన్నారు. స్థలం ఇచ్చిన వ్యక్తి మరొకసారి-రావద్దని నిఖచ్చిగా చెప్పాడు. మరలా ఇదే పరిస్థితి ఏర్పడింది. రుకాలి అనే 70 సంవత్సరాల వృద్ధురాలు 13.5.08న చనిపోయింది. రుకాలికి ఉన్న 18 ఎకరాల భూమి సెజ్ క్రిందపోయింది. ఫలితంగా రుకాలిని పూడ్చిపెట్టటానికి స్థలంలేక ఇంట్లోనే శవం వద్ద ఆమె ముగ్గురు కొడుకులు ఏడుస్తూ కూర్చొన్నారు. భూములు స్వాధీనం చేసుకొన్న కంపెనీ ఎవర్నీ రానీయక కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నికల్లో ఓట్ల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఆ గ్రామానికి వచ్చి పరామర్శించాడు. సానుభూతి తెలిపాడు. తండాను పరిశీలించగా దాని చుట్టూ సెజ్ భూములే ఉన్నాయి. తన అవసరం రీత్యా తండాకి సమీపంలో కొంత స్థలం చూపించి శవాన్ని పూడ్చి పెట్టుకోమని చెప్పాడు. తండా వాసులకు ఆరు అడుగుల స్థలం కూడా లేకుండా చేసింది తమ పార్టీ ప్రభుత్వమేనన్న విషయం ఆయనకు తెలుసు. ఆయన, భూములు గుంజుకోవటాన్ని ఖండించలేదు. ఈ విధంగా సెజ్ ఏర్పాటు వలన ప్రజలు చనిపోయినవారిని పూడ్చిపెట్టుకోవటానికి కూడా భూమి లేనివారయ్యారు.

భూములను, భర్తలను కోల్పోయి బ్రతుకు తెరువు కానరాక పోలేపల్లి, ముదిరెడ్డిపల్లె, గుండ్లగడ్డ తండాల వాసులు భయానక పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. భూములను బలవంతంగా లాక్కున్న ప్రభుత్వం వారికి సహాయం అందించటంలో మొండిచెయ్యి చూపింది. కంపెనీలో పని కల్పిస్తామని చెప్పినా, అరకొరగా కొందరికే పని యిచ్చి వెట్టిచాకిరీ చేయించుకొంటూ, భయపెడుతూ తక్కువ కూలి యివ్వటమేకాక, స్త్రీలను రకరకాలుగా అవమానపరుస్తున్నారు. కంపెనీ పని అంటేనే స్త్రీలు భయపడిపోతున్నారు.

మా భూముల్లో మేము పనిచేసుకోకుండా కూలీలుగా బ్రతకమంటున్న ప్రభుత్వం ఎడల తండావాసులు గుడ్లెర్ర చేస్తున్నారు. మా భూములు మాకు ఇవ్వండని పిల్లా పాపలతో కంపెనీ ఆక్రమించుకొన్న భూమిలో మూడు నెలలు చెట్టు క్రింద వండుకొని ధర్నా చేశారు. కంపెనీ వాళ్ళు చెట్టును నరికి, కేసులుపెట్టి జైలుకి పంపారు. అయినా ప్రజలు భూమి కోసం ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. తమ భూములు గుంజుకోవటానికి నిరసనగా ఈ గ్రామాలకు చెందిన సెజ్ వ్యతిరేక కమిటీ 40 మంది అభ్యర్థులను ఉపఎన్నికల్లో నిలబెట్టింది.

కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలికి 10వేల ఎకరాల భూములు స్వాధీనానికి మూడు సంవత్సరముల క్రితమే శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం సేకరించే భూముల్లో 80 శాతం రైతుల పంటభూములే. భూములు పోతే బ్రతుకులేదని గ్రహించిన రైతులు భూములు ఇవ్వమని ఆందోళన ప్రారంభించారు. ప్రభుత్వం ఎరచూపుతున్న పరిహారం, ఉద్యోగకల్పనల బూటకత్వాన్ని అర్థం చేసుకొని ప్రత్యేక ఆర్థికమండలికి వ్యతిరేకంగా ఊరేగింపులు, ధర్నాలు, ఘెరావ్‌లు చేశారు. విశాఖపట్నం దగ్గరలోని గంగవరం పోర్టు కోసం అనేక మత్స్యకార గ్రామాలను ఖాళీ చేయించేందుకు చేసిన ప్రయత్నాలను ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. అధికారులను, మంత్రులను ఘెరావ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధనం చేశారు. ప్రజల గోడు పట్టించుకోని ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసులను దింపి గ్రామాలను ఖాళీ చేయించటాన్ని ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

విశాఖజిల్లా ఏజన్సీ ప్రాంతంలోని బాక్సైట్ ఖనిజ నిల్వలను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు జిందాల్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. విజయనగరంజిల్లా శృంగవరపు కోట పరిధిలో బాక్సైట్‌నుండి అల్యూమినా తయారికి జిందాల్ సౌత్‌వెస్ట్ ఫ్యాక్టరీకి, ఆ ఫ్యాక్టరికి అవసరమయ్యే 90మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల కో.జనరేషన్ విద్యుత్ కర్మాగారానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసి అందుకు కావాల్సిన నాలుగువేల ఐదువందల ఎకరాల భూమిని రైతులవద్ద బలవంతంగా తీసుకొనేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రభుత్వ విధానాలను రైతాంగం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. విజయనగరంజిల్లా రాచపల్లి, రామన్నపాలెం ఏరియా రైతులు, విశాఖజిల్లా నూకపల్లి మండలంలోని భీమబోయినపల్లి తదితర గ్రామాల రైతులు ఆందోళన ప్రారంభించారు. బంద్‌లు, రెవిన్యూ ఆఫీసుల ముట్టడితో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులను అరెస్టు చేశారు. అరెస్టులకు వెరవక ప్రాణాలు అయినా ఇస్తాం కాని భూములు ఇవ్వమని నినాదాలు చేశారు. భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకొనేది లేదని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆర్థికమండలి ఏర్పాటు ద్వారా విశాఖజిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నట్లు పాలకులు ప్రకటిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇది ప్రారంభమయింది. ఈ ఎస్.ఇ.జడ్‌కి కావాల్సిన 9వేల200 ఎకరాలను రైతులనుండి సేకరించే ప్రయత్నాలు గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించి భూమి నష్టపరిహారం తేల్చే సమయంలో ప్రభుత్వం మారిపోయింది. ఆనాడు నష్టపరిహారం చాలదని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వల్పంగా పరిహారం పెంచి బలవంతంగా 24 గ్రామాల రైతులనుండి భూములు సేకరించింది. దీనివలన అచ్యుతాపురం, రంబిల్లి మండలాల్లోని 3వేల రైతు కుటుంబాలు సెజ్‌కి బలై వీధినపడ్డారు. కుటుంబాలు గడవక యువకులు ఆటోలు నడుపుతూ, కూలీ చేసుకొంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

అపెరల్ పార్కులు, ఉడా కాంప్లెక్సులు, టెక్స్‌టైల్ పార్కుల పేరుతో కృష్ణాజిల్లా నందిగామ ఏరియాలోను, గుంటూరుజిల్లా మంగళగిరి, తాడికొండ మండలాల్లో రైతుల భూములను తీసుకొనే ప్రయత్నాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులు దళాలుగా ఏర్పడి పాదయాత్రలు, పికిటింగ్‌లు, ధర్నాలతో మిలిటెంట్ ఆందోళన సాగించారు. రైతుల వ్యతిరేకతను గమనించిన ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. ఇదే విధంగా ఇంకా అనేక జిల్లాల్లో ఎస్.ఇ.జడ్‌లకు వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమిస్తున్నారు.

ప్రత్యేక ఆర్థికమండళ్ళ ఏర్పాటు విధానాలను పరిశీలించినప్పుడు, వాటి వలన దేశ ప్రయోజనాలకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి జరగదు. దేశీయ పరిశ్రమలు మూతపడతాయి. సెజ్‌ల ఏర్పాటు వలన కల్పించబడే ఉద్యోగాలు, పరిశ్రమలు మూతపడి వీధినపడే కార్మికులు, భూమి కోల్పోయి ఉపాధి కోల్పోయే రైతుల సంఖ్యలో నామమాత్రంగానే ఉంటాయి వేలాది ఎకరాల రైతుల భూములు బడా పరిశ్రమదారుల, బహుళజాతి సంస్థల పరమౌతాయి. ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి దేశంలో ఆహారసమస్య మరింత తీవ్రమౌతుంది ఉపాధి కోల్పోయిన రైతులు సంక్షోభం నుండి బయటపడలేక వారి ఆత్మహత్యలు ఎక్కువ అవుతాయి కోట్లాది రూపాయలు విదేశాలకు తరలిపోతాయి. సామ్రాజ్య వాదుల ఆధిపత్యం దేశంలో ఎక్కువ అవుతుంది

ఇంత ప్రమాదభరితమైన ఈ ప్రత్యేక ఆర్థికమండళ్ళకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు, విద్యార్థి-యువజనులు ఐక్యంగా పోరాటం ఎక్కుపెట్టాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని సాగించాలి

- జ్వాలయ్య

# అంతర్జాతీయ ద్రవ్యనిధి రుణాలతోపాటు పెరుగుతున్న క్షయవ్యాధి

**ప్రెస్ ట్రస్టు ఆఫ్ ఇండియా, న్యూయార్క్ 22, జులై.**

తూర్పు యూరపు దేశాలలోనూ, గత సోవియటు యూనియన్‌లోనూ క్షయవ్యాధి పెరుగుదల అంతర్జాతీయ ద్రవ్యనిధియిస్తున్న రుణాలతో దగ్గర సంబంధం కలిగి వుందని ఒక అధ్యయనం కనుగొంది.

రుణగ్రహీతగా అర్హత పొందాలంటే ఆరోగ్య రంగంలో వ్యయాన్ని ప్రభుత్వాలు తగ్గించటానికి ఐ.ఎం.ఎఫ్. ద్రవ్యనిధి షరతులు దారితీస్తున్నాయని దాని విమర్శకులు అంటున్నారు. రుణాలకూ, క్షయకు సంబంధాన్ని ఇది తెలుపుతున్నదని అధ్యయన నివేదిక రాసినవారు అంటున్నారు.

ఐతే ఐ.ఎం.ఎఫ్. దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ రుణాలే లేకపోతే మాజీ కమ్యూనిస్టు దేశాల పరిస్థితి మరింత ఘోరంగా ఉండేదని అన్నది. "క్షయ వ్యాధి రావటానికి చాలా కాలం పడుతుంది. కనుక ఐ.ఎం.ఎఫ్. రుణాలకు ముందు జరిగిన సంఘటనలతో ఇప్పుడు పెరిగిన క్షయ మరణాలకు సంబంధం వుండి వుంటుంది. ఈ అధ్యయనం ఒక బూటకం" అని ఐ.ఎం.ఎఫ్ ప్రతినిధి విలియం ముర్రే అన్నాడు.

ఈ అధ్యయనం జరిపిన పరిశోధకులు 21 దేశాల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రతి ఏడాదీ కొత్తగా క్షయ వ్యాధి వచ్చిన కేసుల్లో 13.9 శాతమూ, క్షయ వ్యాధితో బాధింపబడుతున్న వారి సంఖ్య పెరుగుదలలో 13.3. శాతమూ, క్షయ వల్ల మరణాల పెరుగుదలలో 16.6 శాతమూ ఐ.ఎం.ఎఫ్. రుణాలతో సంబంధం కలిగి వున్నాయని అధ్యయనం నిర్ధారించిందని 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక పేర్కొంది.

'పిఎల్‌ఓఎస్ మెడిసిన్' అన్న పత్రికలో ఈ రోజు ప్రచురింపబడబోతున్న ఈ అధ్యయనం ఎయిడ్స్, ద్రవ్యోల్బణం, నగరీకరణ, నిరుద్యోగం, రోగి వయస్సు వంటి అనేక అంశాలను తమ గణాంకాల పరిశీలనలోకి తీసుకున్నారు.

కేంబ్రిడ్జి యూనివర్శిటీకి చెందిన పరిశోధకుడు డేవిడ్ స్టక్లర్ ఈ అధ్యయన బృందానికి నాయకుడు. మరణాలు ఎక్కువైనందువల్ల రుణాలు ఎక్కువగా తీసుకోవాల్సి వచ్చిందా అన్న అంశాన్ని కూడా పరిశీలించామని అంటూ ఐ.ఎం.ఎఫ్.పై తమ అధ్యయనపు విమర్శలను సమర్థించుకున్నారు. రుణాల పెరుగుదలననుసరించే క్షయవ్యాధి మరణాలు పెరిగాయనీ, ప్రతి 1 శాతం రుణ పెరుగుదలకూ 0.9 శాతం మరణాలు పెరిగాయన్నారు. అంతేకాక. ఐ.ఎం.ఎఫ్. రుణకార్యక్రమం నుండి బయటకు వచ్చిన దేశాలలో క్షయవ్యాధి మరణాల రేటు సరాసరి 31 శాతం చొప్పున తగ్గిందన్నారు.

"ఒక్క అంశంలోనే ఇది కనిపిస్తే ఎవరి భృకుటి ఐనా ముడిపడవచ్చును కానీ 20 అంశాలు ఒకే దిశగా వేలు చూపిస్తున్నప్పుడు, జరగబోయే ప్రమాదాన్ని ఎవరైనా గ్రహించి హెచ్చరించాలి" అని ఆయన అన్నారు.

- బిజినెస్ స్టాండర్డ్, 23.7.2008.

# సాగర్-డెల్టాల ఆధునీకరణా? సాగునీటి ప్రైవేటీకరణా?

కాదేదీ కవితకు అనర్హమని శ్రీశ్రీ అన్నట్లు, ప్రపంచబ్యాంక్ జోక్యానికి, పెత్తనానికీ ఏదీ అనర్హం కాదు. ఇది మన దేశానికి, రాష్ట్రానికి బాగా వర్తిస్తుంది.

మన రైతు ప్రయోజనాలను కాలరాస్తూ, సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా మన పాలకులు వ్యవసాయ విధానాలు అమలుపరుస్తున్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, నీటి ప్రాజెక్టులు, చెరువుల మరమ్మత్తులు అందుకు అనుగుణంగానే నిర్మాణం చేపట్టారు. ప్రపంచబ్యాంక్ సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు, కృష్ణా డెల్టాల ఆధునీకరణలు అందులో భాగమే.

నాగార్జున సాగర్ నుండి ఏడు జిల్లాలకు , సుమారు 33 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి వుంది. సాగర్ కుడికాల్వ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలలో 11 లక్షల ఎకరాలకు, నల్గొండ, ఖమ్మం, కృష్ణాజిల్లాలకు ఎడమ కాల్వ ద్వారా పది లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు బ్రాంచి, డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్మించారు. సాగునీటి కోసం మేజర్, మైనర్ కాల్వలను నిర్మించిన పాలకులు అవి పూడికలు వేయకుండా మరమ్మత్తులు చేపట్టే పనిని గాలికి వదిలి వేశారు. రైతుల ఆందోళన ఫలితంగా అడపా, దడపా నామమాత్రపు నిధులు కేటాయింపు కూడా సక్రమంగా అమలు జరగలేదు. ఎక్కువ భాగం రాజకీయ నాయకుల, అధికారుల జేబుల్లోకి వెళ్లాయి. ఫలితంగా ప్రధాన కాల్వలతోపాటు, బ్రాంచి కాల్వలు తూటికాడ, జమ్మి, గుర్రపు డెక్కలతో మేటలు వేసి నీరు పారక సేద్యం సమస్యగా మారింది. పల్నాడు ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేక భారీ వర్షాలకు పైరు ముంపుకి గురై రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతూ వస్తున్నది ఈ విధంగా సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

## కృష్ణా డెల్టా పరిస్థితి:

దాదాపు 150 సంవత్సరాల క్రితం ఏర్పడిన కృష్ణా డెల్టా కాల్వల వ్యవస్థ గురించి పాలకులు పట్టించుకొన్న పరిస్థితి లేదు. 1952 కృష్ణానదిపై మొదటి ఆనకట్ట నిర్మించి, కుడి, ఎడమ కాల్వలు నిర్మించారు. కృష్ణా ఈస్టర్న్ మెయిన్ కెనాల్ (ఎడమ) ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలో 33 వేల హెక్టార్లకు, కృష్ణాజిల్లాలో 3 లక్షల 81 వేల హెక్టార్లకు, కృష్ణా వెస్టర్న్ (ఎడమ) మెయిన్ కెనాల్ ద్వారా గుంటూరుజిల్లాలో 2 లక్షల 32 వేల హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కల్పించబడింది. ఈ కాల్వల నుండి పొలాలకు నీరు అందించే బ్రాంచి కాల్వలు నిర్మాణం చేశారు కొంత మేర డ్రెయినేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు 1953లో సంభవించిన వరదల వలన ఆనకట్ట బీటలువారి సాగునీటికి ముప్పు వాటిల్లింది. రైతాంగ ఆందోళన ఫలితంగా బీటలువారిన ఆనకట్ట పైభాగంపై బ్యారేజి నిర్మించారు. అదే నేటి ప్రకాశం బ్యారేజి. తిరిగి 1964లో వచ్చిన తుఫాన్, వరదల వలన కృష్ణా డెల్టా వ్యవస్థ శిధిలమైపోయింది. దీన్ని పరిశీలించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం మిత్రా కమిటీని నియమించింది. ఆ కమిటీ సూచనల మేరకు కృష్ణాడెల్టాను ఆధునీకరించాలని నిర్ణయించారు. 1966-67 సంవత్సరాల్లో ప్రపంచబ్యాంక్ నిధులతో సి.ఇ.ఆర్.పి. ద్వారా దాదాపు వెయ్యి కోట్లతో మరమ్మత్తులు చేపట్టారు. అందులో భాగంగా దివిసీమలోని 24 వేల హెక్టార్ల భూమికి సాగునీరు సమకూర్చారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. 1977 దివిసీమ ఉప్పెన సందర్భంగా సాగు, మురుగునీటి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. చేపట్టిన మరమ్మత్తులు సక్రమంగా అమలుజరగలేదు. రేపల్లె ఏరియాలో లోపభూయిష్టమైన డ్రెయినేజి వ్యవస్థ వలన ప్రతి సంవత్సరం ముంపు ప్రమాదం రైతులను వెంటాడుతూనే వుంది. కృష్ణాజిల్లాలోని 16 డ్రెయిన్‌ల నుండి మురుగునీరు కొల్లేరు సరస్సుకి చేరి అక్కడి నుండి సముద్రంలో కలుస్తుంది. ఈ సరస్సుకి సంబంధించిన వేలాది ఎకరాలు ఆక్రమణలకు గురి కావటంతో ప్రతి సంవత్సరం రెండున్నర లక్షల ఎకరాలకు ముంపు ప్రమాదం వెన్నంటే ఉంది. 2006లో వచ్చిన భారీ వర్షాలు, వరదల వలన కృష్ణా-పశ్చిమగోదావరి జిల్లాల్లో అపారనష్టం జరిగింది. ఇంత నష్టానికి అధ్వాన్నమైన డ్రెయినేజి వ్యవస్థే కారణం. ఈ వరదలు దాన్ని మరోసారి బహిర్గత పర్చాయి.

2006లో వచ్చిన వరదలతో పంట కాల్వలు, మురుగుకాల్వల మరమ్మత్తులు, ఏటి కట్టలు పటిష్టపర్చాలనే ఆందోళన ముందుకు వచ్చి ఊపు అందుకొంది. ఈ వాస్తవాన్ని మభ్యపెట్టలేని స్థితిలో సాగర్ ఆయకట్టును 4444, కృష్ణాడెల్టాని 4573 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

సాగర్ ప్రాజెక్టు, కృష్ణాడెల్టా ఆధునీకరణ గురించి గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వం, ఈ పనులు చేపట్టటానికి ప్రపంచబ్యాంక్ దగ్గర అప్పు యాచించక తప్పలేదు. ఆధునీకరణకు అయ్యే ఖర్చులో సగం ప్రపంచ బ్యాంక్ అప్పుగా ఇస్తున్నది. అందుకు కొన్ని షరతులు పెట్టగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ప్రపంచబ్యాంక్ షరతుల ప్రకారం రాష్ట్రంలో నూతన జలవిధానం అమలుజరుగుతుంది. దీని ప్రకారం ప్రస్తుత సాగునీటి వ్యవస్థను, ప్రాజెక్టుల ప్రత్యేక విభాగంగాను, కాల్వల మరమ్మత్తులు, నిర్వహణ, నీటి నియంత్రణ, యాజమాన్యంగా విడగొడతారు. ఈ రెండు ఒకదానితో ఒకటి సంబంధం లేనివిగా ఉంటాయి. నీటినిర్వహణా బాధ్యతను, సాగునీటి సంఘాలను ఏర్పాటుచేసి వాటికి అప్పగిస్తారు. ఇందుకు ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించరాదు. సాగునీటి సంఘాలు నీటితీరువా వసూలు ద్వారా నిధులు సమకూర్చుకోవాలి. అంటే ప్రభుత్వం నీరు అందించే బాధ్యత నుండి తప్పుకొంటుంది. దీని పర్యవసానం రైతులు సాగునీటిని కొనుక్కోవాల్సి వస్తుంది. నీటి నిర్వహణకోసం సాగునీటి సంఘాలు మీటర్లు బిగించి రైతులకు సాగునీరు అందిస్తాయి. నీటి వాడకాన్నిబట్టి నీటితీరువా నిర్ణయిస్తారు. ఇది పేద, మధ్యతరగతి రైతులకు పెద్ద భారంగా మారుతుంది. ఆచరణలో భూస్వాములకు, సంపన్నవర్గాలకే సాగునీరు అన్న చందంగా మారుతుంది.

పేద, మధ్య తరగతి రైతులు ఈ భారాన్ని మోయ లేని స్థితి కల్పించి వీరిని నీటి పొదుపుగా వాడేవంటూ బిందు, తుంపర సేద్యంవైపు మళ్లించటానికి ఆకర్షణీయమైన వాగ్దానాలతో పాలకులు ముందుకు వస్తున్నారు. ఈ సాగుకి కావాల్సిన పరికరాలకు అత్యధిక శాతం సబ్సిడీ ప్రకటిస్తున్నారు. పంటలకు మంచి ధరలు, పంటరుణాలు అందచేస్తామని ప్రచారం చేస్తున్నారు. ఇది కూడా వంచనతో కూడుకొన్నదే. బిందుసేద్యంవైపు రైతులను మళ్లించటానికి ప్రారంభంలో ఇలాంటి ప్రోత్సాహకాలు యిచ్చి రైతులు దీనివైపు మళ్లిన తర్వాత వాటికి తిలోదకాలు ఇస్తున్నారు. కుప్పం కాంట్రాక్టు వ్యవసాయం ఇందుకు నిదర్శనం.

"ఆధునిక" పద్ధతుల్లో సేద్యం చేయటమంటే ఎగుమతులకు అనుగుణమైన వాణిజ్య పంటలు పండించటమే. ఈ పంటలు దేశంలో ప్రజల అవసరాలను తీర్చేవిగా ఉండవు. సంపన్న దేశాల సంపన్నులకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు మన రైతులు పండ్లు, కూరగాయలులాంటి పంటలు పండించి ఆ దేశాలకు ఎగుమతి చేయలి బయోడీజిల్ తయారీకి పనికొచ్చే పంటలు వేసి, బయో డీజిల్‌ను అమెరికాకు ఎగుమతి చేయాలి. అందుకొరకే రైతుసేద్యం చేయాలి. మొదట రైతుకు ధర అనుకూలంగా ఉన్నా, పంటలు విస్తారంగా వేసిన తర్వాత ఎగుమతిదారులు, వారు నిర్ణయించిన ధరలకే అమ్మాలని, లేని యెడల కొనుగోలు చేయమని రైతును బెదిరించి, పెద్దఎత్తున రైతుని దోపిడీ చేయడంతో, రైతుకు గిట్టుబాటుకాక సంక్షోభంలోకి నెట్టబడుతున్నారు. కుప్పం రైతులు ఈ విధమైన సంక్షోభాన్నే ఎదుర్కొన్నారు. చివరికి సేద్యం చేయలేన్ని పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రపంచబ్యాంక్ విధించిన సాగునీటి సంస్కరణల ఎడల మన రైతాంగం ఇన్ని దారుణమైన పరిస్థితులను చవి చూడవలసి వస్తుంది. రైతులు ఎదుర్కొనే దుర్భర పరిస్థితులే కాకుండా ఆహార సమస్య కూడా తీవ్రరూపం దాలుస్తుంది. ఎగుమతి పంటల వలన ఆహార పంటల సాగుబడి ప్రతి సంవత్సరం తగ్గి ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఫలితంగా వీటిని దిగుమతులు చేసుకొంటున్నాము వ్యవసాయ, సాగునీటి సంస్కరణలు అమలుజరపమని ప్రపంచబ్యాంక్ పాలకులకు చెప్పటమంటే పరోక్షంగా ఆహారపంటలు మానుకొని సామ్రాజ్యవాద దేశాలు, ముఖ్యంగా అమెరికా నుండి దిగుమతి చేసుకోమని చెప్పటమే. అంటే ఆహార పదార్థాలకోసం అమెరికా తదితర దేశాలపై ఆధారపడమని చెప్పటమే. ఇలా ఆధారపడ్డ హైతీ తదితర వెనుకబడిన దేశాల ప్రజలు ఆహారం దొరక్క పడే బాధలు, వీధి పోరాటాలు మన కళ్ళముందు ప్రత్యక్షమౌతున్నాయి.

ప్రపంచబ్యాంక్ షరతులు ఆమోదించటమంటే సామ్రాజ్యవాద దోపిడీని పెంచటమే. అందుకు అనుగుణంగా దేశ దోపిడీ పాలకులు మన వ్యవసాయ రంగాన్ని అమెరికా తదితర సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలు అమలు జరుపుతున్నారు. రైతులకు నామమాత్రంగా ఇస్తున్న సబ్సిడీలను కూడా తగ్గించివేయటం, విదేశీ విత్తనాలపై ఆధారపడటం, నీటిని ప్రైవేటీకరించటం, పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించి కొనుగోలు చేయకపోవటం, ఆహార దిగుమతులపై దిగుమతి సుంకాన్ని నామమాత్రంగా విధించటం, ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటం, బహుళజాతి సంస్థలకు ద్వారాలు తెరవటం మొదలైనవన్నీ అందుకు అనుగుణంగా జరిగినవే.

ఇప్పుడు చేపట్టబోతున్న సాగర్, కృష్ణా డెల్టా ఆధునీకరణ కూడా అందులో భాగమే. కాల్వల పూడికలు తీయటం, కట్టలను పటిష్టపరచటం, కాంక్రీట్ లైనింగ్ చేయటం, నదుల కరకట్టలను పటిష్టపరచటం మొదలైన పనులు ఆధునీకరణ క్రింద చేపడతారు. ఈ పనులు చేపట్టి, కాల్వలకు నీటి మీటర్లు బిగించి నీటి సంఘాల ద్వారా రైతులకు నీరు అందించి నీటి ఛార్జీలు వసూలు చేస్తారు ఈ విధానం వలన రైతు సాగునీటిని దుర్వినియోగపర్చకుండా పొదుపుగా వాడతారని ప్రపంచబ్యాంక్ పాలకులకు ఉపదేశించటం, అందుకు పాలకులు ఆమోదం తెలపటం రైతాంగాన్ని అవమానపర్చి పీడించటమే. మన రైతుకు సేద్యం చేయటం చేతగాని వారిగా జమ కట్టటమే. అస వాస్తవం కాల్వలకు కాంక్రీట్, నీటిమీటర్లు బిగించటం వలన అదనంగా సాగునీరు అమ్మి రైతుల నుండి పెద్దమొత్తంలో డబ్బు పోగు చేసుకోవటం కోసమే.

ఖరీఫ్ సీజన్‌కి మూడు నెలల ముందుగా కాల్వల ఆధునీకరణ పనులు, అందుకు 8 వందల కోట్ల రూపాయల టెండర్లకు సంబంధించి వివరాలను సాగర్ ప్రాజెక్టు అధికారులు మార్చి 15న ప్రపంచబ్యాంక్‌కి పంపింది. ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ఇంత వరకు ప్రపంచబ్యాంక్ నుండి అనుమతి లభించలేదు. నూతన జలవిధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు నమ్మకం కుదిరేవరకూ పనులు ప్రారంభించడానికి అనుమతినిచ్చేది లేదని ప్రపంచబ్యాంక్ తెలిపింది. దాని అనుమతి లేకుండా ఏ పని సాధ్యం కాదు. కాబట్టి ఈ సంవత్సరం పనులు ప్రారంభించటం సాధ్యంకాదు. దీన్ని గమనిస్తే ప్రపంచబ్యాంక్ పెత్తనం ఏ విధంగా కొనసాగుతున్నదో అర్థమౌతుంది. పాలకుల దాసోహం బహిర్గతమౌతున్నది.

మనం స్వతంత్రంగా కాల్వలను మరమ్మత్తులు చేసుకోలేని దుస్థితిలో ఉన్నామా? సరైన ప్రోత్సాహాన్ని రైతులకు పాలకులు ఇస్తే రైతులే గ్రామాలవారీగా కాల్వల మరమ్మత్తులు చేపట్టేవారు. గతంలో రైతాంగం అదే పని చేసింది. ఇందిరమ్మ పథకం, గ్రామీణ ఉపాధి పథకం క్రింద రాష్ట్రానికి వచ్చే నిధులలో 70 శాతం వరకు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి ఖర్చు చేయాలి. అలా ఉపయోగించకుండా నిధులను దారిమళ్లిస్తున్నారు. పాలకులకు కాల్వలను పటిష్టపరచాలనే చిత్తశుద్ధి ఉండి ఉంటే ఆ నిధులను వీటికోసం ఉపయోగించి మరమ్మత్తులు చేపట్టేవారు. అప్పుడు ప్రపంచబ్యాంక్‌ను యాచించవలసిన అవసరమే ఉండేది కాదు. పాలకులకు అది లోపించినందువలనే ప్రపంచబ్యాంక్ పెత్తనం చలాయిస్తున్నది. సాగర్-కృష్ణా డెల్టాల ఆధునీకరణ పనుల్లో ప్రపంచబ్యాంక్ పెత్తనం ఉండరాదని, రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా పనులు చేపట్టాలని, సాగునీరు అందించాలని రైతాంగం సమైక్య ఉద్యమం చేపట్టాలి.

- జాలయ్య

# 'రైతాంగం పాలిట ఉరిత్రాడుగా మారిన సెజ్‌లు'

## కా॥ టి.ఎన్. వర్ధంతి సభలో ప్రొ॥ కె.ఆర్.చౌదరి విమర్శనాస్త్రాలు

**విజయవాడ, 28.7.'08:** మార్క్సిస్టు మేధావి, విప్లవయోధుడు, అమరజీవి కా॥ తరిమెల నాగిరెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన సభలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొ॥ కె ఆర్ చౌదరి ప్రధాన ఉపన్యాసంచేస్తూ, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడ్తున్న సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండళ్ళు) విధానం రైతాంగం పాలిట ఉరిత్రాడుగా తయారైందని తీవ్రంగా విమర్శించారు కా॥ నాగిరెడ్డి 1972లో చెప్పిన దానికంటే నేడు వ్యవసాయ రంగం పీకల లోతు సంక్షోభంలో కూరుకుపోయిందని. దీనికి ప్రభుత్వాలు చేపడ్తున్న కార్పోరేట్, కాంట్రాక్టు వ్యవసాయ విధానాలు స్పష్టమైన ఉదాహరణలని చెప్పారు. ఒకవైపున అమెరికన్ సామ్రాజ్యవాదులు తన ఆధిపత్య విధానాలలో భాగంగా భారతదేశాన్ని అణు ఒప్పందంతో మరింత పరాధీన దేశంగా మార్చటంతో పాటు మన దేశ వ్యవసాయరంగాన్ని దివాళా తీయించటానికి డబ్ల్యు.టి.ఓ. ద్వారా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నదనీ, నేడు వై.యస్. ప్రభుత్వం ఇప్పటికి 71 సెజ్‌ల క్రింద లక్షలాది ఎకరాల భూములను బడా పారిశ్రామిక సంస్థలతోపాటు బహుళజాతి సంస్థలకు కారుచౌకగా అప్పజెప్తున్న ఫలితంగా, బలవంతంగా రైతాంగాన్ని భూముల నుండి గెంటివేయడం వలన సెజ్‌లు రైతాంగం పాలిట ఉరిత్రాడుగా మారాయని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు వదిలారు. 1894 నాటి భూసేకరణ చట్టాన్ని ప్రయోగించి ఆనాటి శ్రీశైలం ప్రాజెక్టు మొదలుకొని నేడు సెజ్‌ల క్రింద నిర్వాసితులౌతున్న రైతాంగం, గిరిజన ప్రజానీకపు జీవితాలతో చెలగాట మాడుతున్నారనీ, నష్టపరిహారం ఇవ్వటంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించటం లేదని, బహుళజాతి కంపెనీలు పెద్దఎత్తున లాభపడ్తున్నాయనీ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పారిశ్రామిక అభివృద్ధి పేరుతో కోస్టల్ పారిశ్రామిక కారిడార్ వలన కోస్తా ప్రాంతంలోని 80 లక్షల మత్స్యకారులు, 40 లక్షల దళితులు, ఒక కోటి పది లక్షల రైతుల జనజీవితాలు ఎందుకూ పనికి రాకుండా పోతాయనీ, ఈ కారిడార్‌పై పోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ, మన బాక్సైట్ గనులను బహుళజాతి కంపెనీలు దోచుకుపోవడానికి వ్యతిరేకంగా గతంలో రంపపితూరీ, సంతాల్ తిరుగుబాటు, కొమరంభీము, బిర్సాముండా సాగించిన పోరాటాలను ఆదర్శంగా తీసుకొని విడివిడిగా ఉన్న ఉద్యమశక్తులు ఒకే వేదికమీదకు వచ్చి ఐక్యంగా పోరాటం సాగించినప్పుడు మాత్రమే పాలకవర్గ నిరంకుశ విధానాలపై పోరాటం చేయగలమనీ, ఇప్పటికే మనం ఒక జీవిత కాలం లేట్ అయ్యామనీ, ఎదురుచూస్తున్న ప్రజల్ని ఐక్యంగా నడిపించాలనీ, కా॥ నాగిరెడ్డి చూపిన బాట సరైనదనీ, ఆ బాటలో పయనించాలని కోరుతూ ప్రొ॥ కె.ఆర్.చౌదరి తన ఉపన్యాసాన్ని సభికుల కరతాళ ధ్వనుల మధ్య ముగించారు.

తర్వాత సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కోటయ్య ప్రసంగిస్తూ కా॥ నాగిరెడ్డి తన కోర్టు స్టేట్‌మెంట్ 'తాకట్టులో భారతదేశం'లో చెప్పినట్లుగా తెల్లదొరల నుండి అధికార మార్పిడి ఏ విధంగా జరిగిందో అది ఈనాటి పరిణామాలు ఏవిధంగా రుజువు చేస్తున్నాయో సోదాహరణంగా వివరించారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటంలో భాగంగా స్వంత ఇల్లు అనే ప్రజాస్వామిక ఆకాంక్షకు అనుగుణంగా ఉద్యమాలను ఉధృతం చేయాలనీ, గతంలో విజయవాడ నగరంలో ఇళ్ళస్థలాల కోసం సాగించిన పోరాటాలను వివరించారు. నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్న ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణ కొనసాగించాల్సిన అవసరాన్ని, వామపక్ష మిత్రులు దీన్ని వదిలివేసి పాలకవర్గ పార్టీల పొత్తులకోసం అనుసరిస్తున్న విధానాలను విమర్శించారు. కా॥ నాగిరెడ్డి చూపిన విప్లవ పంథా వెలుగులో ముందుకు సాగాలని చెప్పారు.

తర్వాత సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ తన ఉపన్యాసంలో కా॥ టి.ఎన్. 1969లో అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ బాతాఖానీ షాపుల నుండి బయటపడి ప్రజల్ని విప్లవ కార్యాచరణలోకి కదిలించాలి అన్న పిలుపును నేటి పరిస్థితుల్లో మరింత శక్తివంతంగా అమలుచేయాలనీ, విప్లవోద్యమాన్ని ముందుకు సాగనీయకుండా అడ్డుపడ్తున్న మితవాద, అతివాద విధానాలపై కా॥ టి.ఎన్. చూపిన బాటలో రాజీలేని పోరాటం సాగించాలని చెప్పారు.

ఇంకా ఈ సభలో ఏపిఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ వై.సోని, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా కార్యదర్శి గౌ॥ వేములపల్లి వామనరావు ప్రసంగించారు. సభ ప్రారంభానికి ముందు కా॥ టి.ఎన్. ఫోటోకు ప్రొ॥ కె.ఆర్.చౌదరి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలానే ఇటీవల కర్నాటక, గుజరాత్ బాంబుప్రేలుళ్ళలో మరణించిన వారికి నివాళులు చెబుతూ సభ రెండు నిముషాలు మౌనం పాటించింది. ఈ సభకు పార్టీ నగర కార్యదర్శి కా॥ టి.పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. సభానంతరం బందరు ప్రజా కళాకారులు కొక్కెలగడ్డ రఘురామయ్య బృందం అమరవీరుల పోరాట జీవితాన్ని చిత్రించే 'నెత్తుటి దీపాలు' నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. తర్వాత గిరిజన కళాకారుల మహిళా బృందం 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథను ప్రదర్శించారు. సభకు ముందు గిరిపురం కాలనీలో గల కా॥ టి.ఎన్. స్థూపానికి కా॥ కోటయ్య పూలదండ వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత ఎర్రజెండాను కా॥ టి.పూర్ణచంద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కా॥ టి.ఎన్. జీవితం ఏ విధంగా ఆదర్శప్రాయమో కా॥ కోటయ్య వివరించారు. అనంతరం కృష్ణలంక సత్యంగారి హోటల్ సెంటర్‌లో పార్టీ జెండాను కా॥ కోటయ్య ఆవిష్కరించారు.

**- జనశక్తి ప్రతినిధి**

# అణుఒప్పందం పేరుతో దేశభద్రతను అమెరికా సామ్రాజ్యవాదులకు తాకట్టుపెడుతున్న దళారీ పాలకుల విధానాలపై సంఘటితంగా ఉద్యమిద్దాం!

## అమరుడు కా॥ పాతర్ల నాగయ్య 30వ వర్ధంతి సభలో వక్తల పిలుపు

**కమ్యూనిస్టు** విప్లవకారుడు, కార్మిక నాయకుడు కా॥ పాతర్ల నాగయ్య 30వ వర్ధంతి సభ 23.7.08న సా॥ 7 గంటలకు మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరిగింది. సభకు ముందుగా డోలాస్‌నగర్ సెంటర్‌లో ఉన్న కా॥ నాగయ్య స్థూపం వద్ద అరుణాంజలి అనంతరం రైల్వేస్టేషన్ సెంటర్ నుండి గాలిగోపురం-మిద్దె సెంటర్-మార్కెట్- హుస్సేన్‌కట్ట- ఊర్వశి సెంటర్-పాతబస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ప్రదర్శనలో పల్నాటి యువకుల కర్ర సాధన-డప్పుల దళం ప్రదర్శనలు ప్రజలను ఉత్సాహపరిచాయి. జోహార్ పాతర్ల నాగయ్య! కొనసాగిస్తాం అమరుల ఆశయాలను! సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం! ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు వ్యతిరేకంగా పోరాడుదాం! అంటూ పెద్దపెట్టున నినదించారు.

అమరుడు కా॥ పాతర్ల నాగయ్యకు నివాళి అర్పించడంతో సభ ప్రారంభమైంది. సభకు ఏపిఎఫ్‌టియు నాయకులు కా॥ కొర్రపాటి ఆదినారాయణ అధ్యక్షత వహించారు. సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడుతూ కా॥ పాతర్ల నాగయ్య కార్మిక నాయకుడుగా విప్లవ కమ్యూనిస్టుగా ఎదిగాడని అన్నారు. ప్రకాశం బ్యారేజి నుండి మంగళగిరి వరకు ఉన్న వివిధ కంపెనీలలో కార్మిక సంఘాలకు నాయకత్వం వహించారు, అలాగే కమ్యూనిస్టు విప్లవకారుల సంస్థకు గుంటూరు, ప్రకాశం జిల్లాల కార్యదర్శిగా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారని అన్నారు. కార్మికులు సంఘటితపడితే తమ దోపిడీ పునాదులు కదలిపోతాయని భయపడిన యాజమాన్యం-కార్మికవర్గం చైతన్యవంతులైతే తమ అధికార పీఠాలు కూలిపోతాయని భయపడిన రాజ్యం కుమ్మక్కయి కా॥ నాగయ్యగారిని ద్రోహులైన మురాచే హత్య చేయించారని అన్నారు. కా॥ నాగయ్య కమ్యూనిస్టు విప్లవకారుడుగా ఈ దోపిడీ సమాజం మారాలని, కార్మికవర్గ రాజ్యం రావాలని అందుకు చిట్టిపొట్టి చిట్కాలు కాదని, వర్గ పోరాటమే మార్గమని నమ్మి అందుకనుగుణంగా తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఈనాడు దేశంలో అనేక విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలు కార్మికుల హక్కులను కాలరాచి వేస్తున్నాయి. కార్మికులను వీధుల్లోకి నెట్టివేస్తున్నాయని అన్నారు. యుపిఏ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గి, అణుఒప్పందాన్ని చేసుకోవడానికి ఆత్రుతలో ఉంది. అమెరికా సామ్రాజ్యవాదులు తమకు పనికిరాని ఆయుధాలు, వస్తువులు అమ్ముకోవడానికి మన దేశంతో ఒప్పందాలకు సిద్ధపడుతున్నారు. దానికి మన పాలకులు జోహుకుం అంటున్నారు. ఇది పాలకుల దళారీ స్వభావాన్ని వెల్లడి చేస్తున్నది. దేశ స్వాతంత్ర్యానికి, దేశ భద్రతకు, ప్రజల శ్రేయస్సుకు ముప్పు కలిగే దళారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటమొక్కటే ప్రజల ముందున్న మార్గం అని అన్నారు.

**సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కె.కోటయ్యగారు మాట్లాడుతూ భారత పాలకులు కోస్తా కారిడార్ పేరుతో వేల ఎకరాల భూముల్ని విదేశీ** కంపెనీలకు కట్టబెట్టి ప్రజల జీవితాల్ని చిన్నాభిన్నం చేయడానికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఈనాడు అన్ని వృత్తుల ప్రజలకు, చిన్న చిన్న వ్యాపారులకు ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయి. అవి రిలయన్స్, వాల్‌మార్ట్ తదితర గుత్త, బహుళజాతి తిమింగలాల రూపంలో ఉన్నాయని అన్నారు. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చేవారు, ఆంధ్రావంటి రాష్ట్రాల్లో ఆందోళనలు చేసే లెఫ్ట్ సోదరులు పశ్చిమబెంగాల్ నందిగ్రామ్, సింగూర్‌లలో అనుసరిస్తున్నదేంటి అని ప్రశ్నించారు. ఇకనైనా సిపిఐ, సిపిఎంలు నేలపైకి దిగి రావాలని, ప్రజల్లో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి సరైన మార్గంలో ఉద్యమించాలని అన్నారు. విప్లవకారుల ఐక్యతకు సిపిఐ (ఎం.ఎల్) కృషి సాగిస్తున్నదని-ఆ కృషి ఫలించి తీరుతుందని చెబుతూ ముగించారు.

సీనియర్ నాయకులు కా॥ **ముత్తిరెడ్డి శ్రీరాములు గారు** మాట్లాడుతూ అమరుడు కా॥ నాగయ్య జీవితం అందరికీ ఆదర్శం అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికి ఈ సందర్భంగా ప్రతినపూనాలని అన్నారు. **రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥** సింహాద్రి **లక్ష్మారెడ్డి** మాట్లాడుతూ కా॥ నాగయ్యను విద్రోహ మురా హత్య చేసినా, కా॥ చెన్నయ్యను విప్లవపార్టీ ముసుగులోని దళం హత్య చేసినా, కా॥ విశ్వమోహనరెడ్డి, మరియమ్మలను రాజ్యం ఎన్‌కౌంటర్ చేసినా ఇవన్నీ పాలకవర్గాలకు మేలు చేసేవే కమ్యూనిస్టు విప్లవకారుల జీవితం చాలా విలువైనది, సుదీర్ఘకాలంపాటు ప్రజలకు నాయకత్వం వహించి సమాజ మార్పుకు దోహదపడాల్సిన వారిని హత్య చేయడం దుర్మార్గమైన చర్య. ప్రజా ఉద్యమాల ద్వారానే ఈ హత్యలన్నింటికి సమాధానం చెబుతాం అన్నారు. **రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు** మాట్లాడుతూ కార్మికవర్గాన్ని సంఘటితపరచటంకోసం కా॥ నాగయ్యగారు సాగించిన కృషి మనకు ఆదర్శం. జిల్లాలో సెజ్‌లు, కోస్తా కారిడార్, కెమికల్ హబ్‌లపేరుతో బహుళజాతి కంపెనీల దురాక్రమణ పెరుగుతోంది. దీనిపై ఐక్య ఉద్యమాలు సాగించాల్సి వుందని అన్నారు. **సి.పి.ఐ. (ఎం.ఎల్) నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు** మాట్లాడుతూ కా॥ నాగయ్యను హత్య చేసినవారు తమ పని పూర్తయి పోయిందనుకున్నారు. కానీ ఆయన తయారు చేసిన ఎందరో విప్లవకారులు రాష్ట్రమంతా నేడు వున్నారు. నాగయ్యగారి స్ఫూర్తితో ఎన్నో ఉద్యమాలను నిర్మించాం, నిర్మిస్తామని అన్నారు. సభలో సి.పి.ఐ. (ఎం.ఎల్) నాయకులు కా॥ రాచకొండ సాంబశివరావు, కా॥ అబ్రహాం, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం కన్వీనర్ కా॥ కూరపాటి కోటయ్య, రైతుకూలీ సంఘం నాయకులు కా॥ దానబోయిన భాస్కర్, కా॥ అంజిరెడ్డి, కా॥ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తీవ్రమైన వర్షం, అననుకూల వాతావరణంలో సైతం మంగళగిరి ప్రజలు సభలో పాల్గొన్నారు పెద్దతరం వారందరూ నాగయ్యగారిని స్ఫురణకు తెచ్చుకొని, అటువంటి ఆదర్శవంతమైన నాయకులు తయారవ్వాలని తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. ◈

# దారి మళ్ళుతున్న పేదల బియ్యం

**రాష్ట్రంలో** ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ పాలక, ప్రతిపక్ష పార్టీలు పోటీపడి వాగ్దానాలు, సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నాయి. ప్రజలను భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నాయి అందులో భాగమే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకం

ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, తాను చేసిన అన్ని వాగ్దానాలు నెరవేర్చానని, చేయని వాగ్దానాలు కూడా అమలు జరుపుతున్నానని, రెండు రూపాయల బియ్యం పథకం అలాంటిదేనని గొప్పగా చెప్పుకున్నాడు. ఈ పథకం వలన లక్షలాది పేద కుటుంబాలు కడుపునిండా తిండి తినగలుగుతాయని ప్రకటించారు.

దోపిడీ పాలకవర్గాలు ప్రజల ప్రధాన సమస్యలు పరిష్కరించకుండా వారిని భ్రమల్లో ఉంచేందుకు సంక్షేమ పథకాలు ప్రకటిస్తాయి. ప్రజలు, తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించకుండా తమ చుట్టూ తిప్పుకొనే ప్రయత్నం చేస్తాయి. బ్రిటీష్ వలస పాలకులు కూడా ఇలాంటి పథకాలు అమలుజరిపారు. వారి నుండి అధికారాన్ని బదలాయించుకొన్న దేశ పాలకులు వాటిని కొనసాగిస్తున్నారు. 1983లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మొదటిసారిగా రాష్ట్రంలో రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని అమలుజరిపింది. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి పదవి నుండి దింపి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం బియ్యం రేటుని రెండు నుండి ఐదున్నర రూపాయలకు పెంచింది. తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 4 సంవత్సరాల తర్వాత రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలుజరుపుతున్నది.

ఈ పథకం అమలు గురించి గొప్పలు చెప్పుకొంటున్న పాలకులు ఇలాంటి పథకాలపై ప్రజలు ఎందుకు బ్రతకవలసి వస్తుందో ఆలోచించటంలేదు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గ్రామీణ ప్రజలు జీవిస్తున్నారు. ఇందుకు కావాల్సిన భూమి కొద్దిమంది భూస్వాముల వద్ద ప్రోగుపడి ఉండటం వలన, సేద్యం భూమిలేని పేదలు, భూకామందుల వద్ద కూలి పనిచేసుకొంటూ బ్రతుకుతున్నారు. ఇందుకు వచ్చే ఆదాయం, కనీస కుటుంబ అవసరాలు తీరక వ్యవసాయ కూలీలు, పేద రైతులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదల, చేతివృత్తుల వారి పరిస్థితి కూడా ఇంతే దుర్భరంగా ఉంది.

వీరు ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు భూపంపిణీ జరగాలి పట్టణ ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటుచేసి ఉద్యోగ అవకాశాలతోపాటు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పుడు సంక్షేమ పథకాలు అమలుజరపాల్సిన అవసరమే ఉండదు. భూస్వాముల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనం కాపాడే పాలకులు అలాంటి విధానాలు చేపట్టరు. అందుకే ప్రజలను సంస్కరణల ద్వారా భ్రమింపచేసే ప్రయత్నాలు చేపట్టి పేదలను యాచకులుగా మారుస్తున్నారు.

ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం చేయని పాలకులు, సంక్షేమ పథకాలను కూడా సక్రమంగా అమలుజరపటంలో ఘోరంగా విఫలమైనారు. రెండు రూపాయల బియ్యం పథకం అందుకు అతీతంగా లేదు. ఈ పథకం లబ్దిదారులను ఎంపిక చేయటంలోనే అనేక అవకతవకలకు పాల్పడుతున్నారు. అసలైన లబ్ధిదారులకు చెందవలసిన తెల్లకార్డులు సంపన్నవర్గాల ఇండ్లకు చేరాయి. వీటి ద్వారా లభించే అనేక రాయితీలకు వీరు అర్హత సంపాదించారు. చాలా మంది నిజమైన పేదలకు ఈ కార్డులు అందలేదు. అధికారుల అవకతవకలు, అవినీతి వలన తెల్లకార్డుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఈ పథకం ద్వారా కుటుంబంలోని ప్రతి వ్యక్తికి నెలకు నాలుగు కిలోల బియ్యం ఇస్తారు. దీంతోనే వారిని నెలంతా సరిపెట్టుకోమంటున్నారు. రోజల్లా రెక్కలు ముక్కలు చేసుకొనే కష్టజీవికి ఈ నాలుగు కిలోలు వారం రోజులకు మించి రావు. మిగతా రోజుల ఆహారానికి బయట అధిక ధరపెట్టి కొనుక్కోవాల్సిందే. డబ్బు ఉంటే కొనుగోలు చేస్తారు, లేకుంటే పస్తులు ఉంటారు. ముఖ్యమంత్రి పేదల ఆహార ఖర్చును ప్రకటించి వారి దుర్భర స్థితిని అపహాస్యం చేశారు. 115 రూ.తో నెలంతా కుటుంబం బ్రతకమని, అంతకు మించిన ఆహారం వారికి అవసరం లేదని పరోక్షంగా పేర్కొన్నాడు. పేదలు ఇలా ఉంటేనేగదా ముఖ్యమంత్రిలాంటివాళ్ళు విలాసవంతమైన జీవితం, వేల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకొనేది.

పేదలకు యిచ్చే బియ్యం పెద్దమొత్తంలో పక్కదారికి మళ్ళుతున్నాయి. ఈ పథకానికి ఉపయోగించే బియ్యంలో 25 శాతం (10 లక్షల టన్నులు) పంపిణీ కాకుండా మిగిలిపోతున్నాయి.

ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఇందుకు సూత్రధారులుగా ఉన్నారు. తెల్లకార్డులు పొందిన వారిలో చాలా మంది రేషన్ బియ్యం తీసుకోవటంలేదు ఈ విషయం అధికారులకు, డీలర్లకు తెలుసు డీలర్లు బియ్యం తీసుకొనేటప్పుడే అధికారులు వీరితో కుమ్మక్కు అయి వారి బియ్యాన్ని మినహాయించి, తర్వాత వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొన్ని గ్రామాలకు చెందిన బియ్యం లారీలకు లారీలే తరలిపోతున్నాయి.

మండలస్థాయి కేంద్రాల్లో బ్లాక్ చేసిన బియ్యాన్ని లారీలు, ట్రాక్టర్లు, ఆటోల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ తరలింపుకు ప్రకాశంజిల్లా దర్శి, నెల్లూరుజిల్లా కావలి, కర్నూలుజిల్లా నంద్యాలలు కేంద్రాలుగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు తరలిపోయే రెండు రూపాయల బియ్యం అక్కడ 14 రూ. దాకా ధర పలుకుతున్నది. ఇతర రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని రైసు మిల్లులకు పెద్ద మొత్తంలో బియ్యం తరలిపోతున్నాయి. మిల్లర్లు బియ్యాన్ని కొద్దిగా పాలిష్ చేసి పేరున్న కంపెనీల పేరుతో ఇతర రాష్ట్రాలకు తరలించటంతోపాటు లెవీ క్రింద కొంత భాగాన్ని ఎఫ్.సి.ఐ.కి ఇస్తున్నారు.

ప్రకాశంజిల్లాలోని గిద్దలూరు, కొమరోలు, బి.పేటల నుంచి బియ్యం దర్శికి తరలించి అక్కడి నుండి కర్నూలు మీదగా మహారాష్ట్రకు పంపుతున్నారు. ఈ జిల్లాలోని కందుకూరు ప్రాంతంలోని ఎర్రపాడులో 93 టన్నుల బియ్యాన్ని లబ్దిదారులకు పంచకుండానే పంపినట్లు రికార్డులు సృష్టించి, వాటిని దళారుల ద్వారా బయటకు తరలించారు. కర్నూలులో 550 బస్తాల బియ్యాన్ని విజిలెన్సు అధికారులు పట్టుకొని, అక్కడ దొరికిన సమాచారం ప్రకారం, ప్రకాశంజిల్లా కందుకూరు, దర్శి, మార్టూరు, ద్రోణాదుల ప్రాంతాల్లోని రైసుమిల్లులపై జరిపిన దాడుల్లో టన్నుల కొద్ది బియ్యం బయటపడ్డాయి. కందుకూరు, కావలి డివిజన్ల నుండి బియ్యాన్ని కావలికి తరలించి అక్కడి నుండి కర్నాటకకు పంపుతున్నారు. బియ్యం తరలింపుకి ఈ జిల్లాలోని తడ కూడా కీలక ప్రాంతంగా మారింది. ఇక్కడ ఉన్న చెక్‌పోస్టు కేంద్రబిందువుగా ఉంది. ఇక్కడ 300 రూ. ఇస్తే ట్రాన్సిట్ పాస్ ఇస్తారు. ఇలాంటి పాసులను పొందిన అక్రమ రవాణాదారులు, ఆ పాస్‌లను ఆంధ్రా నుండి మహారాష్ట్ర-కర్నాటక వెళ్ళే లారీలకు అంటిస్తున్నారు. చెన్నయ్ నుండి ఈ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నట్లు బిల్లులు సృష్టిస్తున్నారు. ఇందుకు చెన్నైలోని ఒక బియ్యం విక్రయకేంద్రం నిలయంగా మారింది. ఈ విధంగా పెద్దఎత్తున పేదల బియ్యాన్ని ఈ రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

పేదల బియ్యం అక్రమరవాణాకు గుంటూరుజిల్లా కూడా మరో కేంద్రంగా మారింది. గుంటూరు పట్టణం ఇందుకు నిలయమయింది 5 వేలకు బియ్యం బస్తాలు దొడ్డిదారిన బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయాయి నర్సరావుపేట నియోజకవర్గంలోని రావిపాడు, రూడెనగుంట, నకరికల్లు, దేచవరం, నర్సరావుపేటల నుండి అక్రమంగా తరలిస్తున్న 3,150 బస్తాలను. పిడుగురాళ్ళలో 800, వినుకొండలో 750 బస్తాలను పట్టుకొన్నారు. ఈ విధంగా రాష్ట్రవ్యాపితంగా పేదలకు చెందాల్సిన బియ్యాన్ని దొంగ రవాణా సాగిస్తూ పెద్దమొత్తంలో అక్రమార్జన సాగిస్తున్నారు.

పేదలకు పంపిణీ చేసే బియ్యంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకొంటామని, అవినీతికి చోటు లేకుండా అమలుజరుపుతామని ముఖ్యమంత్రి ప్రకటించినా, అవినీతి, అక్రమాలు యధేచ్ఛగా జరుగుతూనే వున్నాయి. ఇందుకు కారణమైన రెవిన్యూ అధికారుల, దళారుల, స్థానిక రాజకీయ నాయకులను శిక్షించకుండా వారిచేతిలో పావులుగా మారిన కొందరు డీలర్లను బలిపశువులను చేస్తున్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్రమంత్రులు, ఎం.ఎల్.ఏ.లు వారికి అండగా ఉంటున్నారు. అందుకు గుంటూరుజిల్లానే నిదర్శనం. ఈ జిల్లాలోని తాడికొండ, నకిరికల్లు, వినుకొండ తాహశీల్దారులు అక్రమ రవాణాకు పాల్పడినందువలన జిల్లా కలెక్టర్ వీరిని సస్పెండ్ చేశారు. తాడికొండ తాహశీల్దార్ సస్పెండు అయినా విధులకు హాజరవుతున్నారని ప్రజలు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవటంలేదు. ఒక శాసనసభ్యుడు ఈ తాహశీల్దార్‌పై చర్యలు తీసుకోవద్దని, సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేయటమే ఇందుకు కారణం. ఈ విధంగా అవినీతి అధికారులపై చర్య తీసుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది.

కిలో రెండు రూపాయల బియ్యం పథకం పేదలకు సక్రమంగా ఉపయోగపడాలనే ఆలోచన ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్నా ఈ క్రింది చర్యలు వెంటనే తీసుకోవాలి. నల్గురు ఉన్న కుటుంబానికి నెలకి 30 కేజీలు, ఆపైన ఒక్కొక్కరికి 7 కేజీల బియ్యం ఇవ్వాలి. నూనె ప్యాకెట్ ఒకటి, కందిపప్పు రెండు కేజీలు ఇవ్వాలి. పేదలకు ఉపాధి పనులు కల్పించాలి. వీటితోపాటు చౌకగా చింతపండు కూడా సప్లయ్ చేయాలి. బియ్యం అక్రమ తరలింపుదారులపై కేసులు బనాయించి కఠినంగా శిక్షించాలి. నిఘా విభాగాన్ని పటిష్టపర్చాలి. అప్పుడే పేదలకు కొంత మేరకైనా ఉపయోగకరంగా ఉంటుంది. ◈

# పారిశ్రామిక కారిడార్‌లను, సెజ్‌లను, అధిక ధరలను వ్యతిరేకిస్తూ

## ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో సభలు

**ఒంగోలు, 26-6-08:**

ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమాఖ్య ఏపిఎఫ్‌టియు) ప్రకాశంజిల్లా శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక కారిడార్‌లు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్), అధిక ధరలను వ్యతిరేకిస్తూ స్థానిక వేమూరి లక్ష్మణ కల్యాణమండపంలో సాయంత్రం 4 గంటలకు **ఏపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్.శాయి** అధ్యక్షతన సభ జరిగింది.

ప్రధాన వక్తగా వచ్చిన **ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి.పెద్దన్న** మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం జూన్ 23 నుండి 30 వరకు కారిడార్‌లు, సెజ్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుపమని యిచ్చిన పిలుపులో భాగంగా ఈ సదస్సు జరుగుతున్నందని తెలిపారు. భారత ప్రజల ఆకాంక్షల కనుగుణంగా భారతదేశంలో స్వాతంత్ర్యం లభించలేదని, అధికార మార్పిడి జరిగిందని, జాతీయ కాంగ్రెసు ప్రజలను వంచనకు గురిచేసిందన్నారు. ఈ రోజు భారత పాలక వర్గాలు బహుళజాతి సంస్థల ప్రయోజనాలకోసం వేలాది ఎకరాలను పేద, మధ్యతరగతి రైతాంగం నుండి పారిశ్రామిక కారిడార్‌లు, సెజ్‌ల పేరుతో గుంజు కుంటున్నదని, ఉపాధి లేకుండా చేస్తున్నదని, రైతాంగాన్ని ఆత్మహత్యలపాలు చేస్తున్నారని అన్నారు. కార్మికవర్గానికున్న అన్ని హక్కులను హరించి వేస్తున్నారని, అసంఘటితరంగ కార్మికులు నానా దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని, ఈ సెజ్‌లలోని కార్మికులకు ఏ కార్మిక హక్కులు వర్తించవని, ఆనాడు ఈస్ట్ ఇండియా బ్రిటీష్ పాలకులు ప్రత్యక్షంగా దోచుకుంటే ఈ రోజు అనేక సామ్రాజ్యవాద దేశాలు ముఖ్యంగా అమెరికా మన సహజవనరులను, మన శ్రమశక్తిని దోచుకుంటున్నాయని అన్నారు. ఈ రోజు పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నది పారిశ్రామిక కారిడార్‌కు నీరు అందించటానికి, నావిగేషన్‌కు మాత్రమేనని, అందుకోసమే 70 అడుగుల లోతు కాలువలు తీస్తున్నారని అన్నారు మనం ఈ సెజ్‌లకు వ్యతిరేకంగా బలమైన ఐక్య ఉద్యమాలను నిర్మించాలన్నారు

**ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి** మాటాడుతూ 2005లో సెజ్‌ల చట్టం చేసినప్పటికీ, అంతకుముందు నుండే బొంబాయి, విశాఖపట్నం ప్రాంతంలో ఈ సెజ్‌లు ప్రారంభించారని, రాష్ట్రంలో 1 కోటి 10 లక్షల ఎకరాల సాగుభూమిలో 80 లక్షల ఎకరాలో పంట పండిస్తున్నారని, టాటా, బిర్లా, అంబానిలాంటి అనేక దళారీ గుత్త పెట్టుబడి దారులకు పాలకులు ఈభూమిని అప్పజెప్తున్నారని, బెంగాల్‌లో భట్టాచార్య సిపిఎం ప్రభుత్వం సలీం గ్రూపు కంపెనీకి 1200 ఎకరాలు భూమి అప్పజెప్పటాన్ని నిరసించి ప్రజలను కిరాతకంగా కాల్చి చంపారని అన్నారు. భారత పాలకులు సెజ్‌ల పేరుతో "ఈస్ట్ ఇండియా" లాంటి కొత్త కంపెనీలకు భారత వనరులను ధారాదత్తం చేస్తున్నారని, కోస్తాలో 1 లక్షా 50 వేలు ఎకరాలు స్వాధీనం చేసుకుంటున్నారని, పాలకులు అమలుచేస్తున్న ఈ విధానాలకు వ్యతిరేకంగా మనం రైతాంగాన్ని కదిలించి పోరాటాలు సాగించినపుడే మన భూములు నిలబెట్టుకోగలుగుతామన్నారు.

**టుబాకో బోర్డు ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, అడ్వకేట్, కా॥ పి.గోవిందరావు** మాట్లాడుతూ, పాలకులు ప్రజలలో వస్తువ్యామోహ సంస్కృతిని, ఆరోగ్యానికి హానికరమైన మద్యం, గుట్కాలాంటి మత్తు పదార్థాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. సామాన్య జీవనానికి అవసరమైన నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని, దీనికి కారణం రైతాంగం పండించే అన్ని రకాల పంటలపై దళారీ మార్కెట్‌శక్తుల ఆధిపత్యమే కారణమని, వ్యవసాయ ఉత్పత్తులన్నిటిపై ఫ్యూచర్ ట్రేడింగ్‌నకు అంటే నిత్యావసర వస్తువులను కొని దాచుకోవటానికి, మరియు ఫార్వర్డ్ ట్రేడింగ్ అనగా ఆ దాచిన వస్తువులు దేశంలో ఎక్కడ లాభాలు వస్తే అక్కడ అమ్ముకొనే విధంగాను బ్లాక్ మార్కెట్‌దారులకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. దేశంలోని సహజగ్యాసు, ఆయిల్ నిక్షేపాలను విదేశీ, స్వదేశీ గుత్తపెట్టుబడిదారులకు అప్పజెప్పి, అధిక ధరలకు ఆయిల్‌ను దిగుమతి చేసుకోవటం వలన, ఇబ్బడి ముబ్బడిగా పెట్రోలు, డీజిల్ ధరలు పెంచటం వలన సరుకు రవాణా ఛార్జీల భారం నిత్యావసర వస్తువులపై పడుతుందన్నారు మన పంట భూములను ఈ సెజ్‌లకు ధారాదత్తం చేయటం వలన పంట విస్తీర్ణము, పంటల ఉత్పత్తి తగ్గి ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుందని, పాలకులు అనుసరిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలన్నారు.

**రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలితకుమారి** మాట్లాడుతూ, మన తీర ప్రాంతంపై విదేశీ, స్వదేశీ గుత్తపెట్టుబడిదారుల కన్ను పడిందని, ఈ సముద్ర తీర ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ పేరుతో పెట్రో రసాయన పరిశ్రమలు పెట్టబోతున్నారని, వీటి వలన మన సముద్ర సంపద అయిన చేపలు, రొయ్యలు అంతరించిపోతాయని, పంటభూములు బీడుభూములుగా మారతాయని, నీటి వనరులు కలుషితమై త్రాగు, సాగునీటి సమస్య ఏర్పడుతుందని ఈ సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్‌లకు వ్యతిరేకంగా, పంటభూములను కాజేసి ఆహారధాన్యాల కొరతకు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమౌతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడినపుడే మన భూములు నిలుపుకోగలమన్నారు.

సభ అనంతరం ప్రత్యేక ఆర్థికమండళ్ళ చట్టాన్ని రద్దు చేయమని, అధిక ధరలను నియంత్రించమని ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలికి సూచన చేయవలసినదిగా రాష్ట్ర గవర్నరు గారికి జిల్లాలోని 3 కార్మిక సంఘాలు టెలిగ్రాంలు పంపాయి.

**గుంటూరు, 5.7.2008:**

2005 సెజ్ చట్టాన్ని రద్దు చేయాలని, ప్రత్యేక ఆర్థిక మండళ్ళను వ్యతిరేకించాలని, కారిడార్‌లకు, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా పోరాడాలని ఏపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో పున్నయ్య-శంకర్‌ల భవన్‌లో సభ, పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ఈ సభకు ఏపిఎఫ్‌టియు నగర కార్యదర్శి కా॥ యు.కృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయి. కంపెనీలలో జీతాలు పెంచమని కార్మికులు ఆందోళనలు చేస్తుంటే జీతాలు పెంచనటువంటి ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం నింగిని అంటే విధంగా పెంచుతున్నారు కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వారి యొక్క కష్టార్జితాలను యాజమాన్యాలు అనుభవిస్తున్నాయని అన్నారు.

**ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి** మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రోజు సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు, పెద్దపెద్ద బహుళజాతి సంస్థల యాజమాన్యాలకు వేలు, లక్షల ఎకరాల భూములను కట్టబెట్టేందుకు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, కారిడార్‌ల పేరిట రైతుల వద్ద భూములను గుంజుకుంటున్నారు. దీని కారణంగా సంవత్సరానికి రెండు పంటలు పండే భూములు ఈసారి ఒక పంటకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా రైతులు, రైతుకూలీలు లక్షల మంది జీవనోపాధిని కోల్పోయారు. విశాఖపట్నం, తూర్పుగోదావరిజిల్లాల్లో ఓడరేవుల నిర్మాణం చేబట్టి కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను, సంపదలను దోపిడీ వర్గాలు దోచుకుపోయే విధంగా మన పాలకవర్గాలు అవకాశం కల్పిస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు పెడితే భారతదేశంలో ఉన్నటువంటి ఎంతో మంది నిరుద్యోగులు నిరాశ, నిస్పృహకు గురౌతారు. ఈ ఆర్థిక మండళ్ళలో కార్మిక చట్టాలు, లేబర్ చట్టాలు యిటువంటివి కూడా వుండవు. బానిస, వెట్టిచాకిరీ చేయించుకోవటానికి సంసిద్ధంగా ఉన్నారు. ఈ పాలకవర్గాలు అనుసరిస్తున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా కార్మికులు అందరూ సంఘటితంగా పోరాడాలని అన్నారు. సిపిఐ (ఎం.ఎల్) పార్టీ జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశంలో 70% మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతున్నారు. అలాంటి రైతుల వద్ద నుండి భూములు గుంజుకొని రైతు నోట్లో మన్ను కొట్టటానికి పాలకవర్గాలు, వేగవంతమైనటువంటి రైతాంగ వ్యతిరేక విధానాలను తీసుకువస్తున్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి జలయజ్ఞం పేరుతో వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి రైతాంగాన్ని దివాళా తీయిస్తున్నారు. రైతులను దివాళా తీయిస్తే కార్మికులు కూడా పనులులేక బజారు పాలవుతారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు వారి యొక్క హక్కులకోసం పోరాడాలని అన్నారు.

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి** మాట్లాడుతూ గుంటూరుజిల్లాలో మంగళగిరి, తాడేపల్లి, చిలకలూరిపేట, నిజాంపట్నం అనేక ప్రాంతాలలో రైతుల వద్ద భూములను ఆక్రమించి ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో నాలెడ్జి పార్కు టెక్స్‌టైల్ పార్కు, అపేరల్ పార్కు, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, పోర్టు సిటీ, సింగపూర్ టౌన్ షిప్ వంటి సంస్థలను తయారు చేయటం కోసం సామ్రాజ్యవాదులకు ఎర్ర తివాచి పరచి రైతుల భూములను గుంజుకోండి అని గేట్లు బార్లా తీస్తున్నారు ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజల భవిష్యత్తును నాశనం చేయడాన్ని మన మందరము కలిసి ఓడించాలని అన్నారు.

**ఏపిఎఫ్‌టియు నాయకులు బి.రఘు** మాట్లాడుతూ, మిర్చి యార్డు అగ్నికి ఆహుతై రెండు నెలలు గడిచింది. ఈ రోజుకి కూడా కార్మికులకు తగిన ఉపాధి చూపించలేకపోయారు. రెండున్నర లక్షల క్వింటాళ్ళ మిర్చి తగులపడితే దానికి నష్టపరిహారం చెల్లించకుండా ఉన్నారంటే పాలకవర్గాల యొక్క దుర్మార్గం ఏ విధంగా ఉన్నదో మనకు అర్థమవుతూనే వున్నది. అగ్ని ప్రమాదం కారణంగా రైతులు, కార్మికులు జీవనోపాధిని కోల్పోవటమేగాక వారి యొక్క బిడ్డలను కూడా చదివించుకునే పరిస్థితులు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితులను అందరు పరిగణనలోకి తీసుకోవాలని రైతులు, కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. సభ అనంతరం పున్నయ్య-శంకర్‌ల భవన్ నుండి ప్రదర్శన తర్వాత రింగ్‌రోడ్డు సెంటర్‌లో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

**పిడుగురాళ్ల, 30.6.2008:**

పట్టణంలో 300 మంది కార్మికులతో నిర్వహించిన ప్రదర్శన సెజ్‌లకు వ్యతిరేకంగా జానపాడు రోడ్డులోని ఏపిఎఫ్‌టియు ఆఫీసు వద్ద నుండి బయలుదేరిన ప్రదర్శన ఏడుకొట్ల సెంటరు, ఆంధ్రాబ్యాంకు, పోలీసు స్టేషన్, సినిమాహాళ్ల సెంటర్, అంజిరెడ్డి హాస్పటల్ వరకు వెళ్ళి తిరిగి ఏడుకొట్ల సెంటర్‌కి చేరుకుంది.

అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడుదాం! పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాసు ధరలను తగ్గించాలి, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం 2005ను రద్దుచేయాలి, సెజ్ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుదాం! ఇదేమి రాజ్యం! ఇదేమి రాజ్యం - ధరలను పెంచే దోపిడి రాజ్యం, కూడు, గుడ్డనివ్వలేని రాజ్యమొక రాజ్యమా? ధరలనదుపు చేయలేని పాలనొక పాలనా? అంటూ ప్రదర్శనకారులు పలునినాదాలను చేశారు.

ప్రదర్శన అనంతరం ఏడుకొట్ల సెంటర్‌లో కార్మికులతో సభ జరిగింది. ఈ సభలో **ఏపిఎఫ్‌టియు జిల్లా నాయకులు కా॥ కొండారెడ్డి చెన్నయ్య** మాట్లాడుతూ "ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలతో భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల వారి బహుళజాతి సంస్థల, దేశీయ బడా పెట్టుబడిదారుల లాభాలను యిబ్బడిముబ్బడిగా పెంచే విధానాలను అనుసరిస్తూ కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్నారన్నారు.

దోపిడీ వర్గాలు ఏర్పాటు చేసే సెజ్ పరిశ్రమలలో పనిచేసే కార్మికుల శ్రమను కారుచౌకగా దోచుకునేందుకు వీలుగా కొత్త నిబంధనలతో కార్మిక చట్టాలను రూపొందించి ఏ హక్కులులేని బానిసలుగా కార్మికుల చేత పని చేయించుకొంటున్నారని హక్కుల కోసం మాట్లాడితే అణచివేతకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విధానాలను విమర్శించారు. కార్మికులు సంఘటితంగా పోరాటాల్లోకి రావాలని కోరారు.

**రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు** మాట్లాడుతూ, "దళారీ పాలకుల ప్రజావ్యతిరేక విధానాల మూలంగా వ్యవసాయం గిట్టుబాటుకాక, ఉన్న కొద్దిపాటి భూమిని పోగొట్టుకుని పట్నాలకు వలసలుపోయి దుర్భరమైన జీవితాలను గడుపుతున్న రైతుకూలీల దీనావస్థ పట్టని పాలకులు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం రైతుల భూములు లాగి వేసుకుంటున్న ఈ ప్రత్యేక ఆర్థిక మండళ్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ◈

---

**గుజ్జర్ల ...** (12వ పేజీ తరువాయి)

చనిపోయినవాళ్ళలో చాలా మందికి పొట్టపైనే బుల్లెట్లు తగిలాయి. ముందుగా ఆందోళనకారుల్ని హెచ్చరించ కుండానే బుల్లెట్లు వదిలారు. తప్పించుకొని పరుగెత్తుతున్న వాళ్ళ మీద కూడా బుల్లెట్లు వదిలారు. తుపాకి గుళ్ళకు బలయిన వారికి సహాయం అందించడానికి, వారిని తీసుకువెళ్ళడానికి వీలు లేకుండా పోయింది. బుల్లెట్లు తగిలిన వారికి వైద్యం కూడా అందలేదు".

బయానా, సికందరాల్లో హత్యాకాండల్లో చనిపోయినవారి మృతదేహాలతో భారీ సంఖ్యలో ఆందోళనకారులు చెదరకుండా భైరాయించి పగలు, రాత్రి నిరసన తెలిపారు. ఈ రెండు ప్రాంతాలని సైన్యం చుట్టుముట్టింది. మృతదేహాల పోస్టుమార్టమ్ రైలుపట్టాల మీదే జరగాలని, ప్రభుత్వం చర్చలకు వారి దగ్గరకే రావాలని, వారు జైపూర్ వెళ్ళరని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర హోం మినిస్టర్ కటారియా వాదన వినండి. "అన్ని రకాల సుశిక్షుతులైన, ఆయుధాలు కల్గిన సైన్యానికి ఆందోళనకారులను అణచివేయడానికి కేవలం రెండు గంటలు చాలు కానీ ఈ ఆపరేషన్‌లో భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది కనుక ప్రభుత్వం అలా చేయాలనుకోవడం లేదు కానీ ఆందోళనకారులు తమ మంకుపట్టు వీడి దిగి రాకపోతే ఆఖరి ప్రయత్నంగా అలా జరుగకతప్పదు".

మే 29 రాజస్థాన్ పత్రికలో శ్రీ భువనేశ్‌జైన్ ఇలా వ్రాశారు-"రాజస్థాన్‌లో రాజెయ్యబడిన గుజ్జర్ల రిజర్వేషన్ల వివాదపు మంటలో అందరూ తమ చేతుల్ని కాల్చుకుంటున్నారు. నీళ్ళు జల్లి మంటనార్ప ప్రయత్నించేవారు తక్కువగానూ, నెయ్యిపోసి మంటను ఎగదోసేవాళ్ళు ఎక్కువగాను ఉన్నారు. ప్రభుత్వాలు, రాజకీయపార్టీలు, నాయకులు, అందరూ ఈ అగ్నిని భగ్గుమన్పించడానికి పోటీపడుతున్నారు. ఎంత బాగా ఈ మంట ఎగస్తే, రాబోయే ఎన్నికల్లో అంత లాభసాటిగా ఉంటుంది మరి. ప్రజలు దోచుకోబడినా, బాధింపబడినా, చంపబడినా, కాల్చబడినా వాళ్ళకేమీ పట్టదు. కేవలం వాళ్ళ ఓట్లు వాళ్ళకొస్తే చాలు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, బిజెపి, కాంగ్రెస్, ఆందోళనకు నాయకత్వం వహించే నేతలు, దీన్ని వ్యతిరేకించే నేతలూ ఈ అందరికీ ఈ డిమాండ్లకు అందరి ఆమోదం లభించే స్థితి లేదని తెలుసు ఒప్పందం కోసం చర్చలు తప్పనిసరిగా జరగాలి. కానీ రక్తపుటేరులు పారకుండా పరిష్కారం వెదికే యోగ్యత ఇప్పుడు ప్రభుత్వం, పార్టీ, నాయకుల్లో ఎవరికీ లేదు. ఇందులో ఎవరిదీ తక్కువ దోషం కాదు. బిజెపి తన ఎన్నికల ఎజెండాలో గుజ్జర్లకు ఎస్టీ రిజర్వేషన్ ఇస్తామన్న హామీతో అందరికన్నా ముందుగా ఈ హింసాత్మక సంఘర్షణకు బీజాలు నాటింది. కాంగ్రెస్ నాయకులు కూడా ఈ సమస్య పరిష్కారం పేరుతో సరైన పరిష్కారం చూపలేక పారిపోవడానికి ప్రయత్నించారు. వాళ్ళు స్వయంగా కూడా ఇలాంటి జాతుల సమస్యలపై హామీలనిస్తూ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. (సపా వ బస్పా బీ ఆందోలన్ పర్ గిద్ధ్ దృష్టి లగాయ్యే హై) ◈

**హైడ్రో ...** (7వ పేజీ తరువాయి)

కష్టసాధ్యమయిన విషయంగా వుంది. అందువలనే వీరు నదీ పరీవాహక ప్రాంతంలోని అడవిపై, కొండలపై, నీటిలోని మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు.

వరద ప్రమాదాలను నివారించటానికీ విద్యుత్ ఉత్పత్తికీ వినియోగపడుతుందనే పేరిట ప్రస్తుతం ఈ హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఇందువలన నదీ పరివాహక ప్రాంతంలో నివసించే వేలాది కుటుంబాల వారు తమ జీవనోపాధిని కోల్పోయి, నిరాశ్రయులౌతారు. సాంప్రదాయకంగా సాగిస్తున్న తమ జీవనోపాధి నుండి ఆ రకంగా వీరు తరిమివేయబడుతున్నారు.

ప్రత్యేక కలప పర్మిట్లు పొందిన బడా కాంట్రాక్టర్లు యిక్కడి అడవులను నరికివేసి విలువైన కలపనను తరలించుకుపోతున్నారు. స్థానికులను కలప నరికే కూలీలుగా నియమించుకొంటున్నారు.

ఈ ప్రాజెక్టు పేరిట ఈ రకంగా ఆటవిక సంపద తస్కరింపబడటమేకాక, తీవ్రమయిన పర్యావరణ ప్రమాదం సంభవించబోతుందనీ, ప్రజలు నిరాశ్రయులవుతారనీ వాదిస్తూ, పర్యావరణ కార్యకర్తలు హైడల్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేయాలని ఆందోళన జరుపుతున్నారు.

వెలువడింది!
జనసాహితి ప్రచురణ
**జీవశాస్త్ర విజ్ఞానం సమాజం**
కొడవటిగంటి రోహిణి ప్రసాద్, వెల: 50 00
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్

KLVA 102M240



Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

# "రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం"

## బహిరంగ సభలో కా॥ ఝూన్సి ఉద్ఘాటన

నారాయణపురం, 27.6.2008: వ్యవసాయరంగ సంక్షోభం-కారణాలు అన్న అంశంపై సాయంత్రం 7 గంటలకు విజయనగరం జిల్లాలోని నారాయణపురంలో జరిగిన బహిరంగ సభకు కా॥ మామిడి సింహాద్రి నాయుడు అధ్యక్షత వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝూన్సి మృతవీరులను స్మరించుకుంటూ రెడ్డిఅప్పలస్వామి తదితరుల త్యాగాలను మరువలేమన్నారు. గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయరంగానికి ప్రభుత్వం ఎలాంటి మద్దతునివ్వకపోగా, వారికి తగిన ధరలు అందకుండా చేసింది. బ్యాంకుల రుణాలు కూడా తగ్గించి వేసింది. ఫలితంగా వ్యవసాయం గిట్టుబాటుకాక రైతాంగం అప్పుల వూబిలో కూరుకుపోయారు. రైతాంగానికి సహాయం చేస్తానంటూ కాంగ్రెసు ప్రభుత్వం జయతి ఘోష్ కమీషన్‌ను వేసింది. దాని సూచనలు అమలు జరపకుండా, భూములు పంచుతానంటూ కోనేరు రంగారావు కమిటీని వేసింది. భూమి సమస్యపై రంగారావు కమిటీ సిఫార్సులను అమలుచేయలేదు. కాగా మరో వైపున సెజ్‌ల పేరిట లక్షలాది ఎకరాలను లాగివేసుకొని రైతాంగాన్ని వెళ్లగొడుతోంది. బడా బాబులకు కట్టబెడుతున్నది. ఆ భూములలో బయో డీజిలు, పామాయిలు వంటి తోటలు వేసి కూలీలకు పనులు లేకుండా చేస్తున్నది. నేటి సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణమనీ, దాని పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలనీ కోరారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ డి.వర్మ మాట్లాడుతూ రైతాంగం చేతిలో వున్న భూములను ప్రభుత్వం లాగి వేసుకుని బడా కంపెనీలకు అప్పజెప్పుతున్నదనీ, ఆ విధంగా రైతాంగ, కూలీలకు ఉపాధి లేకుండా చేసి, ముష్టి మెతుకుల వంటి ఉపాధి పథకాల పేరిట వారినుద్ధరించినట్లు ప్రచారం చేస్తున్నదన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ తాంద్ర అరుణ మాట్లాడుతూ పార్వతీపురం ప్రాంతంలో దుగ్గేరు, కొమరాడ, ఒరిస్సాలలో 200 గ్రామాలలో సాగుతున్న పోరాటాలను వివరించారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బి.నరసింగరావు మాట్లాడుతూ పి.వి.నరసింహారావు ప్రభుత్వం ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాలతో భూములు కోల్పోయి ధనిక రైతాంగం, మధ్యతరగతి రైతులు మధ్యతరగతి రైతులులనూ, పేద రైతులుగానూ పేద రైతాంగం కూలీలుగానూ మారిపోతున్నారనీ, కూలీలు తట్టాబుట్టా సర్దుకుని వలసలు పోతున్నారనీ అన్నారు. సాగునీరు, బ్యాంకు రుణాలు మొదలగు సౌకర్యాలను రైతాంగానికి అందించలేనని వాదించిన అన్ని రకాల పార్టీల ప్రభుత్వాలు విదేశీ, స్వదేశ దోపిడీదారులకు మాత్రం లక్షల కోట్ల రూ.లు రాయితీలుగా యిస్తున్నాయి. కనుకనే ఏ పార్టీ అధికారంలో వున్నా పేదవారి బ్రతుకులు మారటం లేదన్నారు. ఇంకా జిల్లా నాయకులు కా॥ ఎం.భాస్కరరావు, గంటా ఎరుకనాయుడు, శ్రీనునాయుడు ప్రసంగించారు.

సభకు ముందు 3 గంటలపాటు సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామమంతటా సాగాయి. శ్రీకాకుళం గిరిజనోద్యమాన్ని వివరించే "పోరుదారి" నృత్యనాటికను ప్రదర్శించారు. వాన పడుతున్నా ప్రజలు ప్రదర్శనను తిలకించారు.

– మా ప్రతినిధి.

# గుజ్జార్ల ఆందోళన- వాగ్దానాల, హామీల మంటల్లో మండుతున్న రాజస్థాన్

రణజీత్ సింగ్

ప్రస్తుతం కొనసాగుతున్న గుజ్జార్ల ఆందోళన ఖచ్చితంగా వాగ్దానాల, హామీల నుండి జనించినదే. ఇంత వరకు గుజ్జార్లు రాజస్థాన్‌లో (ఓబిసి) ఇతర వెనుకబడిన వర్గాల క్రింద రిజర్వేషన్ పొందుతున్నారు. ఈ ధీరుల, వీరుల సమూహం తమ పరిస్థితిపై సంతృప్తితో ఉన్నారు. కానీ, జాట్లు సంఘటితమై, తమ పోరాట ఫలితంగా ఓబిసి కేటగిరిలో రిజర్వేషన్లు పొందడం, తమ పోరాట ఫలితంగా ఓబిసి (కేటాయింపబడటం) గెలవడం జరగడంతో, గుజ్జార్లు తాము ఓబిసి కేటగిరి నుండి షెడ్యూల్డు జాతుల రిజర్వేషన్ పొందడం తమకు రక్షణనిస్తుందని భావించి దానికోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారి ప్రయత్నాలకు శ్రీమతి వసుంధరా రాజె ఇచ్చిన హామీలు 'మంటల్లో నెయ్యి గుమ్మరించినట్లు' ఎగదోశాయి.

రిజర్వేషన్లపై నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో లేదని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఎప్పుడైతే ఒక ప్రత్యేక జాతి సమూహం రిజర్వేషన్ కొరకు నిర్ధారించబడిన చట్టాలను లేదా నియమాలు కలిగిన సూచిని కలిగి ఉంటుందో, అపుడే రాష్ట్ర ప్రభుత్వాలు వారిని రిజర్వేషన్‌కు అర్హత పొందినవారిగా సిఫార్సు చేయగలుగుతాయి. గత సంవత్సరం, గుజ్జార్లను షెడ్యూల్డు జాతులలో కలిపివేయాలనే డిమాండ్ ముందుకు వచ్చినపుడు, గుజ్జార్లకు షెడ్యూల్డు జాతుల హోదా కల్పించడానికి, వారి స్థితిగతులను అంచనా వేయడానికి, అధ్యయనం చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వం రిటైర్డ్ జస్టిస్ జస్‌రాజ్ చోప్రా అధ్యక్షతన కమిటీని నియమించి, రిపోర్టు ఇమ్మని ఆదేశించింది. జస్టిస్ చోప్రా తన రిపోర్టులో షెడ్యూల్డ్ జాతుల రిజర్వేషన్ కొరకు ఏర్పరచబడిన ప్రమాణాలు గుజ్జార్లు కలిగిలేరని, వారికి రిజర్వేషన్‌ను సిఫార్సు చేయలేదు. ఈ రిపోర్టును ఆధారం చేసుకొని రాజస్థాన్ ప్రభుత్వం గుజ్జార్లకు ఎస్.టిల రిజర్వేషన్ కొరకు సిఫార్సు చేయడానికి అశక్తత వ్యక్తంచేస్తూ, అందుకు బదులుగా ఒక ప్రత్యేక ప్యాకేజి ప్రకటించింది. కానీ గుజ్జార్లు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజిలు తమను మోసపుచ్చడానికేనని ఆరోపిస్తూ వాటిని నిరాకరించారు. అంతటితో ఆగకుండా రిజర్వేన్లను కోరుతూ తమ లేఖను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేస్తూ, అలా జరగని పక్షంలో ఆందోళనకు పిలుపునిస్తామని ఢంకా మోగించి చెప్పారు.

గుజ్జార్ల ఆందోళన మొదలు అయినప్పటి నుండి, రాజస్థాన్ ప్రభుత్వం వారి రిజర్వేషన్ డిమాండ్‌పై మోసపూరిత వైఖరితో కపట నాటకాలాడటంతో, మీనాజాతి ప్రజలు కోపంతో భగ్గుమన్నారు. రాజస్థాన్‌లో మీనాలు ఎస్టీలు. గుజ్జార్ల ఆందోళన తమ సౌకర్యాలకు గండికొడుతుందని భావించిన మీనాలు దానిని వ్యతిరేకించడం మొదలుపెట్టారు. ఫలితంగా గుజ్జార్ల-మీనాల మధ్య జాతుల సంఘర్షణలు తీవ్రంగా కొనసాగాయి. వీరి సంఘర్షణల్లో జననష్టం కొనసాగింది. అనేక జాతివాద, అవకాశవాద నేతలు ఈ మండుతున్న మంటల్లో తమ రొట్టెలు కాల్చుకోవడం మొదలుపెట్టారు. అంతేకాకుండా జాతుల మధ్య వైరాన్ని సమర్థించాలనే ప్రకటనలు గుప్పిస్తూ, ఈ జాతుల ఆందోళనలకు ఉగ్ర రూపాన్నివ్వడం మొదలుపెట్టారు. పాలకవర్గ పార్టీలు కూడా తమకు ఎన్నికల్లో ఉపయోగపడే అంశాల లెక్కతో ప్రజల జీవితాలతో ఆటలాడటం మొదలుపెట్టారు. పరస్పర చర్చలతో సమస్య పరిష్కారాన్ని నిజాయితీగా సాధించే ప్రయత్నానికి బదులు, క్షుద్ర రాజకీయ స్వార్థశక్తులు ఆ సమస్యను రెండు జాతుల మధ్య పరస్పర వైరంగా మార్చారు. వేల సంవత్సరాలుగా, సౌహార్థంగా మెలిగిన జాతుల మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. దానిని తొలగించడానికి ఎంత సమయం పడుతుందో ఎవరూ చెప్పలేరు.

ఇప్పుడు మనం గుజ్జార్ల ఆందోళన మొదలైన క్రమాన్ని ఒక్కసారి సంక్షిప్తంగా పరిశీలిద్దాం. భారత ప్రభుత్వం రాజస్థాన్‌లో ఎస్టీ, ఎస్‌సి కులాల జాబితా చివరిసారిగా 1977లో విడుదల చేసింది. దానిపై 1981లో గుజ్జార్లతో సహా చాలా జాతులు తమను ఎస్‌టీల్లో చేర్చమని కారణాలు చూపుతూ విజ్ఞాపన చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం యొక్క సాంఘిక సంక్షేమశాఖ ఈ విజ్ఞప్తులను పరిశీలించి, గుజ్జార్ల ఆర్థికస్థితి మెరుగ్గానే ఉందని, వారు ఆదిమ జాతుల ప్రత్యేక లక్షణాలు కలిగిలేరని తేల్చి చెప్పింది. ఫలితంగా, వారు ఎస్టీల్లో చేర్చడానికి తగినవారు కారని చెప్పింది. ఈ రిపోర్టు ఆధారంగా, అప్పటి ముఖ్యమంత్రి శివచరణ్‌మాథుర్, 17.10.1981న గుజ్జార్లను మినహాయించి సంచార జాతులైన బంజారాలను, కమ్మరులను (గాడియా లుహార్) ఎస్టీల్లో కలపడానికి సిఫార్సు చేశారు. అయినప్పటికీ భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ వారిని ఎస్టీల్లో కలపలేదు. రాష్ట్ర ప్రభుత్వం బి.సి. కమీషన్ సిఫార్సు మేరకు 1994లో అప్పటి ముఖ్యమంత్రి భైరాన్‌సింగ్ షెఖావత్, గుజ్జార్లను ఇతర వెనుకబడిన వర్గాల్లో కలపడం జరిగింది.

ఇక్కడ మనకు స్పష్టంగా తెలుస్తున్నదేమిటంటే, ప్రస్తుత సమయంలో ఏ జాతినైనా ఎస్టీల్లో కలపడమనే ప్రక్రియ అత్యంత క్లిష్టమైనది. ఇది కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో లేదు. ఈ ప్రక్రియలో ఏ జాతినైనా షెడ్యూల్డు జాతుల జాబితాలో చేర్చాలన్నా, తొలగించాలన్నా మొట్టమొదట రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ప్రతిపాదనలు పంపాలి. ఆ ప్రతిపాదనలపై భారత ప్రభుత్వ రిజిష్టర్ జనరల్ సిఫార్సు ఉంటుంది. దానితోపాటు జాతీయ ఎస్.సి., ఎస్.టి. కమీషన్ కూడా సిఫార్సు చెయ్యాలని ఉంటుంది. ఈ మూడు సిఫార్సుల తర్వాత ఆ ప్రతిపాదనలను ఇంటర్ మినిస్టీరియల్ కన్సల్టేషన్, దాని తర్వాత మంత్రిమండలి ముందు ఉంచాలి. తదుపరి దానిని బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. పార్లమెంటులోని రెండు సభల ద్వారా బిల్లు ఆమోదింపబడిన తర్వాతే అవసరమైన ఆర్డినెన్సు జారీ చేయబడుతుంది.

రాజస్థాన్‌లో గుజ్జార్ల డిమాండ్లను పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం హోం మంత్రి అధ్యక్షతన అత్యున్నత అధికారాలు గల సలహా మండలిని ఏర్పాటు చేసింది. 31 జూలై, 2007 వరకు ఈ మండలి సమావేశాలు జరుపబడ్డాయి. ఈ సలహా మండలి నేతృత్వంలో సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా కలెక్టర్లందరి నుండి గుజ్జార్ల గురించి కేంద్ర ప్రభుత్వం ఎస్టీల కొరకు నిర్దేశించిన ప్రమాణాలపై రిపోర్టు కోరింది. ఎక్కువ మంది కలెక్టర్లు వీరిని ఎస్టీలలో కలపడానికి తగినట్లు లేరని తెలియచేశారు.

దానిపై గుజ్జార్లు ఆందోళనను ప్రకటించారు. గుజ్జార్ల రిజర్వేషన్ పోరాట సమితి 29 మే, 2007న ట్రాఫిక్ నిలిపివేత ఆందోళన మొదలుపెట్టారు. ఈ ఆందోళనలో క్రూరమైన పోలీసు కాల్పులు 26 మంది ప్రాణాలు తీసుకున్నాయి. చాలా మంది గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత గుజ్జార్ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కల్నల్ భైంస్లా సమాజహితం కంటే దేశహితం మిన్నగా చెబుతూ, 4 జూన్, 2007న ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆందోళనను విరమించారు. ఒప్పందంలోని షరతులననుసరించి, రాష్ట్ర ప్రభుత్వం గుజ్జార్ల రిజర్వేషన్లపై అధ్యయనానికి హైకోర్టుకు చెందిన జస్టిస్ జస్‌రాజ్‌చోప్రా అధ్యక్షతన త్రిసభ్య కమీషన్‌కు అన్ని అధికారాల్నిస్తూ ఏర్పాటు చేసింది. దానితోపాటు, మృతుల బంధువులకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

రాష్ట్ర ప్రభుత్వం వేసిన చోప్రా కమిటీ గుజ్జార్ల డిమాండ్‌ను నిరాకరించి, వారి కొరకు ప్రత్యేక ప్యాకేజిని సిఫార్సు చేసింది. రాజస్థాన్ ప్రభుత్వం చోప్రా కమిటీ రిపోర్టును తమ మంత్రిమండలి ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి పంపి కేంద్రానికి బాధ్యత అప్పగించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసిది. దీనిని గుజ్జార్ నేతలు తీవ్ర స్వరంతో వ్యతిరేకించారు. దాని తర్వాత రాజస్థాన్ ప్రభుత్వం గుజ్జార్లను ఒక కొత్తశ్రేణి వారిగా చేస్తూ ఇతర ఎస్టీలుగా 4 నుండి 6 శాతం రిజర్వేషన్‌నివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

చోప్రా కమిటీ రిపోర్టు ఆధారంగా, రాష్ట్ర ప్రభుత్వం రామ్‌దాస్ అగర్వాల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సమితి సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం 17 మే, 2008న రాష్ట్రంలోని అభివృద్ధి చెందని సౌలభ్య హీనమైన, సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గుజ్జారుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కొరకు 282 కోట్ల రూపాయల ప్యాకేజి ప్రకటించింది. దానితోపాటు మృతి చెందిన ఆందోళనకారులపై ఆధారపడిన వారికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వడానికి అంగీకరించింది.

రాజస్థాన్ ప్రభుత్వం, గుజ్జార్లను ఇతర ఎస్టీలుగా గుర్తిస్తూ 4 నుండి 6 శాతం రిజర్వేషన్ సిఫార్సుచేస్తూ పంపిన లేఖను కేంద్ర ప్రభుత్వం శాసన వ్యవహారాల శాఖకు అప్పగించింది. ఈ విధంగా గుజ్జార్ల ఆందోళనకు సంబంధించిన అంశం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య బంతిలా తిరుగుతోంది.

గుజ్జార్ల ఆందోళన సందర్భంలో రాష్ట్రంలోని ఉన్నత న్యాయస్థానవైఖరి కూడా గమనించాల్సిన అవసరముంది. ఉన్నత న్యాయస్థానం, ఏ ప్రాంతంలోనైనా ప్రజాసమూహాల భారీ సభను నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ అనుమతి ముందుగా తీసుకోవడం అనివార్యం చేసింది. నిర్వాహకులు ఆ సందర్భంగా రాస్తారోకో లేదా బంద్‌కు పిలుపు ఇవ్వమని వ్రాతపూర్వకంగా హామీని ఇవ్వాల్సి ఉంటుంది. దానితోపాటు, ఉన్న న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని గుజ్జార్ల ఒత్తిడికి లొంగి వారికి రిజర్వేషన్ సిఫార్సు చేసే పత్రాలు కేంద్రాని పంపవద్దని కూడా కోరింది. ఉన్నత న్యాయస్థానం, గుజ్జార్ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడైన కల్నల్ భైంస్లాకు కోర్టును అవమానపరిచాడనే (కోర్టు ధిక్కారం) నోటీసును ఇచ్చింది. అంతేకాకుండా ఆందోళనను అపడానికి తీసుకున్న చర్యలు ఆందోళన జరిగే సమయంలో చట్టవ్యవస్థ కొనసాగడానికి చేసిన ఏర్పాట్లు తెలపమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

ప్రయత్నాలు, ఒప్పందాల ద్వారా సమస్యకు ప్రజాతంత్ర సమాధానాన్ని వెదకడానికి బదులు, రాజస్థాన్ ప్రభుత్వం ఆందోళనకారుల రక్తంతో హోలీ ఆడుతోంది. తన నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో 'మహారాణి' వసుంధరా రాజె ప్రభుత్వం ఆందోళనకారులపై 14 సార్లు బుల్లెట్ల వర్షం కురిపించింది. గుజ్జార్ల రిజర్వేషన్ పోరాట సమితి ద్వారా రైల్ రోకో ఆందోళనకు పిలుపు మే 19న ఇచ్చినప్పటికీ రాజస్థాన్ ప్రభుత్వం మే 23, 2008న ఆందోళన ప్రారంభం అయ్యే వరకూ ఎవర్నీ మధ్యవర్తులుగా పంపలేదు; కల్నల్ భైంస్లాతో సంప్రదింపులు జరుపలేదు; అన్ని పార్టీల మీటింగ్‌కు పిలువలేదు. పైగా ప్రభుత్వం కలెక్టర్లకు (రాసుకా)1 చర్యలు తీసుకొనే అధికారాన్నిచ్చింది.

న్యాయాధికారి శ్రీ ఇస్రాని ఇలా అంటున్నారు "గడచిన కొన్ని సంవత్సరాలుగా హింసాప్రవృత్తి పెరుగుతూ వస్తోంది. దీనికి ఒక కారణమేమిటంటే హింసాయుతంగా ఆందోళన చేస్తేనే ప్రభుత్వం దిగి వస్తుందని ఆందోళనకారులు భావించడం. గుజ్జార్లు ముందుగా ప్రకటించే ఆందోళన చేశారు. దానిని పిలుపుగా ఉన్నప్పుడే ఆపే ప్రయత్నం ప్రభుత్వం చేసి ఉంటే ఇంత తీవ్రంగా పరిస్థితులు మారేవి కావు. బుల్లెట్లు వదలడం కంటే ముందు టియర్ గ్యాస్, వాటర్ కానన్స్ లేదా డమ్మీ బుల్లెట్లను ఉపయోగించాలి. అంతేకాకుండా బుల్లెట్లు కూడా కాళ్ళను దాటి పైకి వదలకూడదు. చట్టబద్ధంగా బుల్లెట్ ప్రయోగం జరిగి ఉండినట్లైతే ఇన్ని మరణాలు సంభవించి ఉండేవి కావు".

కల్నల్ కిరోడీసింగ్ భైంస్లా రాజస్థాన్ పత్రికకు మే 25న ఫోన్‌లో ఇలా చెప్పారు–"బుల్లెట్లు వదిలే సమయంలో చట్టాన్ని వాళ్ళు అతిక్రమించారు.

(తరువాయి 11వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet, Vijayawada-2.
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | KLVA102M240 |
| పుస్తకం పేరు | జనశక్తి |
| తారీఖు | 07 February 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 13 |
| పెద్ద సైజు పేజీలు | yes |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | S.K. Sharmila |
| పేజీలు విడదీసినది | S.K. Sharmila |
| స్కాన్ చేసినది | Afsar |
| పరీక్ష చేసినది | AMRUTHA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |